

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి



శుక్రవారం | 9-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 210 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ. 12.16 తదుపరి దశమి; నక్షత్రం: అనూరాధ సా. 4.55 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 11.13-1.01; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.51, మ.12.53-1.38; అమృతఘడియలు: శేషం ఉ. 7.10 వరకు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.11 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

జోన్లు నాలుగే

కేడర్లు మాత్రం మూడు
మల్టీజోన్ పూర్తిగా ఎత్తివేత
రాష్ట్ర కేడర్ పోస్టుల కుదింపు
సీఎంకు చేరిన నివేదిక

6



మృతుడి భార్యకు 5 లక్షల చెక్కు ఇస్తున్న దయాకర్‌రావు

పత్తిరైతు పైకి వ్యాన్

2

మార్కెట్‌లో పంట ఆరబెట్టి నిద్రిస్తుండగా ఘోరం
చికిత్స పొందుతూ మృతి
వరంగల్‌లో దారుణం

బడులు, కళాశాలలకు గ్రేడింగ్!

ఒకటి నుంచే గురుకులాలు
అప్పట్నుంచే ఆంగ్ల మాధ్యమం

6

శామీర్‌పేటలో మెగా డెయిరీ!

100 ఎకరాల్లో ఏర్పాటు
విజయా బోర్డు ఆమోదం

5

రైల్వేలో 90 వేల ఖాళీలు

పదో తరగతి, ఐటీఐ చదివినవారికి సువర్ణావకాశం. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దాదాపు 90 వేల ఖాళీల భర్తీకి రెండు నియామక ప్రకటనలు విడుదల చేసింది. రాత పరీక్షల ద్వారా గ్రేడ్ - 4, అసిస్టెంట్ లోకో పైలెట్, టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనుంది. టెన్త్, ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు దిక్సూచి పేజీలో...



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం దూల్మిట్ట గ్రామంలో వరిసాగు

నిరంతర విద్యుత్తుతో..

నిండుగా వరి!

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన వరిపంట విస్తీర్ణం


24 గంటల కరెంటుతో నాట్లకు రైతుల మొగ్గు
రాత్రుళ్లు పొలాలకు వెళ్లే బెడద నుంచి ఊరట
ఆగకుండా నడుస్తున్న బోర్లు
పెరిగిన విద్యుత్తు వినియోగం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రైతు చెన్నయ్యకు ఐదెకరాల పొలం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తాడు. యాసంగిలో మాత్రం వరిసాగు జోలికి వెళ్లడు. ఉన్న ఐదెకరాల్లోనూ ఆరుతడి పంటలే వేస్తాడు. అయితే, ఇది గతం. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో తన ఐదెకరాల్లోనూ ఆయన వరి పంట వేశాడు. వర్షాకాలంలోనే పొలానికి నీళ్లు పెట్టేందుకు నానా కష్టాలుపడ్డ చెన్నయ్య.. ఈ యాసంగిలో మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా

మిగతా 5వ పేజీలో...

పది ఎకరాలకు సాగు పెంచాను



"నాకు పది ఎకరాల భూమి ఉంది. గత ఏడాది బావుల్లో నీరు ఉన్నా కరెంటుపై నమ్మకం లేక 3 ఎకరాల్లోనే వరిసాగు చేశాను. ఇంటిల్లిపాదీ వంతుల వారీగా నీరు పెట్టేందుకు పొలం వెళ్లేవాళ్లం. ఇప్పుడు నిరంతర విద్యుత్తుతో 10 ఎకరాల్లో వరి సాగు చేశాను. వంతుల బాధ తప్పింది. ఇతర పనులు చేసుకుంటున్నాం"

-రైతు నర్సింహులు, మార్లబీడు, మహబూబ్‌నగర్ జిల్లా

హైదరాబాద్‌లో రక్షణ కారిడార్

పెట్టండి!

రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ వినతి
కేంద్రమంత్రులు హర్షవర్ధన్, ధర్మేంద్రప్రధాన్‌తో భేటీ
నేడు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశం



ఢిల్లీలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన మంత్రి కేటీఆర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 2018-19 సంవత్సరానికిగాను కేంద్ర బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్లను కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో ఒక కారిడార్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేటీఆర్ కోరారు. ఢిల్లీ పర్యటనలో గురువారం ఆయన బిజీబిజీగా గడిపారు. నిర్మలా సీతారామన్‌ను కలిసి.. రక్షణ రంగానికి హైదరాబాద్‌కు అనుబంధం ఉందని, రక్షణ రంగ సంస్థలు, రక్షణ పరికరాల తయారీలో భాగ్యనగరం ముందు వరుసలో ఉందని ఆమెకు గుర్తుచేశారు. నగరంలో ఉన్న ఆర్‌సీఐ, డీఆర్‌డీఎల్, బీడీఎల్, డీఎంఆర్‌ఎల్, మిధాని, ఎన్‌ఎఫ్‌సీ, ఈసీఐఎల్, భెల్ వంటి సంస్థల గురించి ఉటంకించారు. విమానయాన, రక్షణ రంగాల్లో పలు ప్రైవేటు సంస్థలు ఉన్న విషయాన్ని వినతిపత్రంలో ప్రస్తావించారు. అలాంటి

మిగతా 5వ పేజీలో...

కండకావరం

కేసీఆర్, కేటీఆర్‌ల చెంపలు వాయించే రోజు దగ్గరలోనే

తండ్రి పెద్ద లోఫర్.. కొడుకు చిన్న లోఫర్: షబ్బీర్
చరిత్ర తెలియకుండా అడ్డగోలు విమర్శలా?
పెద్దవాళ్లను విమర్శిస్తే పెద్దోడివి అయిపోవు
మోదీ వ్యాఖ్యలపై ఎందుకు స్పందించరు?: భట్టి
తండ్రి అధికారం చూసి రెచ్చిపోతున్నాడు
కేసీఆర్ ధృతరాష్ట్రుడైతే కేటీఆర్ దుర్యోధనుడు
అహంకారానికి, కండకావరానికి నిదర్శనం
బ్రోకర్ పార్టీగా టీఆర్‌ఎస్: దాసోజు నిప్పులు
లత్కోర్ పార్టీని నడిపిస్తున్న మోసగాళ్లు
మోదీ ముందు మోకరిల్లిన కేసీఆర్: రేవంత్‌రెడ్డి
టీఆర్‌ఎస్ సవా లోఫర్ పార్టీ: అంజన్‌కుమార్



జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో మోదీ, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కాంగ్రెస్‌ను లోఫర్ పార్టీ అని విమర్శించిన మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. కేసీఆర్ పెద్ద లోఫర్ అని, కేటీఆర్ చిన్న లోఫర్ అని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తలుపులు మూసి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలనూ తప్పుబట్టారు. మోదీకి కేసీఆర్ భయపడుతున్నారని, ఇద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని

మిగతా 6వ పేజీలో...

కాంట్రాక్టుల్లోనూ రిజర్వేషన్లు!

ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు 6 శాతం
కేసీఆర్ యోచన
త్వరలో నిర్ణయం


హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాంట్రాక్టుల్లోనూ ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకోనుంది. కాంట్రాక్టు పనుల్లో దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించనుంది. ఈ దిశగా సీఎం కేసీఆర్ యోచిస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టు పనుల్లో ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సీఎం భావిస్తున్నారు. తెలంగాణలో దళిత, గిరిజన ఉప ప్రణాళిక అమలవుతున్న

మిగతా 5వ పేజీలో...

పాపం పీఈసీదే!

ఢిల్లీలో రికార్డుల టాంపరింగ్.. పైసీస్ డైరెక్టర్లతో కుమ్మక్కు

భూమిపై హక్కుల్లేని శివభూషణ్
అతను చూపించిన పత్రాలన్నీ బోగస్సే
దొంగ రికార్డులకు రుణం ఇచ్చిన పీఈసీ
భూముల విలువ లెక్కింపూ బూటకమే
కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన తహసీల్దార్
ఎనిమీ ప్రాపర్టీపై రాష్ట్ర సర్కార్‌దే నిర్ణయం



తనఖా డాక్యుమెంట్‌లోని రెండో పేజీలో 'పది లక్షలు'ను చేత్తో రాసిన వైనమిది

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కొత్వాల్‌గూడ భూములను అడ్డు పెట్టుకుని రూ.332 కోట్లు నొక్కేసిన మోసమంతా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పీఈసీ (ది ప్రాజెక్ట్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)దేనా!? పైసీస్ డైరెక్టర్లకు అందులోని కొందరు ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో సహకరించారా? పీఈసీ ఉన్నతాధికారులు, పైసీస్ డైరెక్టర్లు కలిసే ఈ కుంభకోణానికి పాల్పడ్డారా!? ఈ ప్రశ్నలు అన్నిటికీ 'ఔను' అనే అంటున్నాయి అధికార వర్గాలు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామం తాకట్టు వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.332 కోట్లు నొక్కేసిన పైసీస్ ఎగ్జిమ్ ఇండియా లిమిటెడ్‌కు పీఈసీ అధికారులు అన్నివిధాలా సహకరించినట్లు తెలిసింది. ఈ మొత్తం కుట్రలో కొంత భాగం ఎల్బీ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరగగా.. మిగతా మోసమంతా ఢిల్లీలోని పీఈసీలో జరిగింది. థర్డ్ పార్టీ ద్వారా 2014 మే రెండో తేదీన ఈ భూమిని తనఖా పెట్టిన

మిగతా 6వ పేజీలో...

కొత్వాల్‌గూడ తాకట్టుపై కదిలిన ప్రభుత్వం

సమగ్ర నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు

6



5

చిరువ్యాపారులపై 'లైసెన్స్' కొరడా!

వ్యాపారం స్థాయిని బట్టి బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి
లైసెన్స్ లేకుంటే భారీ జరిమానా
మార్కెటింగ్ చట్టంపై జీవో జారీ
రోజుకు రూ.5000 లోపు టర్నోవర్ ఉంటే లైసెన్స్ అక్కర్లేదు



పాద పూజా వైభవం



"నీ పాద కమల సేవయు
నీ పాదార్చకుల తోడనెయ్యమును నివాం
తాపార భూత దయయును
తాపస మందార నాకు దయచేయగదే"

పోతన భాగవతంలోని ఈ పద్యం ప్రసిద్ధమైంది. భగవద్వర్ణన చేసేటప్పుడుగానీ, నమస్కరించేటప్పుడుగానీ స్వామి దివ్య పాదారవిందాల యందే మన మనస్సును లగ్నం చేయటం ఒక ఆచారం. భగవద్వర్ణన , మనుష్య వర్ణనలను ఎట్లా ఆరంభించాలనేదానిపై మన పూర్వులు ఒక నియమం ఏర్పరచినారు.

చిరంతన స్యాసితథా శివచంద్రస్య బాలతా
మానవా మౌళితో వర్ణ్యాదేవాశ్చరణతః పునః
(అలంకార శేఖరం)

వర్ణించేటప్పుడు మానవుణ్ణి శిరస్సు నుండి, దేవతలను పాదాల నుండి అనేది ఈ నియమం. అందుకే- 'చరణౌ శరణం ప్రపద్యే' అంటాం. స్తోత్రాల్లోను, శతకాల్లోను ఇట్లా పాద శరణ ప్రసక్తి ప్రభావాలు అధికం. సంస్కృతంలో వచ్చిన స్తోత్ర సాహిత్యం భగవత్ పాద వైభవాన్ని విశేషంగా తెల్పింది. ప్రత్యేకంగా పాద స్తుతి రచనలు వచ్చినాయి. ఉదాహరణకు.. శ్రీరామ పాద స్తుతి..మూక పండితుని 'పంచశతి'లోని పాదారవింద శతకం కేవలం కంచి కామాక్షీ దేవి పాద వర్ణనకే రచించబడింది. శంకరాచార్యులవారి 'పాదాదికేశాంతస్తవంలోనూ.. పాద మహిమాభి వర్ణన ఉంది. పాదపూజ- పాద పవిత్రత యింత గొప్పది కాబట్టే- పూర్వ పూర్వులైనవారు, యోగ్యులైనవారికే పాదాభివందనం చేయవలెనన్నారు. కాని ఈ రోజుల్లో అనేక రకాలుగా, అనేక వ్యక్తుల పాదాలను పట్టి నమస్కారాలను పెట్టడం ఆనవాయితీ అయింది. వివాహ సమయంలో వరుణ్ణి 'లక్ష్మీనారాయణ స్వరూపునిగా అర్చించి' పాద ప్రక్షాళనం చేస్తారు.

- శ్రీరంగాచార్య

Paramjyothi
పరంజ్యోతి

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.4	34.5
సంగారెడ్డి	17.0	31.0
రామగుండం	17.2	34.4
హైదరాబాద్	17.9	33.8
వరంగల్	18.0	32.5

రేపు, ఎల్లుండి తేలికపాటి జల్లులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో శని, ఆది వారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. గురువారం ఖమ్మంలో సాధారణం కంటే 9 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లో 3 డిగ్రీలు, భద్రాచలంలో 2 డిగ్రీలు, హన్మకొండ, నల్లగొండ, రామగుండంలో ఒక డిగ్రీ మేర సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గడ్డాలు పెంచుకుంటే అధికారంలోకి వస్తారా?


- కాంగ్రెస్‌కు ఏడు సీట్లు కూడా రావు
- ఎప్పటికీ మా లీడర్ కేసీఆరే: మంత్రి తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గడ్డాలు.. మీసాలు పెంచుకుంటే అధికారంలోకి వస్తారా? అలా అయితే.. అంతా అదే పనిచేస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు 70 సీట్లు వస్తాయని కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి ఏడు సీట్లు రావడం కూడా గగనమేనని జోస్యం చెప్పారు. ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎప్పటికీ తమ లీడర్ కేసీఆర్ అన్నారు. 'కాంగ్రెస్‌లో ఉన్నదే పదిమంది. వారంతా ఎవరికి వారే తాము కాబోయే ముఖ్యమంత్రులమని ఊహించుకుంటున్నారు. మేము రొటీన్‌కి భిన్నంగా పాలన అందిస్తున్నాం. గత ప్రభుత్వాల్లా మూసపద్ధతిలో వెల్లడం లేదు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా 1.14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం' అని స్పష్టం చేశారు.

అటవీ సంపద, వన్యప్రాణుల్ని కాపాడుకోవాలి

- అసెంబ్లీ కమిటీ భేటీలో మధుసూదనాచారి



హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అద్భుతమైన అటవీ సంపద ఉందని, దాన్ని కాపాడుకోవాలని స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. రాష్ట్రంలోని సహజ ఆవాసాలను పరిరక్షించుకోవటంతోపాటు పర్యాటకంగా తెలంగాణని దేశంలోనే గొప్ప ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణపై శాసనసభా కమిటీ తొలి సమావేశం గురువారం ఇక్కడ జరిగింది. వన్యప్రాణుల రక్షణ, అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, ఎకో టూరిజం అభివృద్ధిపై సమగ్ర నివేదిక తయారు చేయాలని మధుసూదనాచారి అధికారులకు సూచించారు. దానిని అసెంబ్లీ కమిటీ తరపున ప్రభుత్వానికి పంపించాలన్నారు. వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కోసం అటవీశాఖ చేపట్టిన కార్యక్రమాలపై పీసీసీఎఫ్ పీకే ఝా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సభ్యుల ప్రశ్నలకు అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్‌తో కలిసి ఆయన సమాధానాలు చెప్పారు. వేట నియంత్రణకు పోలీసులు, అటవీ సిబ్బందితో ఉమ్మడి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ఎకో టూరిజం అభివృద్ధికి త్వరలోనే ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని రజత్ కుమార్ అన్నారు.

దళారులు ధాన్యం తెస్తే కేసులే

మార్కెట్‌లలో టాస్క్‌ఫోర్స్ బృందాలతో నిఘా



ఆరుట్లకు బుల్లెట్‌పై వెళ్తున్న మంత్రి హరీశ్‌రావు

- త్వరలో శనగలు, పల్లీలకు కొనుగోలు కేంద్రాలు
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్
- సంగారెడ్డిలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, సంగారెడ్డి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే దళారులపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్, నీటి పారుదల శాఖల మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. దళారీ వ్యవస్థను సమూలంగా అరికట్టాలని, రైతులకే పంట మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన రాష్ట్రంలోని కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేరుగా రైతులనుంచే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు కో-ఆపరేటివ్ సొసైటీలో కాకుండా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలన్నారు. శెనగలు, పల్లీల దిగుబడి అధికంగా ఉన్నందున వీటికి త్వరలో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కందుల కొనుగోలుకోసం ఇప్పటికే ఏర్పాటుచేసిన సొసైటీ కొనుగోలు కేంద్రాలను సమీపంలోని మార్కెట్ కమిటీలకు అనుసంధానం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసి మార్కెట్ కమిటీల్లో క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలని మంత్రి సూచించారు.

బుల్లెట్ నడిపిన మంత్రి

మంత్రి హరీశ్ బుల్లెట్ నడిపి టీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. గురువారం సంగారెడ్డి నుంచి ఆరుట్ల గ్రామంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయల్దేరిన ఆయనకు కార్యకర్తలు ప్రధాన రహదారిపై ఘనస్వాగతం పలికారు.బైక్‌ర్యాలీతో మంత్రిని ఆరుట్లకు తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో హరీశ్ తన వాహనం దిగి ఓ కార్యకర్త దగ్గర నుంచి బుల్లెట్ తీసుకున్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌ను వెనుక కూర్చోబెట్టుకొని మూడు కిలోమీటర్ల దూరం బుల్లెట్ నడిపారు.

ఎలక్ట్రానిక్ రికార్డుల్లో రోగుల వివరాలు

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలను ఎలక్ట్రానిక్ రికార్డుల్లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి హరీశ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో వెల్‌నెస్ కేంద్రాన్ని ఆయన మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. రోగుల ఆరోగ్య వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లో నమోదుచేసే ప్రక్రియను సంగారెడ్డిలో ప్రారంభించామన్నారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ సాధించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్సీలు భూపాల్‌రెడ్డి, రాములు నాయక్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మటన్ ప్రియుడు

- ఆరెకటికల సంక్షేమానికి కృషి చేస్తాం
- ఫెడరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు
- మంత్రులు ఈటల, జోగు



ఆరెకటిక శంఖారావం వేదికపై మంత్రులు, ఇతర నాయకులు

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు మటన్ ప్రియుడని.. ఆరెకటికలందరికీ ఆయన మంచి అభిమాని అని మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న అన్నారు. ఆరెకటికల సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబడి ఉందని, వారికోసం ఒక ఫెడరేషన్ ఏర్పాటుకు ఇప్పటికే సీఎంకు నివేదిక ఇచ్చామని తెలిపారు. ఆరెకటికల పోరాట సమితి ఆధ్వర్యంలో.. గురువారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన 'ఆరెకటికల శంఖారావం'లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని.. ప్రసంగించారు. సంక్షేమానికి తమ సర్కారు పెద్దపీట వేసిందని, 500 గురుకులాలను స్థాపించి, ఒక్కో విద్యార్థి మీద రూ 1.05లక్షలు ఖర్చు పెడుతోందన్నారు. 'కుల వృత్తులు చేసుకునే వారికి బ్యాంకులతో సంబంధం లేకుండా రూ. 2లక్షల వరకు రుణాలిచ్చే వ్యవస్థను తీసుకురానున్నాం. మటన్ మార్కెట్‌ల ఏర్పాటుకు ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆరెకటికలు ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు అండగా ఉన్నారు. వారి బతుకులు మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. దేశ బడ్జెట్‌లో బీసీల కోసం రూ. 1,250కోట్లు కేటాయిస్తే, తెలంగాణ రాష్ట్రం రూ. 5,070 కోట్లు ఇచ్చింది. ఆరెకటికలను ఎస్సీల్లో చేర్చాలనే ప్రతిపాదన కేంద్ర పరిధిలోనిది. ఆ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. రాష్ట్ర పరిధిలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తాం' అన్నారు. ఆరెకటికల పోరాట సమితి నేతలు మాట్లాడుతూ.. తమను ఎస్సీ జాబితాలో కలపాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో మాంసం విక్రయాలకు అధునాతన భవనాలను నిర్మించాలని కోరారు. విద్యార్థులకు వసతి, స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగాల్లో 3-5 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కార్పొరేట్ వైద్యం, వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఆరెకటికల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోగికర్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్ రమణ, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జాతీయ బీసీ మహిళా కమిటి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, కాంగ్రెస్ ప్రతినిధి నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



టీఎంసీ నేతలవి మురికి ముఖాలు

తృణమూల్ కాంగ్రెస్ నేతలవి మురికి ముఖాలు. ఒకసారి వారు తమ ముఖాలను అద్దంలో చూసుకోవాలి. గవర్నర్ కార్యాలయంపై విమర్శలు చేయడం మానుకోవాలి. వారి ముఖాలకు అంటిన మురికిని శుభ్రంగా కడుక్కోవాలి.

- పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేఎన్ త్రిపాఠి




జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలన్న ఆలోచన అప్రజాస్వామికం. అది అసాధ్యం కూడా. ఏకాలంలో ఎన్నికల నిర్వహణ ప్రాథమికంగా పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థనే దెబ్బతీస్తుంది.

- సీపీఎం నేత ప్రకాశ్ కరత్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.71	పాత ధర 69.77
కొత్త ధర రూ.77.70	కొత్త ధర 69.70
తగ్గుదల : 1 పైస	తగ్గుదల: 7 పైసలు



వాయు కాలుష్యంతో అనైతిక ప్రవర్తన!

న్యూయార్క్, ఫిబ్రవరి 8: వాయు కాలుష్యంతో ఆరోగ్యం పాడవడమే కాదు.. మానసికంగా దెబ్బతిని అనైతికంగా ప్రవర్తిస్తామట. కనీసం దాని గురించి ఊహించుకున్నా మనలో నైతిక విలువలు దెబ్బతినే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. వాయుకాలుష్యం మోసం, నేరప్రవృత్తికి అలవాటు పడేలాచేసే అవకాశాలున్నాయని భారత్, అమెరికాలో నిర్వహించిన సర్వేలో వెల్లడైందని అమెరికాలోని కొలంబియా బిజినెస్ స్కూల్ శాస్త్రవేత్తలు తెలిపారు. కాలుష్యానికి, నేరచరిత్రకు మధ్య సంబంధంపై పరిశోధనలు చేయగా కాలుష్యం అధికంగా ఉన్న నగరాల్లో ఎక్కువ నేరాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.

హుక్కాతో న్యుమోనియా

లండన్, ఫిబ్రవరి 8: ఎలక్ట్రానిక్ సిగరెట్, హుక్కా వంటి వాటితో న్యుమోనియా వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ-సిగరెట్ల వల్ల ప్రమాదం లేదని చాలా మంది అనుకుంటారని, కానీ, వాటిలోని ఆవిరితో ఊపిరితిత్తులు ఇన్ఫెక్షన్లకు గురై ఈ వ్యాధి బారినపడే అవకాశాలున్నాయని యూకేలోని క్వీన్‌మేరీ వర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

జీతం సరిపోక.. అమ్మకు డబ్బు పంపలేక..

- కువైత్‌లో జగిత్యాల జిల్లా వాసి ఆత్మహత్య

మంచిర్యాల/సారంగాపూర్, ఫిబ్రవరి 08(ఆంధ్రజ్యోతి): 'మోసపోయిన.. కంపెనీవాళ్ల చేయబట్టి మోసపోయిన, దిమాక్ కరాబైతంది. గిట్లయితే బతుకుడు కష్టం. అమ్మకు పైసలు పంపుతనన్న. రెండు నెలలైపోయింది. కనీసం 50, 60 వేలైనా పంపుతానని అనుకున్న. ఈ నెల కాకుంటే వచ్చే నెల పంపుతననుకున్న. పోయిన నెల తక్కువ ఇచ్చిండ్రు. ఈ నెల కూడా తక్కువ ఇస్తే చేతిక్కూడ తీస్కోలే. అర్థమైతలేదు. చనిపోతున్నా. జన్ముంటే మల్ల కలుసుకుందాం. మహిగా.. రాజేష్, విజ్జిగా ఏమనుకోకుండ్రి. బాయ్.. అందరు మంచిగ ఉండుండ్రి. చచ్చిపోతున్న' అంటూ వాయిస్ మెయిల్ పెట్టి మరీ కువైత్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన తోట నాగరాజు(25). వ్యవసాయ కూలీలైన కళావతి, శంకర్ దంపతుల కొడుకు నాగరాజు ఇంటర్ చదివాడు. వీరి కుటుంబం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లి నుంచి కొన్నేళ్ల క్రితం పెంబట్లకు వలస వచ్చింది. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో ఒక ఏజెంట్ ద్వారా ఏడాదిన్నర కిందట కువైత్ వెళ్లాడు. రెండు మూడు కంపెనీల్లో పని చేశాడు. 2 నెలల క్రితం 'యూరోపియన్ కార్ సర్వీసెస్' అనే కంపెనీలో చేరాడు. మంచి జీతం ఇస్తామన్న యజమాని మొదటి నెల తక్కువ జీతమిచ్చాడు. రెండో నెల అంతకంటే తక్కువ ఇవ్వడంతో తీసుకోలేదు. చివరికి తల్లికి ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయాననే బాధతో పైసలు పంపలేకపోతున్నాననే వేదనతో తమ్ముడు రాజశేఖర్‌కు వాయిస్ మెయిల్ పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం గురువారం సాయంత్రం తెలిసింది. 2నెలల నుంచి కొడుకు డబ్బులు పంపుతనంటున్నడని.. కుదరక చివరికి ఆత్మహత్య చేసుకున్నడని ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, నాగరాజు మృతదేహాన్ని ఇక్కడికి రప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నా కుమారుడు ఖతర్ జైల్లో..

- కాపాడాలంటూ సుష్మాస్వరాజ్‌కు ఓ తల్లి గోడు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఖతర్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని.. ప్రయత్నించి వస్తానని విజిట్ వీసాపై ఈ నెల 1న అంబర్‌పేటలోని ఆకాశ్‌నగర్‌కు చెందిన షేక్ సొహైల్(23) వెళ్లాడు. కానీ ఆ రోజు నుంచి ఇంటికి ఎలాంటి సమాచారం లేదు. తమ కొడుక్కి ఏమైందో ఏమోనని తల్లి మెహరున్నిసా, ఇతర కుటుంబసభ్యులు.. అక్కడి ఎంబసీని ఆశ్రయించడంతో విస్తుపోయే విషయం తెలిసింది. సొహైల్ నిషేధిత వస్తువులు తీసుకొచ్చాడని ఇమ్మిగ్రేషన్ అధికారులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారని ఖతర్‌లోని దోహా ఎంబసీ గురువారం వివరించింది. ఖతర్ అధికారుల చెరలో ఉన్న తమ కుమారుడిని రక్షించి తిరిగి భారత్‌కు రప్పించాలని కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌కు సొహైల్ తల్లి లేఖ రాశారు.

పత్తిరైతుపైకి వ్యాన్

- పంట ఆరబెట్టి నిద్రిస్తుండగా ఘోరం
- ఛిద్రమైన నడుం భాగం.. చికిత్సపొందుతూ మృతి
- వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో దారుణం
- కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నేతల నిరసన
- 30 లక్షల పరిహారం, ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్
- మృతుడి కుటుంబానికి 5లక్షల సాయం

వరంగల్ అర్బన్, మట్టెవాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒక నిబంధన.. తేమ పత్తిని కొనుగోలు చేసేది లేదన్న ఆ నిబంధన ఓ గిరిజన రైతు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. అతడిపైనే ఆధారపడి బతుకుతున్న కుటుంబంలో పెను విషాదాన్ని నింపింది. ఎన్నో ఆశలతో పత్తిని వ్యవసాయ మార్కెట్‌కు తెచ్చిన ఆ గిరిజన రైతు.. పత్తిలో తేమ 15 శాతం మించి ఉందని, కొనలేమని వ్యాపారులు తేల్చడంతో నిరాశచెందాడు. పంటను అమ్ముకున్నాకే ఇంటికి వెళ్దామని నిర్ణయించుకొని, పత్తిని మార్కెట్ ప్రాంగణంలోనే ఆరబెట్టాడు. రాత్రి కావడంతో అక్కడే నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో మిర్చిలోడుతో ఓ వ్యాను ఆవైపు దూసుకొచ్చింది. ఆదమరచి నిద్రిస్తున్న ఆ రైతు మీద నుంచి వెళ్లింది. ఈ ఘటనలో ఆ పత్తిరైతు నిండు ప్రాణాలు గాల్లోకలిశాయి. ఈ హృదయవిదారకమైన ఘటన వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడిని జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాదాపురం పరిధిలోని దేవునిగుట్ట తండాకు చెందిన బానోతు రవి (45)గా గుర్తించారు. పత్తిని మార్కెట్‌కు తెచ్చిన వెంటనే కొనుగోలు చేసివుంటే.. ఈ ఘోరం జరిగేది కాదని మృతుల కుటుంబీకులు కన్నీళ్లపర్యంతమయ్యారు.

వాహనాలకు ప్రత్యేక దారి ఉన్నా..

వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యమే రవి నిండు ప్రాణాలను తీసింది. మార్కెట్‌లో వాహనాల కోసం ప్రత్యేకమైన దారి ఉన్నా.. డ్రైవర్ కల్లంలోంచి వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. వ్యాన్ టైరు రవి నడుం భాగంపై నుంచి వెళ్లడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే నిద్రిస్తున్న సోదరులు.. మార్కెట్ సెక్యూరిటీ గార్డులతో కలిసి రవిని హుటాహుటిన ఎంజీయం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ రవి ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కాగా పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు రవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు, అడ్తిదారులు, వ్యాపారులతో చర్చించి రూ.5 లక్షల చెక్కు ఇప్పించారు. అనంతరం మృతుల కుటుంబీకులకు ఎర్రబెల్లి సొంతంగా రూ. లక్ష నగదును అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున రూ. లక్ష అంతిమ సంస్కారాలకు మార్కెట్ ఉద్యోగులు రూ.20వేలు అందజేశారు.

విపక్షాల ఆందోళన

పత్తికొనుగోళ్లలో మునుపెన్నడూ లేని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టడం వల్లే రైతు రవి ప్రమాదం బారిన పడి మరణించాడని కాంగ్రెస్ నేత, మాజీ చీఫ్‌విప్ గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన.. ఎంజీఎం ఆస్పత్రి వద్ద రవి కుటుంబీకులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఇతర నేతలతో కలిసి ఎంజీఎం ఆస్పత్రికి వెళుతున్న గండ్రను పోలీసులు అడ్డుకొని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ గండ్ర విలేకర్లతో మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే సీఎం కేసీఆర్.. పంటలకు గిట్టుబాటు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అంతకుముందు.. బీజేపీ, టీడీపీలకు చెందిన పలువురు నేతలు వ్యవసాయ మార్కెట్ వద్ద ధర్నా చేపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు.



సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు అమినాబీ

వృద్ధురాలి ప్రాణం తీసిన ఈ-పాస్

- రేషన్ బియ్యానికి వెళ్లి అస్వస్థతతో మృతి

సిరికొండ, ఫిబ్రవరి8: ఆ వృద్ధురాలది నడవలేని స్థితి! మునుపు ఊర్లో రేషన్ బియ్యం వస్తే.. ఆమె ఇతరుల సాయం తీసుకునేది. కార్డు ఇస్తే చౌకధరల దుకాణం నుంచి బియ్యాన్ని వారే ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-పాపస్ విధానం ఆ పండుటాకుకు ప్రాణాంతకమైంది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని చౌకధరల దుకాణం వద్ద గురువారం అదే గ్రామానికి చెందిన అమినాబీ (75) సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెకు స్థానికులు సపర్యలు చేశారు. ఇంటికి వెళతానంటే ఆటో ఎక్కించి పంపించారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇంట్లోనే ఆమె మృతి చెందింది. ఈ-పాస్ విధానమే ఆమె ప్రాణం తీసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం ప్రకారం లబ్ధిదారులు స్వయంగా వెళ్లి, వేలిముద్రవేస్తేనే రేషన్ సరుకులిస్తారు. గతంలో ఇతరుల సహాయంతో ఆమె బియ్యం తెచ్చుకునేదని, 6కిలోల బియ్యం కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

▸ **బావిలో పడి రైతు మృతి**


నితీష్ (ఫైల్)

కథలాపూర్/ ధర్మారం, ఫిబ్రవరి 8: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన ముస్కు వినీష్ అలియాస్ నితీష్ (26) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. వినీత్‌కు రెండు ఎకరాల సాగు భూమి ఉంది. దాదాపు 5 లక్షల రూపాయల అప్పు చేసి ఐదు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. దీంతోపాటు మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కానంపల్లిలో దీటి నర్సయ్య (42) తన రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. అడవి పందుల బెడద ఉండడంతో రాత్రి వేళ పెద్దగా చప్పుడు చేసుకుంటూ నడిచి వస్తుండగా.. వ్యవసాయ బావికి బిగించి ఉన్న కరెంట్ మోటార్ తాడు కాలికి అడ్డ తగలడంతో అదుపుతప్పి బావిలోపడి మృతి చెందాడు.

రోడ్ల నిర్మాణంతో సత్వర అభివృద్ధి: తుమ్మల

▸ **కార్మికులకు సహాయం పెంపు: నాయిని**

▸ **మోరీల్లో పడేది కాంగ్రెస్ పదవులే: జగదీశ్‌రెడ్డి**

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: రహదారుల నిర్మాణంతోనే గ్రామాలు, పట్టణాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ముత్యాలగూడెం నుంచి తిరుమలాయపాలెం మండలం తిమ్మక్కపేట వరకు చేపట్టిన బీటీ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. అన్ని ప్రధాన రహదారులతో పాటు గ్రామాలు, తండాలను కలుపుతూ పూర్తిస్థాయిలో రహదారి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఇప్పటికే అన్ని గ్రామలను కలుపుతూ రోడ్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. కార్మికులకు గత ప్రభుత్వం అందించిన సహాయాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందని, కార్మికులంతా సంక్షేమ బోర్డులో పేర్లను నమోదు చేసుకుంటే మరిన్ని పథకాలను అమలు చేస్తామని మంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. గురువారం కరీంనగర్‌లో జరిగిన భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగ కార్మికుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 63 మంది కార్మికులు, కార్మిక కుటుంబాలకు రూ.2.82 కోట్ల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను మంత్రులు నాయిని, ఈటల రాజేందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మోరీల్లో పడేది టీఆర్ఎస్ కార్యకర్తల తలలు కాదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల పదవులని, అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లి, గుంటిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండలో తాగి, తన్నుకుని, చంపుకున్న చిల్లర పంచాయితీని టీఆర్ఎస్‌కు అంటగట్టడం సరికాదన్నారు.


రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

రాజన్న హుండీ ఆదాయం రూ. 1.07 కోట్లు

వేములవాడ, ఫిబ్రవరి 8 : రాజన్న జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి హుండీ ద్వారా భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది. గత నెల 25 నుంచి 14 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. కోటి 7 లక్షల 83 వేల 329 రూపాయల నగదు, 200 గ్రాముల బంగారం, 11 కిలోల 400 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు. 1.06 లక్షల రద్దయిన నోట్లు లభించాయి.

చిన్నారిని చిదిమేసిన లారీ


కార్తికేయ (ఫైల్)

భువనగిరి క్రైం, ఫిబ్రవరి 8: లారీ కింద పడి రెండేళ్ల బాలుడు దుర్మరణం చెందిన సంఘటన భువనగిరి పట్టణ శివారులో గురువారం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన గణపతి యాదయ్య తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గురువారం ఉదయం మోటార్ సైకిల్‌పై యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి బయలుదేరాడు. పట్టణ శివారులోని డాల్ఫిన్ హోటల్ వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డుపైకి వెళ్లే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో యాదయ్య కుమారుడు కార్తికేయ కిందపడ్డాడు. అదే సమయంలో నెల్లూరు నుంచి జగదేవ్‌పూర్ వెళ్తున్న లారీ టైరు బాలుడిపైకిఎక్కింది. దీంతో బాలుడి శరీరం నుజ్జునుజ్జు అయింది.

డీసీఎం బోల్తా.. ముగ్గురు మృతి

చిట్యాల, ఫిబ్రవరి 8: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో జాతీయ రహదారిపై గురువారం డీసీఎం వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురు గొర్రెల వ్యాపారులతో పాటు 56 గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొల్లపల్లికి చెందిన దొనికి కుమారస్వామి (40), సంగెం మండలం కృష్ణానగర్‌కు చెందిన మేకల మల్లయ్య(36), చెన్నరావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన కొల్లూరు రాకేశ్ (22)లు బుధవారం నెక్కొండ సంతలో 105 గొర్రెలను కొనుగోలు చేశారు. వాటిని హైదరాబాద్‌లో అమ్మడానికి అదే రాత్రి డీసీఎంలో తీసుకుని బయలుదేరారు. వెలిమినేడు శివారులో డీసీఎం అదుపుతప్పి కల్వర్టులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ముగ్గురు వ్యాపారులు మృతిచెందగా, ఉప్పరపల్లికి చెందిన డీసీఎం డ్రైవర్ వెంకన్నకు తీవ్రగాయాలయ్యాయి. వాహనంలో ఉన్న 56 గొర్రెలు మృతి చెందాయి. వెంకన్నను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

17నుంచి యాదాద్రిలో బ్రహ్మోత్సవాలు

యాదాద్రి: యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27 వరకు 11రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నందున ఆగమ శాస్త్ర ప్రకారం ఉత్సవ కైంకర్యాలు, అలంకార సేవలు బాలాలయ మండపానికే పరిమితం కానుండగా.. స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవాలను భక్తుల దర్శనార్థం కొండ కింద నిర్వహించనున్నారు. ఈనెల 17న స్వస్తివాచనం, 18న ధ్వజారోహణం, 19నుంచి ఉదయం, రాత్రి స్వామి వారి దివ్య అలంకార, వాహన సేవలు నిర్వహిస్తారు. ఎదుర్కోలు ఈ నెల 23న జరుగుతుంది. 24న కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సీఎం కేసీఆర్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు.

బీజేపీవి అవకాశవాద రాజకీయాలు

▸ **సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

బాల సముద్రం/మేడారం, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్ర విభజన బిల్లుపై బీజేపీ, టీడీపీ అప్పుడు బహిరంగంగా ప్రకటించి, ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. గురువారం హన్మకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నాడు తెలంగాణ కోసం పోరాడిన బీజేపీ, తెలంగాణ కోసం లేఖ ఇచ్చిన టీడీపీలు, నేడు రాష్ట్ర విభజన సరిగా జరగలేదంటూ మొసలికన్నీరు కారుస్తున్నాయని అన్నారు. కాగా, మేడారం సమ్మక్క-సారలమ్మలను నారాయణ దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


మేడారం గద్దెల ఆవరణలో నారాయణ

కృష్ణానదిలో చిక్కుకున్న శివస్వాములు

▸ **మర పడవకు అడ్డుపడిన చేపల వల**

▸ **సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన పోలీసులు**

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్, ఫిబ్రవరి 8 : శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో మొక్కులు తీర్చుకోవడానికి బయల్దేరిన శివస్వాములకు ప్రాణాపాయం తప్పింది. శివస్వాములు, వారి కుటుంబ సభ్యులు 22 మంది ప్రయాణిస్తున్న మర పడవ, చేపల వలకు చిక్కుకొని కృష్ణా నది మధ్యలో నిలిచిపోయింది. దాదాపు రెండు గంటల పాటు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడిపిన వారిని పోలీసులు ఒడ్డుకు చేర్చారు. పాన్‌గల్ మండలానికి చెందిన ఎనిమిది మంది శివస్వాములు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 22 మంది శ్రీశైలం బయలుదేరారు. మధ్యాహ్నం కర్నూల్ జిల్లా కొత్తపల్లి మండలం మాడ్గుల వద్ద వారు ప్రయాణిస్తున్న మర పడవ కృష్ణా నదిలో చేపల వలకు చిక్కుకుంది. ఎంత ప్రయత్నించినా వల లోంచి పడవ బయటకు రాలేదు. దీంతో 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కొల్లాపూర్ ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది సోమశిల నుంచి ప్రత్యేక పడవలో సంఘటన స్థలానికి చేరుకొన్నారు. శివస్వాములను, వారి కుటుంబ సభ్యులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చి ఆత్మకూర్ సీఐకి అప్పజెప్పారు.


కృష్ణా నది మధ్యలో నిలిచిపోయిన పడవ

తెలంగాణ వ్యతిరేకి ప్రధాని మోదీ: చాడ

కురవి, ఫిబ్రవరి 8: ప్రధాని మోదీ తెలంగాణకు బద్ధ వ్యతిరేకి అని, అందుకే రాజ్యసభలో రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా మాట్లాడతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా కురవిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఏ నిధులనూ ప్రధాని మోదీ విడుదల చేయడం లేదన్నారు. ఎన్నికలు జరిగే కర్ణాటక, మహారాష్ట్రకు అధిక నిధులు, వందల కోట్ల ప్యాకేజీలను ప్రకటించారని పేర్కొన్నారు.

మోదీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు: రాకేశ్‌రెడ్డి

మట్టెవాడ, ఫిబ్రవరి 8: ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. గురువారం హన్మకొండలోని వరంగల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌ను పూర్తిగా చదవకుండా, రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేవని తప్పుడు ప్రచారం చేయడం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న కొత్త స్కీంలు, స్కాంల కోసమేనని ఆరోపించారు.

కాల్ డేటాపై పోలీసుల ఫోకస్

▸ **పోలీసుల అదుపులో మరికొందరు?**

▸ **బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసు విచారణ**

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 8: నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసు విచారణలో భాగంగా పోలీసులు కాల్ డేటాపై దృష్టి పెట్టారు. ఈ కేసులో ఇప్పటికే 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు, కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి శ్రీనివాస్ హత్య జరగక ముందు, ఆ తర్వాత కూడా నిందితుల్లో ఒకరితో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించి బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీనివాస్ హత్య కేసుకు సంబంధించి 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా అందులోని ఐదుగురిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. నిందితులు చింతకుంట్ల రాంబాబు, మాంద్ర మల్లేశ్, అల్వాల శరత్, భాషపాక దుర్గయ్య, కత్తుల కల్యాణ సామ్రాట్‌ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. రాజకీయ నాయకులతో పాటు పోలీస్ అధికారులపై కూడా ఆరోపణలు రావడంతో డీఐజీ శివధర్ రెడ్డి కేసు విచారణను పర్యవేక్షిస్తున్నారు.

రెడ్డి సంక్షేమానికి కార్పొరేషన్ కావాలి

▸ **గోపు జైపాల్‌రెడ్డి**

దామెర, ఫిబ్రవరి 8: రెడ్డి సామాజిక వర్గంలో ఎక్కువ మంది నిరుపేదలుగానే ఉన్నారని, వారి సంక్షేమానికి రూ.1000 కోట్ల నిధులతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ రూరల్ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్‌లో రెడ్డి సంఘం అధ్యక్షుడు మన్నెం రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా ఎంచుకుని, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా పంట దిగుబడులు రావడం లేదన్నారు. చలో వరంగల్ పేరుతో ఈనెల 11న ఆదివారం హన్మకొండలోని సుబేదారి ఆర్ట్స్ అడ్ సైన్స్ కళాశాల ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రెడ్ల శంఖారావం బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జేఎన్‌యూతో ఎంజీయూ ఒప్పందం

▸ **పలు అంశాల్లో సహకారానికి అంగీకారం**

నల్లగొండ విద్య, ఫిబ్రవరి 8: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యా సంబంధమైన అవగాహన అంశాలపై ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్, ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ ఒప్పంద పత్రాలకై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం రెండు యూనివర్సిటీలు విద్యాపరమైన అంశాల విషయంలో పరస్పరం సహకరించుకోనున్నాయి. అధ్యాపకుల పరస్పర సహకారం, సంయుక్తంగా పరిశోధనలు, సెమినార్, అకడమిక్ సమావేశాలు నిర్వహించడం, స్వల్పకాలిక ప్రత్యేక కోర్సులను నిర్వహించడం, పరిపాలన సంబంధమైన పలు అశాలను సహకారం, కంప్యూటర్ సైన్స్, టెక్నాలజీ, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, అర్థశాస్త్రం, మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన పలు అంశాలపై సహకారం అందించనున్నాయి.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు యూనివర్సిటీల వీసీలు

ప్రేమకు పట్టం!

యుక్తవయస్సులో ఉన్న ఇద్దరి వివాహానికి సంబంధించి ఏమైనా నిర్ణయం చేయవలసి వస్తే ఆ పని చట్ట ప్రకారంగా న్యాయస్థానాలు నిర్వహిస్తాయే తప్ప వారి ప్రేమ, పెళ్ళి విషయాల్లో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని సుప్రీంకోర్టు అద్భుతమైన తీర్పు చెప్పింది. సోమవారం నాటి ఈ తీర్పు ఉత్తర భారతంలోని ఖాప్ పంచాయితీలకు సంబంధించి వెలువడినప్పటికీ, దానికి మాత్రమే పరిమితమైనది కాదు. ఖాప్ పంచాయితీలతో తమకు నిమిత్తం లేదనీ, ఇద్దరు యుక్తవయస్కులు పెళ్ళి చేసుకున్నప్పుడు అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదని తేల్చి చెప్పడమే తమ లక్ష్యమని ప్రధానన్యాయమూర్తి స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, సమాజం, రాజ్యం ఎవరికైనా సరే ఇది వర్తిస్తుందన్నది న్యాయస్థానం ఆదేశం. వివాహం విషయంలో యువతీయువకుల స్వేచ్ఛను కులం, మతం ఇత్యాది కారణాలతో నియంత్రిస్తూ, ఉల్లంఘించిన వారిని పరువు హత్యల పేరిట అనాగరికంగా హతమారుస్తున్న సంఘటనలు సమాజంలో హెచ్చుతున్న నేపథ్యంలో, ఈ తీర్పు ఆహ్వానించదగినది.

ఉత్తరభారతంలో ఒక అనధికారిక, సమాంతర న్యాయవ్యవస్థగా కొనసాగుతూ శాసనాలు చేస్తున్న ఖాప్ పంచాయితీలపై ఈ తీర్పు ప్రభావం ఏమాత్రం ఉంటుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. సుప్రీంకోర్టు వాటిపై ఇలా కన్నెర్ర చేయడం ఇది మొదలూ కాదు, చివరిదీ కాకపోవచ్చు. హర్యానాలోని ఖాప్ పంచాయితీలు మధ్యయుగాలనాటి తీర్పులిస్తూ, పరువు హత్యలను ప్రేరేపిస్తున్నాయనీ, ఈ మారణకాండను నివారించాలంటూ శక్తివాహిని అనే ప్రభుత్వేతర సంస్థ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తీర్పు చెబుతూ, యువతీ యువకుల పెళ్ళి విషయంలో జోక్యం చేసుకొనే హక్కు తల్లిదండ్రులకు, వ్యక్తులకు, సమూహాలకు సైతం ఉండదని కోర్టు స్పష్టం చేసింది. ఖాప్ పంచాయతీల తరఫున వాదించిన న్యాయవాది సదరు పంచాయితీలు తమ సంప్రదాయాలను పరిరక్షించేందుకు మాత్రమే కృషి చేస్తున్నాయనీ, పరువుహత్యలకు అవి వ్యతిరేకమని సమర్థించినప్పుడు, నైతిక పరిరక్షకులుగా మీరు అవతరించాల్సిన అవసరం ఏమాత్రం లేదని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ తీర్పు వెలువడిన మర్నాడే ఖాప్ పంచాయతీ పెద్దలు కొందరు చేసిన వ్యాఖ్యలు వారి అసలు స్వభావాన్ని తెలియచెప్పాయి. తమ సంప్రదాయాల్లో జోక్యం చేసుకొనే హక్కు, అవసరం న్యాయస్థానాలకు లేదంటూ, సుప్రీం తీర్పును ఆచరణకు తెచ్చే ప్రయత్నం జరిగితే ఆడపిల్లనే కనవద్దంటూ తమ వారిని ఆదేశిస్తానంటూ హర్యానాలోని ఓ ఖాప్ పెద్ద హెచ్చరించారు. పొరపాటున ఆడపిల్ల పుడితే దానిని చదువుకోనివ్వబోమనీ, కాస్తంత చదవగానే ఆడపిల్లలు ఎవరితోనో లేచిపోతున్నారని ఆ పెద్దాయన అన్నారు. పట్టణాల్లో భ్రష్టుపట్టిపోయిన విలువల ప్రభావంతో న్యాయమూర్తులు ఈ తీర్పు ఇచ్చారనీ, గ్రామాలు ఇంకా కొన్ని ఉన్నతమైన విలువలు, ఆదర్శాలకు కట్టుబడివుంటాయని మరో ఖాప్ పెద్ద అన్నారు.

సుదీర్ఘ సామాజికాధిపత్య చరిత్ర ఉన్న ఖాప్ పంచాయితీలు జాట్లు అధికంగా ఉన్న హర్యానాలో ప్రధానంగానూ, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఇత్యాది రాష్ట్రాల్లోనూ గ్రామీణ సమాజాన్ని శాసిస్తున్న విషయం తెలిసిందే. కాలంతో పాటుగా సామాజికార్థిక పరిస్థితుల్లో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ ఏడో శతాబ్దంలో ఆవిర్భవించిన ఈ విధానం ఆచార సంప్రదాయాలను పరిరక్షించే ముసుగులో అరాచకమైన విధానాలను అమలు చేస్తున్నాయి. సగోత్రీకుల మధ్య వివాహాలను నిరోధించడమే ఖాప్ పంచాయితీల లక్ష్యమనీ, అవి ఆ పని మాత్రమే చేస్తున్నాయని సుప్రీంకోర్టులో వారి న్యాయవాది వాదించారు. కానీ, అవి ప్రధానంగా కులాంతర వివాహాలను, ముఖ్యంగా నిమ్నకులస్థులతో తమవారి వివాహాలను ఆపడానికే కృషి చేస్తున్నాయని అందరికీ తెలిసిందే. పెళ్ళి చేసుకున్నవారిని ఇకపై అన్నాచెల్లెళ్ళుగా ఉండాలని ఆదేశించడం, మాట విననందుకు శిక్షించడం, కులాంతర వివాహాలకు మరణశిక్షలను విధించడం ఇత్యాది ఖాప్ అకృత్యాలకు కొదవేలేదు. నిమ్నకులానికి చెందిన ఓ వ్యక్తి జాట్‌కులానికి చెందిన యువతిని వివాహమాడితే అతడి అక్కచెల్లెళ్ళపై సామూహిక అత్యాచారాన్ని శిక్షగా విధించడాన్ని కూడా సంప్రదాయమే అంటే ఎలా? పరువు హత్యల్లో 80శాతం కులాంతర వివాహాలకు సంబంధించినవేనన్న వాస్తవమే ఖాప్ పంచాయితీల పనితీరును స్పష్టపరుస్తున్నాయి. సాక్షాత్తూ సుప్రీంకోర్టే చెప్పినప్పటికీ ఖాప్ పంచాయితీల దారుణాలకు అడ్డుకట్టవేయడం జరగని పని అని తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పంచాయితీలకు ఉన్న ఆధిపత్యం అటువంటిది. వాటి మాట జవదాటే సాహసం ఎవరికీ లేదు కనుక, రాజకీయపక్షాలన్నీ వాటిపైనే ఆధారపడి మనుగడసాగిస్తున్నాయి. గంపగుత్తగా ఓట్లు నొల్లుకొనే పార్టీలకు వాటిజోలికి పోయే ఉద్దేశం ఏమాత్రం ఉండదు. వాటి అకృత్యాలపై ఎన్నడూ నోరువిప్పని రాజకీయపార్టీలు, ఇప్పుడు కనీసం సుప్రీంకోర్టు తీర్పును కూడా స్వాగతించలేదు. హర్యానా ముఖ్యమంత్రి ఖట్టర్ ఏ మాత్రం తొణకకుండా ఈ పంచాయితీలు సామాజిక విలువలను, సంప్రదాయాన్ని పరిరక్షిస్తున్నాయంటూ ప్రశంసలు కురిపించారు. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలకే కాక, ఈ పరువుహత్యల జాడ్యం ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు నేటి సమాజానికి ఓ దిక్సూచి, హెచ్చరిక.

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

కరపత్రం

'లక్ష్య రహిత, గమ్య రహిత చదువొద్దు మనకు. నిస్సారపు, నిర్జీవపు విజ్ఞానం వద్దు మనకు. పద పద నేస్తం పోదాం పద, శాస్త్రీయ విద్య సాధనకై' అంటూ ప్రజాతంత్ర సోషలిస్టు విద్యా సాధనే ప్రాథమిక లక్ష్యంగా పీడీఎస్‌యూ పోరాడుతున్నది. సామాజిక జీవితపు మానవీయ ఉన్నత ప్రమాణాలను, విలువలనూ పెంపొందించని విద్యా వ్యవస్థ రద్దు కావాలి. శ్రామిక వర్గ సాంస్కృతిక విలువలను, శ్రమ సంస్కృతిని అలవరిచే విద్యా బోధనను ఆవిష్కరించే నూతన విద్యా వ్యవస్థ నిర్మాణం జరగాలని పీడీఎస్‌యూ కోరుకొంటున్నది. ప్రస్తుత విద్యా వ్యవస్థను యథాతథంగా పరిరక్షించడానికి దళారీ పాలకవర్గం సకల ప్రయత్నాలూ చేస్తోంది. విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు అవసరమైన భూమికను ఏర్పరచే విధాన నిర్ణయాలను చేయడంలోనూ ప్రపంచ ద్రవ్య సంస్థ (ఐఎంఫ్) ప్రపంచ బ్యాంకు (డబ్ల్యూబీ), వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీఓ) ఆదేశిత నిర్దేశాలను భారత దళారీ పాలకవర్గం విధిగా పాటిస్తున్నది. 2005లో భారత విద్యా రంగాన్ని సేవల రంగంలో చేర్చడం ద్వారా గాట్ ఒప్పంద రథచక్రాలకు కట్టివేసింది. ఫలితంగా ప్రజలకు విద్య అందించాలన్న సామాజిక బాధ్యతనుంచి పాలకులు వైదొలగారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల ఉద్యమ కార్యకలాపాలను సమీక్షించుకుని భవిషత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు పీడీఎస్‌యూ తన తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలను నిర్వహించుకుంటున్నది.


(నిజామాబాద్‌లో నేడు పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు ప్రారంభం)

ఇవి ఆత్మహత్యలేనా?

భీమాకోరేగాంవ్ అమరుల ద్విశత సంవత్సర సంస్మరణ సందర్భంగా వేలాది మంది ప్రదర్శకులపై సంఘ్‌పరివార్ మూకలు రాళ్లతోనూ, సాయుధంగానూచేసిన దాడిలో రాహుల్, బతంగ్‌లే అనే ఇద్దరు దళిత యువకులు అమరులయ్యారు. పోలీసులు అరెస్టు చేసిన వివిధ ప్రజాసంఘాల ప్రదర్శకుల్లో ఎనిమిది మందికి మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నాయని యుఎపీఎ కింద కేసు పెట్టారు. వాళ్లంతా తెలంగాణకు చెందిన దళిత, బడుగు వర్గాల కార్మికులు. రిలయెన్స్ ఎలక్ట్రికల్స్‌లో కాంట్రాక్టు వర్కర్స్‌గా పని చేస్తున్నారు. జనవరి 13న అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి 15న కోర్టులో హాజరుపరచి మళ్లీ రెండు వారాలు పోలీసు కస్టడీకి తీసుకొని మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ కోర్టుకు అప్పగించి జైలుకు పంపారు. వారిలో దాసరి అజయ్ (కృష్ణ, మహేశ్) ఘోశాఖ లింగయ్య (వేణుగోపాల్, వేణు వెల్గోట) మావోయిస్టులని వారిలో మిగతా ఆరుగురు కుట్రలో భాగస్థులని ఆరోపణ.

పోలీసుల కథనం ప్రకారమే మిగతా ఆరుగురు ముద్దాయిలలో కోర్టులో హాజరుపరచని, ప్రభాకర్ నారాయణ మచ్చ కూడా ఉన్నాడు. ఆయనే మన అందరికీ తెలిసిన రచయిత మచ్చ ప్రభాకర్. ఆయన గురించే జనవరి 23న ఆత్మహత్య చేసుకున్నాడని భావించడం, ప్రచారం చేయడం జరిగింది. మాయేకర్ అనే పోలీసు అధికారి తాను, తన బృందం ప్రభాకర్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నాడు. విచారణాధికారి అసిస్టెంట్ పోలీసు కమిషనర్ ప్రభాకర్ నారాయణ మచ్చాను కస్టడీలోకి తీసుకున్నాం గానీ, ఆ రోజే విడుదల చేసామని పేర్కొన్నాడు. కేసు డైరీలో కూడ ఈ అంశం ఉంది. అయితే మనందరికీ తెలిసిన సుప్రసిద్ధ తెలుగు రచయిత, తెలుగు మరాఠి సమాజ సాహిత్య నాలుగు దశాబ్దాల వారధి, ముఖ్యంగా దళిత, బడుగు వర్గాల, మార్గదర్శి, ప్రజాస్వామిక, విప్లవశక్తుల పరిణత మిత్రుడు ఎప్పుడు

> **రోహిత్ వేముల ఆత్మహత్య స్మృతిబద్ధ హత్య. ఆయన నీలాకాశంపై అరుణకాంతిని కలగన్నాడు. అవాజ్ నాట్యమంచ్ కళాకారుడు విలాస్ గోఘ్రేది రాజ్య ప్రేరేపిత ఆత్మహత్య. ప్రభాకర్ మచ్చది టెరరిస్టు రాజ్య ప్రేరేపిత హత్య. వ్యక్తులుగా, వైయక్తిక కారణాలు కూడా తక్షణ ప్రేరణలుగా ఉరి కొయ్యలకు వేలాడిన వారుగానే వీరు కనిపించవచ్చు. కానీ ఆ ఉరి తీయబడిన శిరస్సు చెప్తున్న బహిరంగ రహస్యం ఏమిటి?**



అరెస్టయినట్లు? ఏదైనా పోలీసు స్టేషన్‌కు తీసుకపోయారా? ఇంటికే వచ్చి యాంటీ టెరరిస్టు స్క్వాడ్ (ఎటీఎస్) పోలీసు బృందం ప్రశ్నించిందా? జనవరి 23 ఉదయం ఆయన ఫ్లాట్‌లో ఉరి వేసుకున్నట్లు కొడుకు చెప్పిన ప్రభాకర్ మానసిక స్థితి ఏమిటి? పోలీసుల ప్రశ్నలు, వేధింపులు, యుఎపీఎ కేసులో మావోయిస్టు సంబంధాలు చూపినందుకు ఒత్తిడికి గురయ్యాడా? మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా హింసించారా? తెలియదు. మరీ ముఖ్యంగా నాలుగు దశాబ్దాలు ముంబైలో బట్టల మిల్లు కార్మికుడిగా, ఉపాధ్యాయుడిగా, రచయితగా, సామాజిక కార్యకర్తగా వేలాది మందికి పరిచయమున్న ప్రభాకర్ మృతదేహాన్ని పోలీసుల ఒత్తిడితోనే తన స్వస్థలమైన పోత్గుల్ (సిరిసిల్ల)కు తీసుకువచ్చి అంత్యక్రియలు చేసారా అని అనుమానాలు కూడా వస్తున్నాయి. మిగతా ఏడుగురిని పోలీసు కస్టడీకి తీసుకొని ప్రశ్నించినప్పుడు ఒక యువకునితో ఎటీఎస్ అధికారి 'ఇంకొక కార్మిక నాయకుడు కూడా ఉన్నాడురా, వాని భార్య చనిపోయి పది రోజులే అయింది కనుక వాణ్ని తీసుకరాలేదు' అని అన్నాడట. ఈ కార్మికులకెవ్వరికీ అప్పుడది తామందరూ టీచర్‌గా భావించే అరవై ఐదేళ్ల మచ్చ ప్రభాకర్ సార్ అని తట్టలేదు. జనవరి 2న మచ్చ ప్రభాకర్ సహచరి అనారోగ్యంతో మరణించింది. ఆ వియోగం, ఒంటరితనం ప్రభాకర్‌ను ఆత్మహత్యకు పురికొల్పి ఉంటాయని అందరూ భావించారు. భీమాకోరేగాంవ్ సంఘటనల నేపథ్యంలో, ప్రదర్శనల్లో స్వయంగా పాల్గొనక పోయినా ప్రధాన నిందితుల్లో ఒకరిగా యాంటీ టెరరిస్టు స్క్వాడ్ ఆరోపించిన మచ్చ ప్రభాకర్ మరణాన్ని ఆయన సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రాజకీయ చైతన్య నేపథ్యంలో కేవలం ఆత్మహత్యగానే భావించవచ్చా? భార్యా వియోగమన్న తక్షణ వ్యక్తిగత వేదనకు సమకాలీనంగానే భీమాకోరేగాంవ్ ఘటనలు జరిగాయి. అందులో ఇద్దరు దళిత యువకులు అమరులయ్యారు.

సరిగ్గా ఇరవయ్యేళ్ల క్రితం రమాబాయ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎవరో దుండగులు చెప్పుల దండ వేసినప్పుడు చెలరేగిన ఆగ్రహ ప్రదర్శనలపై సీఆర్‌పీఎఫ్ కాల్పులు జరిపితే పదకొండు మంది దళితులు మరణించారు. వారి శవాలను పశు కళేబరాల వలె మునిసిపల్ ట్రక్కుల్లో వేసుకొని పోయిన దృశ్యాలను చూసి చలించిన విలాస్ గోఘ్రే ఉరి పెట్టుకొని చనిపోయాడు.

అవును, అప్పుడు విలాస్ గోఘ్రే ఉరిశిక్షకు కూడా ఒక తక్షణ వ్యక్తిగత సమస్య కారణమైంది. బొంబాయి ఘట్కోపర్ మురికివాడలో అరవై గజాల తమ ఇరుకు ఇంటికి చేతికెదిగిన కొడుకు నవ వధువును తోడ్కొని వస్తున్నాడు. ఆ యువ జంట ప్రైవసీకి తన ఇంట్లో తావు ఏది? లాల్ భీమ్‌లు ఏకం కావాలనే మరణ వాగ్మూలంతో ఆయన ఉరికంబమెక్కాడు. అది వ్యక్తిగతమా?

రోహిత్ వేముల ఆత్మహత్య స్మృతిబద్ధ హత్య. ఆయన నీలాకాశంపై అరుణకాంతిని కలగన్నాడు. అవాజ్ నాట్యమంచ్ కళాకారుడు విలాస్ గోఘ్రేది వ్యవస్థ, రాజ్య ప్రేరేపిత ఆత్మహత్య. ప్రభాకర్ మచ్చది టెరరిస్టు రాజ్య ప్రేరేపిత హత్య. వ్యక్తులుగా, వైయక్తిక కారణాలు కూడా తక్షణ ప్రేరణలుగా ఉరి కొయ్యలకు వేలాడిన వారుగానే వీరు కనిపించవచ్చు. కానీ ఆ ఉరి తీయబడిన శిరస్సు చెప్తున్న బహిరంగ రహస్యం ఏమిటి?


సిరిసిల్ల యువకుడు మచ్చ ప్రభాకర్‌ను, మహారాష్ట్ర కళాకారుడు విలాస్ గోఘ్రేను కలిపింది బొంబాయి బట్టల మిల్లు చరిత్రాత్మక సమ్మె (1981). అది ఒక సంవత్సరంపైగా నడిచింది. అప్పటికి ప్రభాకర్ 18 సంవత్సరాల యువకుడుగా సిరిసిల్ల నుంచి నిర్బంధాన్ని తట్టుకోలేక పొట్ట చేతబట్టుకొని బొంబాయి వెళ్లి బట్టల మిల్లుల్లో కార్మికుడుగా చేరాడు. ఒక గుజరాతీ స్కూల్లో అటెండర్‌గా విలాస్ గోఘ్రే మిల్లు షిఫ్టు సమయాల్లో సమ్మె ప్రదర్శనలను ఉత్సాహపరచడానికి 'నది పుట్టిన గొంతుక' అయ్యాడు. ఆ నది ఉరవడి తగ్గి మైదానంలో నిదాన ప్రవాహమైనట్లు టీచర్‌గా, రచయితగా, బుద్ధిజీవిగా పరిణతి చెందినవాడు ప్రభాకర్. కాని ఆయనలో ఆ సిరిసిల్ల చేనేత కార్మికుల జీవితమూ పోరాటమూ కలనేత వలె కలిసి ఉన్నాయి. ఈ బట్టల మిల్లు కార్మికుల సమ్మెకు సంఘీభావం కోసం జగిత్యాల కొచ్చి తెలంగాణ కార్మికులకు కదిలించాలని ఆశించి ఎన్‌కౌంటర్‌లో అమరులైన అంకం నారాయణ, వాసం గజేందర్ ఆదర్శం ఉన్నది. ఆయన సిరిసిల్ల ఆంధ్ర మహాసభ మొదలు ముంబైలో ప్రత్యేక తెలంగాణ సంఘీభావ ఉద్యమం వరకు చరిత్రను ఒక గత వర్తమానాల సంభాషణగా చదువుకున్నవాడు, ఆచరించినవాడు. ఆయనకు బుద్ధుని కాలం (తెలంగాణ, ఆంధ్రల మీదుగా హ్యూయాన్‌త్సాంగ్ నూట ముప్పై దేశాలలో చేసిన సాహస యాత్ర గురించి ప్రభాకర్ రాసిన పుస్తకం, బహుశ ఆయన ఆఖరి రచన, ఇంకా వెలుగు చూడవలసే ఉన్నది) నుంచీ కరీంనగర్ తెలంగాణ చరిత్ర ఎంత తెలుసునో, పూలే అంబేద్కర్‌ల కాలమే కాదు సంత్‌ల కాలం నుంచి శివాజీ కాలం నుంచి మహారాష్ట్ర చరిత్ర కూడ అంత తెలుసును. బొంబాయి మహా నగర నిర్మాణానికి తెలుగు వాళ్లు చేసిన దోహదం, సేనల గురించి ఆయన ప్రామాణికమైన గ్రంథం రచించాడు. సిరిసిల్ల, జగిత్యాల పోరాట బాటలో బొంబాయి ప్రవాసానికి వెళ్లిన మచ్చ ప్రభాకర్ ఏకకాలంలో బొంబాయి మనిషిగాను, సిరిసిల్ల మనిషిగాను సజీవంగా జీవించాడు. కాని మరణానంతరం వచ్చి మాత్రం తన ఊరి మట్టిలో మమేకమయ్యాడు. 'ఈ ఊరు మనదిరా, ఈ వాడ మనదిరా దొర ఏందిరా, దొర పెత్తనమేందిరా' అన్న దగ్గరే కాకుండా నయా పేష్వాయీని, దానికి అండగా ఉన్న కార్పొరేట్ శక్తులను ప్రశ్నించే శక్తులకు ఈ వ్యవస్థ, ఈ రాజ్యం చూపుతున్న చోటు అది. బుద్ధిజీవులారా ఇది (ఇవి) ఆత్మహత్య(లే) అంటారా.

ఏది హత్య? ఏది ఆత్మహత్య? ఓ మహాత్మా! ఓ ప్రేతాత్మా!

■ వరవరరావు

మార్క్సిస్టుల మాయమాటలు!

■ బల్బీర్ పుంజ్



రైట్ పాయింట్

చెప్పినదాన్ని ఆచరించేవారు, ముఖ్యంగా రాజకీయాలలో ఎంతమంది ఉంటారు? మాటకు, చేతకు మధ్య అంతరం తీవ్రమయితే వ్యక్తిగత జీవితంలో విషాదం, సంఘ జీవితంలో విపత్కర పరిణామాలు అనివార్యంగా చోటు చేసుకుంటాయి. భగవంతుని సొంత నెలవు అయిన కేరళలో అధికారంలో ఉన్న మార్క్సిస్టులకు, ఇప్పుడు సరిగ్గా ఇదే సంభవిస్తోంది. ప్రజా జీవితంలో నిరాడంబరత ముఖ్యమని పదే పదే ఉద్ఘాటించే మార్క్సిస్టు నాయకుల అవినీతికర వ్యక్తిగత జీవితాల వికృత వాస్తవాలను ఇటీవలి సంఘటనలు బహిర్గతం చేశాయి.

2016 శాసనసభా ఎన్నికల్లో అప్పటి (కాంగ్రెస్ నేతృత్వంలోని) యుడిఎఫ్ ప్రభుత్వం పరాజయం పాలయింది. అధికారంలో అవినీతికి పాల్పడడం వల్లే యుడిఎఫ్ నాయకులను కేరళ ఓటర్లు తిరస్కరించారని మరి చెప్పాలా? ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ స్వయంగా కోట్లాది రూపాయల ముడుపులు తీసుకున్నారని, ఒక మహిళ (ఇప్పుడీమె జైలులో ఉన్నారు) మోహంలో పడి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మార్క్సిస్టుల నేతృత్వంలోని ప్రత్యర్థి ఫ్రంట్ ఎల్‌డిఎఫ్ ఆరోపించింది. ఆ ఆరోపణను ప్రజలు విశ్వసించారు. ఆర్థిక మంత్రి కె.ఎమ్. మణి సైతం పదికోట్ల రూపాయల మేరకు లంచం తీసుకొని సంపూర్ణ మద్య నిషేధం చట్టాన్ని సవరించడానికి అంగీకరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. యుడిఎఫ్ నాయకుల అవినీతి బాగోతాలను మార్క్సిస్టులు ప్రజల ఎదుట ఎండగట్టారు. దిగ్భ్రాంతికి గురైన ఓటర్లు యుడిఎఫ్ నేతలను ఇంటికి పంపించారు.

సరే, చెప్పిన మాటను ఆచరించినదెవరు? ఇప్పుడు మార్క్సిస్టుల వంతు వచ్చింది. అవినీతికి తావులేని పాలనను వీరు అందిస్తున్నారా? కరడుగట్టిన కమ్యూనిస్టు అయిన ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌కు వ్యతిరేకంగా అవినీతి, పక్షపాతం ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన మంత్రి మండలి సభ్యులు ముగ్గురు ఇప్పటికే రాజీనామా చేశారు. మరో మంత్రి భవిష్యత్తు అనిశ్చితంగా ఉన్నది. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలలోని కీలక స్థానాల్లో సొంత బంధువులను నియమించారనే ఆరోపణలను ఆ మంత్రి మహాశయుడు ఎదుర్కొంటున్నారు .

కథ ఇంతటితో ముగియలేదు సుమా! కార్మిక వర్గ పార్టీ అయిన సిపిఎమ్ ఇటీవల మరింత ఘోరమైన ఆరోపణలకు లోనయింది. కేరళ సిపిఎం కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ (ఇదివరకటి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో ద్వితీయ స్థానంలో ఉన్నారు) కుమారుడు ఒక అవినీతి కుంభకోణానికి పాల్పడ్డారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. దుబాయిలోని ఒక పర్యాటక కంపెనీ నుంచి రూ.13కోట్లు రుణంగా తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో దుబాయి అధికారులు అతనిపై చర్య తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఇటీవల ఒక ప్రముఖ మళయాళ వార్తా పత్రిక వెల్లడించింది. సదరు కంపెనీలో ఒక భారతీయ పౌరుడూ, ఒక అరబ్ భాగస్వాములుగా ఉన్నారని తెలిసింది.

బాలకృష్ణన్ కుమారుడు బినోయ్ ఇచ్చిన ఒక బ్యాంక్ చెక్‌ను దుబాయి బ్యాంకు తిరస్కరించడంతో ఈ సందేహాస్పద వ్యాపార ఒప్పందం బహిర్గతమయింది. ఆ వ్యాపార ఒప్పందం ఒక వ్యక్తికీ, ఒక వ్యాపార సంస్థకు మధ్య కుదిరింది గనుక దానితో తమ పార్టీకి, ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ముఖ్యమంత్రి విజయన్ స్పష్టం చేశారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఎస్.రామచంద్రన్ పిళ్ళై ఈ వ్యవహారంపై ఒక వివరణ ఇస్తూ ఇద్దరు వ్యక్తుల మధ్య విఫల వ్యాపార ఒప్పందానికి తమ పార్టీని తప్పు పట్టడం తగదని అన్నారు. ఆ ఒప్పంద భాగస్వాములలో ఒక వ్యక్తి తమ పార్టీ నాయకుడు ఒకరికి సమీప బంధువు అయినంత మాత్రాన జరిగిన అక్రమానికి తమ పార్టీ ఎలా బాధ్యత వహిస్తుందని ఆయన ప్రశ్నించారు.

ఈ వాదన హేతుబద్ధంగా ఉన్నదని చాలా మంది భావించారు. అయితే ఒక మంత్రి కుమారుడు పొందిన రుణంతో పార్టీకి ఎటువంటి సంబంధం లేనిపక్షంలో రుణదాత ఎందుకు ముఖ్యమంత్రిని ఆశ్రయించారు? ఆ రుణాన్ని ఇస్తున్నందుకు గాను రుణదాతకు ప్రభుత్వం నుంచి ఏదైనా ప్రయోజనం సమకూరుస్తామనే హామీ ఏదైనా ఇచ్చారా? అధికారంలో ఉన్న వ్యక్తులతో బంధుత్వాలను అడ్డు పెట్టుకుని రుణాన్ని పొందడానికి ప్రయత్నించే వారికి ఇచ్చే రుణాలకు రుణదాతలే బాధ్యత వహించాలని పిళ్ళై స్పష్టం చేశారు. బినోయ్‌కు రుణం ఇచ్చిన అరబ్ వ్యాపారి పర్యాటక రంగ వ్యాపారి అని వెల్లడయింది. ఆ రుణ లావాదేవీ చోటుచేసుకున్నప్పుడు బాలకృష్ణన్ కేరళ పర్యాటక మంత్రిగా ఉన్నారనేది గమనార్హం.

తాను ఇస్తున్న రుణానికి ప్రతిఫలంగా కేరళ మంత్రి తనకు ఏదైనా ప్రయోజనం సమకూరుస్తారని ఆ అరబ్ వ్యాపారి ఆశించి వుంటాడని భావించవచ్చు. ఏదైనా ఒక గల్ఫ్ దేశపు వర్క్‌వీసాకు చాలాపెద్ద మొత్తంలో చెల్లించుకోవల్సి వస్తుంది. ఆ వీసాకు ప్రయత్నిస్తున్న వారి నుంచి పర్యాటక వ్యాపారరంగంలో వున్న వారు చాలా పెద్ద మొత్తంలో వసూలు చేయడం కద్దు.

నిరాడంబర జీవన శైలి గురించి ఉపదేశించే మార్క్సిస్టు నాయకులు నిజానికి చాలా విలాసవంతంగా జీవిస్తున్నారని కేరళ వార్తా పత్రికలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి విజయన్ ఒక పార్టీ కార్యక్రమానికి హాజరు కావడానికి ప్రభుత్వ సొమ్ముతో ఒక హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకున్నారని ఒక పత్రిక పేర్కొంది. మరో మార్క్సిస్టు మంత్రి ఎనిమిది లక్షల రూపాయలు తమ పార్టీకి పెద్ద మొత్తమేమీ కాదని, త్వరలోనే ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి తిరిగి చెల్లిస్తామని వ్యాఖ్యానించినట్టు కూడా ఆ పత్రిక పేర్కొంది.

> **కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కేరళను 1958 నుంచీ తమ అధికారంలో ఉంచుకోవడంలో సఫలమవుతున్నాయి. ఇపుడు ఆ రెండు పార్టీల నాయకుల అవినీతి పూర్తిగా బహిర్గతమయింది. తమ పాలకులను నిర్ణయించుకోవడంలో కేరళ ఓటర్లకు ఆ రెండు పార్టీలు లేదా వాటి నేతృత్వంలోని ఫ్రంట్‌లే గత్యంతరమా? మీ ఊహ నా అంచనాతో కచ్చితంగా ఏకీభవిస్తుందని నిశ్చితంగా చెప్పగలను.**



మార్క్సిస్టుల సిరి సంపదల కథ కేరళకు మాత్రమే పరిమితం కాదు. పశ్చిమ బెంగాల్‌లో మూడున్నర దశాబ్దాల పాటు ఈ కథ పునరావృతమవుతూనే ఉన్నది. చివరకు ప్రజలు వారిని అధికారం నుంచి తొలగించేంతవరకు అది కొనసాగింది. నిజానికి కమ్యూనిస్టు నాయకులు సిరిసంపదలను పోగుచేసుకొని రాజకీయ మద్దతును కొనుక్కోవడమనేది ఇప్పుడు ఒక అంతర్జాతీయ పరిణామంగా వర్ధిల్లుతున్నది.

చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్ అవినీతికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారు. మధ్య చైనాలోని ఒక నగరంలో బ్రిటిష్ వ్యాపారి ఒకరు తన హోటల్ గదిలో హత్యకు గురయ్యాడు. ఆ హత్యకు కారకులు కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఒక శక్తిమంతమైన నాయకుడు, అతని భార్య అని వెల్లడయింది. గత ఐదేళ్ళుగా ఈ ఇరువురూ జైలులో ఉన్నారు.


అక్రమార్జనలకు, కమ్యూనిజానికి మధ్య ఒక సహజ సంబంధమున్నది. చైనాలో దయాదాక్షిణ్యాలులేని కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వ పాలనలో ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ వర్ధిల్లుతోంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ, పత్రికా స్వాతంత్ర్యం కొరవడిన ఆ 'సామ్యవాద' దేశంలో అక్రమ సంపాదనా మార్గాలకు కొదవేమీ లేదు. జన చైనా వ్యవస్థాపకుడు, చైనా కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయక గణంలో అత్యంత ప్రముఖుడైన మావో విషయలంపటుడు. ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్-ఉన్ కుటుంబ నియంతృత్వ పాలన గురించి మరి చెప్పనవసరం లేదు.

కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కేరళను 1958 నుంచీ తమ అధికారంలో ఉంచుకోవడంలో సఫలమవుతున్నాయి. ఇపుడు ఆ రెండు పార్టీల నాయకుల అవినీతి పూర్తిగా బహిర్గతమయింది. తమ పాలకులను నిర్ణయించుకోవడంలో కేరళ ఓటర్లకు ఆ రెండు పార్టీలు లేదా వాటి నేతృత్వంలోని ఫ్రంట్‌లే గత్యంతరమా? మీ ఊహ నా అంచనాతో కచ్చితంగా ఏకీభవిస్తుందని నిశ్చితంగా చెప్పగలను.

(వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు)

చరిత్ర సరే, చేసిందేమిటి?

■ తెలకపల్లి రవి



గమనం

చరిత్ర అడక్కు చెప్పింది విను అన్నట్టు ప్రధాని మోదీ పార్లమెంటు ప్రసంగంలో రామాయణం ధారావాహిక నుంచి దేశ చరిత్ర వరకూ ఏకరువు పెట్టారు. కాని ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో సహా ఇచ్చిన హామీలపై నిర్దిష్టంగా ఒక్క ముక్కయినా చెప్పలేదు. తెలుగు రాష్ట్రాల విభజన హామీల గురించి అడుగుతుంటే దేశ విభజన గురించి మాట్లాడటం ఎంత అసందర్భమో అవకాశవాదమో చెప్పనవసరం లేదు. అత్యున్నత అధికార పీఠం నుంచి అలాటి మాటలు వూహించలేము కూడా. ఆఖరి పూర్తి బడ్జెట్‌లో అన్యాయమే మిగిలిందని ఆగ్రహావేదనలకు గురవుతున్న ఏపి ప్రజల ఘోషను పట్టించుకోకుండా రాజకీయ పరిభాషలో అంటే కాంగ్రెస్ వర్సెస్ బిజెపి అన్నట్టే మాట్లాడారు. రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలూ కేంద్రాన్ని వదలిపెట్టి వైసిపి వర్సెస్ టీడీపీ క్రీడనే సాగిస్తున్నాయి. కెవిపి రామచంద్రరావు వంటి కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డుల నిరసన తెల్పుతున్నా జాతీయ నేతలు అతిరథ మహారథులు మాత్రం నోరు మెదపడం లేదు. ఇలా హేమాహేమీలంతా రాజకీయ వ్యూహాత్మక స్పందనలకు పరిమితమైనవేళ ఉనికి లేనివిగా హేళన చేయబడే వామపక్షాలు ఏపి బంద్‌కు పిలుపివ్వడం ఒక చారిత్రిక సన్నివేశం. దానికి బిజెపియేతర పక్షాలు మద్దతు చెప్పక తప్పని స్థితి. బళ్లు బస్సులు ఉపసంహరించిన ప్రభుత్వ పార్టీ కూడా ఆందోళన తతంగం నడిపించింది. ప్రతిపక్ష నేత జగన్ పాదయాత్ర విరమించి సంఘీభావం ప్రకటించారు. జనసేనాని పవన్ కళ్యాణ్ బంద్‌ల పట్ల తన వైముఖ్యాన్ని ప్రకటిస్తూనే బలపరుస్తున్నట్టు ప్రకటించారు. టిఆర్ఎస్ పార్లమెంటరీ నేత జితేందర్ రెడ్డి కూడా ఏపి కోర్కెలకు మద్దతు తెల్పడం మరో విశేషం. నీలం సంజీవరెడ్డినీ అంజయ్యనూ అవమానించడం సరే ఏపీ ముఖ్యమంత్రికి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా మీరెంత అవమానించారన్నది వర్తమానం. ఆ మాటకొస్తే హైదరాబాద్ వచ్చినప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి సమయం కోరినా ఇచ్చింది లేదు. పార్లమెంటు సాక్షిగా హామీలను ఉల్లంఘించడం రాజ్యాంగాన్నే అవమానించడం కాదా?

కాంగ్రెస్ ఆ రోజున లోక్‌సభ తలుపులు మూసి మరీ విభజన చట్టం ఆమోదించిందని మోదీ కొత్తగా కనిపెట్టినట్టు చెబుతున్నారు. ఆ రోజున ఒక తలుపు కాంగ్రెస్ మూస్తే మరో తలుపుమూసింది బిజెపి. అక్కడ బాధ్యత కానట్టు రాజ్యసభలో మాత్రం మంతనాలు జరిపి ప్రత్యేక హోదా పట్టు పట్టింది బిజెపి నేత, ఇప్పుడు సభాధ్యక్షుడు వెంకయ్య నాయుడే. విభజన చట్టంలోని రెండు మూడు అంశాలను పునరుద్ఘాటించడంతో పాటు అయిదేళ్ల ప్రత్యేక హోదా, రెవెన్యూలోటు భర్తీ, రాజధానికి సహాయం, పోలవరం జాతీయ హోదా, వెనకబడిన జిల్లాలకు సాయం, బుదేల్‌ఖండ్ ప్యాకేజీ అన్న అంశాలను నాటి ప్రధాని రాజ్యసభలో లిఖితపూర్వకంగా ప్రకటించారు. దాన్ని అమలు చేస్తామని బిజెపి ఎన్నికల ప్రణాళికలో ఘనంగా వాగ్దానం చేసింది. నమ్మి ఓటేశాక చట్టబద్ధత లేదని ఎగనామం పెట్టింది. పోనీ మీరు చట్టబద్ధత కల్పించివుండొచ్చు. ఇలా హోదాతో సహ అన్ని అంశాలను అరకొరగా అమలు చేస్తున్న కేంద్రంపై రాష్ట్రమంతటి తరపున ఒత్తిడి తెచ్చే బదులు చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ రాజీబేరాలు నడిపింది. హోదా సంజీవని కాదన్న మాటతో మొదలు పెట్టి 2016 సెప్టెంబరులో వచ్చిన ఉత్తుత్తి ప్యాకేజీకి శాసనసభలో కీర్తనా తీర్మానం వరకూ వెళ్లింది. ఇందుకు వెంకయ్య నాయుడుకు సన్మానాలు చేసి తరించింది. ఆ సమయంలో వెంకయ్య పాత్రపై కొత్తపలుకులో మిత్రులు ఆర్కే కూడా అమితమైన హర్షం ప్రకటిస్తే నేను విమర్శా వ్యాఖ్యానం రాశాను. వెనక్కు తిరిగి చూస్తే అదంతా ఎంత బూటకమో తెలుస్తుంది. నిజానికి ప్యాకేజీ మిథ్య. దాన్ని అంకెలలో నిర్ధారించింది లేదు. హోదా వల్ల కలిగే అతి పెద్ద ప్రయోజనం పెట్టుబడుల రాక, ఉపాధికి దోహదం అనుకుంటే ఆ అంశమే ప్యాకేజీలో లేదు. కేబీకే ప్యాకేజీ ప్రసక్తే లేదు. అయినా సరే చంద్రబాబు దాన్ని స్వాగతించడం నిరాధారమైన ఆశలు కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీసే బదులు అఖిలపక్ష ఒత్తిడి తెచ్చేబదులు రాజకీయ మంతనాలపై లాబీయింగులపై ఆధారపడింది. తాను 42 సార్లు ఢిల్లీ వెళ్లానన్న చంద్రబాబు ఏమీ జరగడం లేదనే నిజం ప్రజలతోపంచుకున్నది లేదు. ఇటీవలనే ప్యాకేజీ కింద రావాలసింది రాలేదని ఆయన చెప్పాల్సి వచ్చింది. కాని కార్యాచరణ లేదు. టిడిపి చెప్పుల్లో తాను కాలుదూర్చి బిజెపితో బంధం పెంచుకోవాలని చూస్తున్న వైసీపీ టిడిపిని తప్ప కేంద్రాన్ని నిశితంగా విమర్శించిందే లేదు. ముఖ్యమంత్రిగాని ప్రతిపక్ష నేతగాని మీడియా ముందుకొచ్చి బడ్జెట్‌పై తమ అభిప్రాయాలు అసంతృప్తులూ పంచుకున్నది (ఇప్పటికి) లేదు. వామపక్షాల పిలుపుపై జరుగుతున్న బంద్‌లో పాల్గొనడం ద్వారా జగన్ ఆ విమర్శను కొంచెం సర్దుకున్నారు గాని చంద్రబాబు మాత్రం ఇప్పటికి ప్రత్యక్షంగా మాట్లాడింది లేదు. కనుకనే ఆ పార్టీ ఎంపిలు పార్లమెంటులో చేస్తున్న ఆందోళన అన్నది కూడా రాజకీయ ప్రహసనంగా వుంది తప్ప నమ్మకం కలిగించడం లేదు. కేంద్రంలో మంత్రి సుజనాచౌదరి మాట్లాడ్డం దానిపై విజయసాయి రెడ్డి అభ్యంతర ప్రహసనం కొనసాగింపే.



> **నీలం సంజీవరెడ్డినీ అంజయ్యనూ అవమానించడం సరే ఏపీ ముఖ్యమంత్రికి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా మీరెంత అవమానించారన్నది వర్తమానం. ఆ మాటకొస్తే హైదరాబాద్ వచ్చినప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి సమయం కోరినా ఇచ్చింది లేదు. పార్లమెంటు సాక్షిగా హామీలను ఉల్లంఘించడం రాజ్యాంగాన్నే అవమానించడం కాదా?**

ఈ నేపథ్యంలో వామపక్షాల బంద్‌కు ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత ఏర్పడటం సహజం. విభజనకుముందుగాని తర్వాతగాని ఇన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో అడుగేయడం ఆంధ్ర ప్రదేశ్‌లో చూడని పరిణామం. వాస్తవానికి తెలుగుదేశం చొరవతో అందరినీ కలుపుకుని రాష్ట్రం కోసం పోరాడవలసింది. దానికి బదులు బిజెపిపైన కేంద్రంపైన మరీ ముఖ్యంగా వెంకయ్య పైన నమ్మకం పెట్టుకుని కూచోమన్నారు. వారిద్దరినీ బలపర్చిన పవన్ కళ్యాణ్ ప్యాకేజీని పాచిపోయిన లడ్డూ అన్నారు గాని తర్వాత మాత్రం పరిశీలించాలన్నట్టు కాలం వెళ్లబుచ్చారు. ఇప్పుడు జెపిని ఉండవల్లిని మేధావులనుకలుపుకుని తెలంగాణ తరహాలో జెఏసి అంటున్నారు. టిజెఏసిలోనూ అందరూ అన్నివేళలా ఒకే విధంగా కలిసి వున్నది లేదని గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడైనా ఎక్కడైనా పాలకవర్గ పార్టీలకు స్వప్రయోజనాలు పట్టినంతగా విశాల దీర్ఘకాలిక కోణాలు పట్టవు. ఇప్పుడు ఏపిలో పాలక ప్రతిపక్షాలు తమ తమ కేసుల కారణంగానే మోడీ ముందు సాగిలపడుతున్నట్టు పరస్పరం విమర్శించుకుంటున్నాయి. మిత్ర ధర్మం గనక మాట్లాడలేకపోతున్నామని బీజేపీ టీడీపీలు చేసే వాదన హాస్యాస్పదమైంది. ప్రజల పట్ల రాజ్యాంగ ధర్మం అన్నిటికన్నా ఉత్కృష్టమైందని వారికి చెప్పవలసి వుంది. లక్షన్నర కోట్లు ఇచ్చేశామని బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా రాజమండ్రి సభలో చేసిన ప్రసంగం నిజం కాదని ప్రధాని ప్రసంగం నేపథ్యంలో కేంద్రం విడుదల చేసిన లెక్కలే చెబుతున్నాయి. అందులో ఖచ్చితంగా రెవెన్యూలోటు కింద ఇచ్చింది 7500 కోట్లు, అమరావతికి 2500 కోట్లు మాత్రమే వున్నాయి. ఘనంగా చెప్పే ఏడు కేంద్ర విద్యా సంస్థలకు 111 కోట్లు ఇచ్చారట. ఇతర పద్దుల కింద ఇచ్చినవన్నీ కలిపి చూపినావచ్చే సంవత్సరం ఇవ్వబోయేది కూడా కలిపి 22 వేలకోట్లకు లోపే వుంటే అమిత్‌షా లక్షన్నర కోట్లు అని ఎలా అన్నారు? తాము డబ్బులు ఇచ్చినా రాష్ట్రప్రభుత్వం లెక్కలు చెప్పడం లేదని నివేదికలు పంపడం లేదని బిజెపి నేతలు చేసే వాదన ఒకటి. అమరావతికి ఇచ్చిన నిధులతో తాత్కాలిక భవనాలే కట్టారనీ, డ్రైనేజీ నిధులతో కాల్వల తవ్వకమే ప్రారంభించలేదని చేసే విమర్శలను ప్రజల ముందు పెట్టాలి. పోలవరం బాధ్యత తీసుకోవాలి. ఒకరినొకరు కప్పిపుచ్చుకుంటూ ప్రజలను మభ్యపెట్టడం దారుణం. ఇప్పటికే వైసీపీ ఆచితూచి స్పందిస్తుంటే పవన్ కళ్యాణ్ జేపీలు చంద్రబాబు తరహాలోనే వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడం మార్గం కాదని హితబోధ చేయడం ఆశ్చర్యకరం. వీధికి నెట్టింది కేంద్ర రాష్ట్ర పాలకులే తప్ప పార్టీలో ప్రజలో కాదు. ఎవరి తరహాలో వారు చేస్తున్న విన్యాసాలను ప్రజలు అర్థం చేసుకోగలరు. ప్రభుత్వాలకు పాఠమూ చెప్పగలరు. అవకాశవాదం ఎవరిలో ఏ రూపంలో వున్నా విశ్వాసఘాతుకతకు ఎవరు పాల్పడినా అందుకు మూల్యం తప్పదు. ఆ క్రమంలో రాజకీయ సామాజిక మథనాలూ మార్పులూ రాబోయే రోజుల్లో తప్పనిసరిగా చూస్తాం. ■

పలువురు ఐఏఎస్‌లకు

పదోన్నతి

- ఐదుగురు ముఖ్యకార్యదర్శులుగా..
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు పదోన్నతి లభించింది. ఐదుగురికి ముఖ్య కార్యదర్శులుగా, ఆరుగురికి సెలెక్షన్ గ్రేడ్, ఐదుగురికి జూనియర్ గ్రేడ్ స్కేల్ పదోన్నతులిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసీఆర్‌హెచ్చార్డీ అదనపు డీజీ బూసాని వెంకటేశ్వరరావు, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.శివశంకర్, వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి, జీఏడీలో స్టేట్ గెజిట్ కమిషనర్ వీఎన్ విష్ణు, విపత్తుల నిర్వహణ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి ఆర్‌వీ చంద్రవదన్‌లకు ముఖ్యకార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. 2004, 2005 బ్యాచ్‌లకు చెందిన కె.నిర్మల(డీడీసీఏఫ్ మేనేజింగ్ డైరెక్టర్), డాక్టర్ గౌరవ్ ఉప్పల్(నల్లగొండ కలెక్టర్), కె.ఇలంబరితి(సెక్రటరీ, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్), మాణిక్కరాజ్ కన్నన్(సంగారెడ్డికలెక్టర్),డాక్టర్ ఎ.శరత్(జగిత్యాల కలెక్టర్), ఎల్.శర్మణ్(జాయింట్‌సెక్రటరీ పురపాలకశాఖ)లకు సెలెక్షన్ గ్రేడ్ స్కేల్(లెవల్-13 పేమ్యాట్రిక్స్) పదోన్నతులు ఇచ్చారు. 2008, 2009 బ్యాచ్‌లకు చెందిన శ్రీ దేవసేన(పెద్దపల్లి కలెక్టర్), సర్ఫరాజ్ అహ్మద్(కరీంనగర్ కలెక్టర్), ఎన్.సత్యనారాయణ(కామారెడ్డి కలెక్టర్), ఎస్.అర్విందర్‌సింగ్(డిప్యూటీ సెక్రటరీ, ప్రొటోకాల్, జీఏడీ) విభాగంతో పాటు ఏపీ కేడర్‌కు చెందిన ఎం.ప్రశాంతి(నిర్మల్ కలెక్టర్, కోర్టు ఉత్తర్వులకు లోబడి)లకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్(లెవల్-12 ఇన్ పే మ్యాట్రిక్స్)గా పదోన్నతులిచ్చారు. వీరందరికీ పదోన్నతులిచ్చినా పూర్వస్థానాల్లోనే కొనసాగిస్తూ సీఎస్ ఆదేశాలు జారీచేశారు.

చెరో 17 టీఎంసీలు

- కృష్ణా బోర్డు నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాలకు నీటిని కేటాయిస్తూ కృష్ణా బోర్డు గురువారం నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు 17.90టీఎంసీలు, ఏపీకి 17.09 టీఎంసీలు కేటాయించారు. తెలంగాణకు సంబంధించి కల్వకుర్తికి 2.50 టీఎంసీలు, ఏఎమ్మార్పీకి 4.40టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమగట్టు కాల్వకు 11 టీఎంసీలు వినియోగించుకోనున్నారు. ఏపీకి పోతిరెడ్డిపాడుకు 0.50టీఎంసీలు, సాగర్ కుడి గట్టు కాల్వకు 10.50 టీఎంసీలు, ఎడమగట్టు కాల్వకు 2.09 టీఎంసీలు ఉపయోగించుకోనున్నారు.

నిరంతర విద్యుత్తుతో.. నిండుగా వరి!



నల్లగొండ జిల్లా కుక్కడం గ్రామంలో 24గంటల విద్యుత్తు కారణంగా ధార తగ్గిన బోరుబావి

(మొదటి పేజీ తరువాయి)

పొలానికి నీరుపెడుతున్నాడు. మరోరెండెకరాలు కౌలుకు తీసుకొన్నా తడికి ఇబ్బంది ఉండేది కాదన్న నమ్మకంతో ఉన్నాడు. చెన్నయ్య మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది రైతులు బోరుబావుల కింద విస్తారంగా వరిపంటను సాగు చేస్తున్నారు. పొలాలకు పుష్కలంగా నీళ్లు అందించగలుగుతున్నారు. ఇదంతా సాగుకు 24గంటల విద్యుత్తు మహిమ. రాష్ట్రంలో రైతులకు నిరంతర విద్యుత్తు ఇస్తామన్న తెలంగాణ సర్కారు జనవరి 1 నుంచి అమలు చేస్తోంది. సరిగ్గా యాసంగి సీజన్ మొదట్లోనే ఈ పథకం అమలు కావడంతో బోరుబావుల ఆధారంగా వరిసాగు చేసే రైతులు ఎక్కడికక్కడ నారుమళ్లు వేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వరిసాగు గణనీయంగా పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 51వేల బోరుబావుల కింద నిరుడు యాసంగిలో 6437 హెక్టార్లలో వరి సాగైంది. ఈ సీజన్‌లో అవే బోరుబావుల కింద 7670 హెక్టార్లలో వరి పంటను సాగుచేశారు. ఫిబ్రవరి చివరి నాటికి జిల్లాలో మరో 500 హెక్టార్లలో వరినాట్లు వేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ నాయక్ చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1.41 లక్షల ఎకరాలు! ఈ యాసంగిలో అదనంగా 50వేల ఎకరాల్లో వరిసాగైంది. వర్ని, బోధన్, రుద్రూర్, కోటగిరి, రెంజల్, ఎడపల్లి, నవీపేట, నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్‌పల్లి, ధర్పల్లి, మాక్లూర్, నందిపేట, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలాల్లో వరిపంట విస్తృతంగా సాగైంది. సిద్దిపేట జిల్లాలో 24 గంటల విద్యుత్తు అమలవుతున్నా వరిపంట తక్కువగానే సాగైంది. గత రబీ సీజన్‌లో 1.1 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ ఏడాది 50వేల ఎకరాల్లోనే సాగు చేశారు.

పెరిగిన కరెంటు వినియోగం

సాగుకు నిరంత విద్యుత్తు ఇస్తుండడంతో కరెంటు వినియోగం కూడా పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలో మునుపు వ్యవసాయ పంపు సెట్లకు రోజుకు 17-18 లక్షల యూనిట్ల వినియోగం జరిగేదని, నిరంతర విద్యుత్తుతో 24లక్షల యూనిట్లకు పెరిగిందని ట్రాన్స్‌కో ఎసీ చక్రపాణి తెలిపారు. నిరుడు రోజూ 9.5 మిలియన్ యూనిట్ల కరెంటు వినియోగించిన నిజామాబాద్‌జిల్లాలో ఇప్పుడు 10.8మిలియన్ యూనిట్లు వాడుతున్నారు.

'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలనలో కొన్ని..

- సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం దూల్మిట్ట గ్రామంలో వరిసాగు విస్తీర్ణం 1000 ఎకరాల నుంచి 1347 ఎకరాలకు పెరిగింది.
- నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ గ్రామ రైతులు నిరుటితో పోల్చితే ఈసారి వరి సాగును 50 ఎకరాలు పెంచారు.
- నల్లగొండ జిల్లా కుక్కడం శివారులో వరి సాగు 620 ఎకరాల నుంచి 1080 ఎకరాలకు పెరిగింది. సాగునీరు పెట్టేందుకు రాత్రుళ్లు పొలాలకు వెళ్లే బెడద తప్పిందని రైతులు అంటున్నారు.

బోర్లలో నీళ్లు తగ్గుతయి




"నాకున్న మూడెకరాల్లో వరిసాగుచేశా. గతంలో ఎకరం పొలంలోనే నాట్లు వేసేవాడ్ని. 24 గంటల విద్యుత్తుతో వరిసాగును దాదాపు రెండున్నర ఎకరాలకు పెంచాను. బోర్లు నిరంతరాయంగా పోస్తుండడం సంతోషంగా ఉన్నా.. మున్ముందు నీళ్లు తగ్గుతాయేమోననే ఆందోళన కూడా ఉంది. వరి పొట్టకొచ్చే దశలో ఇబ్బందులు రావొద్దని దేవుడిని మొక్కుకుంటున్నా" – **మహ్మద్ తాజుద్దీన్, దూల్మిట్ట, సిద్దిపేట జిల్లా**

24 గంటల సరఫరా బాగు బాగు

"వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును సరఫరా చేయడం బాగుంది. నాకు ఎకరన్నర పొలం ఉంది. నిరుడు ఎకరం పొలంలో పంట వేశాను. ఈ ఏడు మొత్తంసాగు చేశాను. ఇప్పుడు బోరు మూడు గంటలు పోస్తోంది. గతంలో రాత్రి పూట పొలానికి పోవడం ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు పగటిపూటే వరికి నీళ్లు పెడుతున్నా" – **మోహన్, మల్కాపూర్, నిజామాబాద్ జిల్లా**

9గంటల విద్యుత్తే బాగుండె



నిరంతర విద్యుత్తుతో ఉపయోగంలేదు. కరెంటు ఎక్కువిస్తున్నరని అదనంగా మూడెకరాల్లో వరిసాగు చేసిన. పోయిన నెలలో రెండించుల పైపునిండా పోసిన బోరు ఇప్పుడు గ్యాప్ ఇస్తోంది. దీంతో ఆరెకరాల్లో రెండెకరాల ఎండిపోతోంది. బోర్లు మున్ముందు ఎండిపోతయేమో అనే టెన్షన్ పట్టుకుంది. గతంలో మాదిరే 9గంటల కరెంటు ఇస్తేనే బాగుటుంది." – **బట్టు లచ్చిరెడ్డి, రైతు, కుక్కడం గ్రామం, నల్లగొండ జిల్లా**

ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయండి

- 3 వారాల్లోగా నిర్మాణాలకు అనుమతులు
- మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులు మూడు వారాల్లోనే ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని మునిసిపల్ కమిషనర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. గడువులోగా నిర్ణయం తీసుకోని అధికారిపై జాప్యం కాలానికి రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించవచ్చు. ఎల్ఆర్ఎస్ నిధులు 50% స్థానికంగానే ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కూడా కమిషనర్లకు సూచించారు. అన్ని మునిసిపాలిటీల్లోనూ సైన్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని కమిషనర్లను ఆదేశించారు.

దివాళా తీసిన కంపెనీ పనుల్లో.. సబ్ కాంట్రాక్టర్లకే బిల్లుల చెల్లింపు

- ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దివాళా తీసిన కంపెనీల పేరిట పనులు నిర్వహిస్తున్న సబ్ కాంట్రాక్టర్లకే నేరుగా బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాజెక్టుల పనుల్లో ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకున్న పలు కంపెనీలు దివాళ పిటిషన్ దాఖలు చేశాయి. ఇందులో ఎక్కువగా జలయజ్ఞం ప్రాజెక్టుల పనులు చేస్తున్న కంపెనీలు ఉన్నాయి. 7 కంపెనీలు దివాళ పిటిషన్లు దాఖలు చేసినట్టు సమాచారం. జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఈ పిటిషన్లు కొనసాగుతున్నాయి. దాంతో ఈ కంపెనీలకు అప్పు ఇచ్చిన బ్యాంకులు రుణాలు రాబట్టుకునేందుకు ప్రభుత్వ బిల్లులపై దృష్టిపెట్టాయి. ప్రాజెక్టులను దక్కించుకున్న కంపెనీలు పనుల నిర్వహణను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించాయి. పనులు సబ్ కాంట్రాక్టర్లు చేసినా బిల్లులు ప్రధాన కాంట్రాక్టర్ పేరిటే ఇస్తున్నారు.

శామీర్‌పేటలో మెగా డెయిరీ!

- ఏర్పాటుకు విజయ డెయిరీ బోర్డు ఆమోదం
- 100 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివార్లలో మెగా డెయిరీ ఏర్పాటుకు విజయ డెయిరీ ప్రయత్నాలు ప్రారంభించింది. శామీర్‌పేటలో వంద ఎకరాల విస్తీర్ణంలో మెగా డెయిరీ ఏర్పాటుకు ఇటీవల జరిగిన విజయ డెయిరీ బోర్డు ఆమోదం తెలిపింది. దానికోసం ప్రభుత్వ భూమిని కూడా గుర్తించారు. గుర్తించిన భూమిని డెయిరీకి అప్పగించాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విలేకరులకు చెప్పారు. వాస్తవానికి గతంలోనే శంషాబాద్ సమీపంలో రూ.300కోట్లతో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల మెగా డెయిరీ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేశారు. నిధుల సమస్య, సాంకేతిక కారణాలతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. దాని స్థానే రూ.170 కోట్లతో లాలాగూడలోని డెయిరీ ప్లాంటును నవీకరించాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. దానికోసం బ్యాంకుల ద్వారా నిధుల సమీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో శామీర్‌పేటలోనూ మెగా డెయిరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డెయిరీ, మత్స్య రంగాలకు రూ.10వేల కోట్ల మేర నిధులు ఇవ్వనున్నట్లుగా బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ప్రతిపాదనలను పరిశీలించి.. నాబార్డు లేదా నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఆరున్నర శాతం వడ్డీకి ఆ నిధులను కేంద్రం రుణంగా ఇస్తుంది. తక్కువ వడ్డీ రేటుతో రుణం వస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని డెయిరీ అభివృద్ధికి వినియోగించుకునేందుకు ఆస్కారం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

చిరువ్యాపారులపై 'లైసెన్స్' కొరడా!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు తప్పని సరిగా ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. మార్కెట్ యార్డుల నుంచి గల్లీల దాకా లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే ట్రేడర్లపై భారీ ఎత్తున జరిమానా విధించే దిశగా ప్రభుత్వం మార్కెటింగ్ యాక్ట్ 1969కి సవరణ చేస్తూ జీవో జారీ చేసింది. దీని ప్రకారం ఇక స్వయం ఉపాధి కోసం కూరగాయలు, పూలు, పండ్లు, తదితర ఉత్పత్తులు విక్రయించేవారిపై ప్రభుత్వం నిఘా వేయనుంది. మార్కెట్ యార్డుల్లో రైతుల నుంచి సరుకులు సేకరించి వ్యాపారులకు అమ్మిపెట్టే కమీషన్ ఏజెంట్ల కోసమే లైసెన్స్ విధానం అమలులోకి తెస్తున్నట్టు అధికారులు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో కమీషన్ ఏజెంట్లుగా వ్యాపారం చేసే వారికి ఎప్పట్నుంచో లైసెన్సులున్నాయి. కొత్తగా వారు లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పూలు, పండ్లు, కూరగాయల వ్యాపారం చేసేవారు అంటూ పేర్కొనడంతో చిన్నచిన్న వ్యాపారులు సైతం ఈ పరిధిలోకి వచ్చినట్టేనని కొందరు ఉన్నతాధికారులు వివరించారు. ప్రస్తుతం జంటనగరాల్లో దాదాపు 15 నుంచి 20 లక్షల మంది చిన్నచిన్నవ్యాపారాలతో స్వయం ఉపాధిని పొందుతున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం వీరంతా ఇక లైసెన్సు తీసుకుంటేనే మార్కెట్‌యార్డులోకి అడుగుపెట్టాల్సి ఉంటుంది.

- రోజుకు 5000 రూపాయలలోపు టర్నోవర్ ఉన్నవారిని మినహాయించారు. అంటే అలాంటివారు లైసెన్స్ తీసుకోవాల్సిన పని లేదు.
- కూరగాయలు, పండ్లు, పూలు అమ్మేవారు కొత్తగా లైసెన్స్ తీసుకోవాలంటే రూ.లక్ష బ్యాంకు గ్యారెంటీ చూపాల్సి ఉంటుంది.
- ఇతరత్రా వ్యాపారాలు చేసేవారు కొత్తగా లైసెన్సు తీసుకోవాలంటే రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ చూపాలి.
- కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారం చేసేవారి టర్నోవర్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 లక్షలు మించి ఉంటే.. లైసెన్స్ కొనసాగింపునకు రూ.2 లక్షల బ్యాంకు గ్యారెంటీ చూపాలి. టర్నోవర్ రూ.25 లక్షల లోపుంటే రూ.లక్ష బ్యాంకు గ్యారెంటీ చూపితే సరిపోతుంది. టర్నోవర్ రూ.కోటి దాటి ఉంటే అనుమతుల కొనసాగింపునకు రూ.10 లక్షల బ్యాంకు గ్యారెంటీ చూపాలి. టర్నోవర్ రూ.25 లక్షల నుంచి రూ.కోటి మధ్యలో ఉంటే రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ చూపితే సరిపోతుంది.
- ఒక వేళ వ్యాపారులు లైసెన్సులేకుండా వ్యాపారం చేస్తున్నట్టు అధికారులు గుర్తిస్తే వారి నుంచి 2 లక్షల రూపాయల జరిమానా వసూలుచేసే అవకాశం ఉందని ఒక అధికారులు తెలిపారు.

స్వయం ఉపాధి కోసం వ్యాపారం చేసుకునే వారి టర్నోవర్‌ను చూపించాలనడం, వారుచేసే వ్యాపారానికి సంబంధించి బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలన్న నిబంధన పెట్టడం వల్ల ఎంతో మంది పేద, మధ్యతరగతికి చెందిన చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు మాత్రం.. మార్కెట్‌యార్డుల్లో కమీషన్ ఏజెంట్లు రైతులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని, అలాంటివారి నుంచి రైతులను రక్షించడానికే బ్యాంకు గ్యారంటీ పద్ధతి అని చెబుతున్నారు.

నిరంతర విద్యుత్తును స్వాగతిస్తున్నాం

- చార్జీలను పెంచొద్దు: రైతులు
- త్వరలో 25 వేల జేఎల్‌ఎం పోస్టులు: ఎన్‌పీడీసీఎల్ సీఎండీ



బహిరంగ విచారణలో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్న విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్

కామారెడ్డి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అందించే 24 గంటల ఉచిత విద్యుత్తుపై రైతులు, రైతు సంఘాలతో పాటు అన్ని వర్గాల వారు మొగ్గు చూపారు. నిరంతర విద్యుత్తును స్వాగతిస్తున్నామంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యుత్తు సమస్యలపై, చార్జీల పెంపుపై గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, మెంబర్ హెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘాలు, విద్యుత్తు శాఖ అధికారులు, ఇతర రంగాల వారి అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంతో పాటు ఇతర రంగాల్లోనూ విద్యుత్తు సరఫరా విషయంలో టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎన్నో విజయాలు సాధించిందని ఆ సంస్థ సీఎండీ గోపాల్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18,036 కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్‌లు గత ఏడాది డిసెంబరు వరకు జారీ చేశామన్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో 25వేల జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 24గంటల నిరంతర విద్యుత్తు ఇచ్చిన తర్వాత హెచ్చు తగ్గులు లేకుండా రైతులు వాడుకుంటున్నారని సీఎండీ పేర్కొన్నారు. నిరంతర విద్యుత్తుతో వ్యవసాయానికి లాభదాయకంగా ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయపడగా.. కొందరు 12 గంటలు ఇవ్వాలని సూచించారు. విద్యుత్తు శాఖలో అవినీతిని నిరోధించాలని విచారణ సభ్యులకు రైతులు విజ్ఞప్తి చేశారు.

67వేల టన్నుల కందులే కొంటాం

- స్పష్టం చేసిన కేంద్రం
- ఇప్పటికే 1.39 లక్షల టన్నులు కొన్న మార్క్‌ఫెడ్, హాకా

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరకు కందుల సేకరణ రాష్ట్ర ప్రభుత్వానికి పెను భారమవనుందా? అంటే ప్రస్తుత పరిస్థితులు అలాగే ఉన్నాయంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. రాష్ట్రంలో ఇప్పటికే మార్క్‌ఫెడ్, హాకాలు కలిసి 1,39,918 టన్నుల కందులను రైతుల నుంచి సేకరించగా.. ఇందులో కేంద్రం 67 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామంటోంది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న కందుల సేకరణతో పాటు మిగిలిన 92 వేల టన్నుల కందులకూ మార్క్‌ఫెడ్, హాకాలే చెల్లింపులు జరపాల్సిన పరిస్థితి నెలకొంది. గత సీజన్‌లోనే మద్దతు కంటే తక్కువకు కందుల ధర పడిపోగా ఇప్పటివరకూ కోలుకోలేదు. ఈ నేపథ్యంలో మద్దతు ధరకు కందులను కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ముందుగానే ప్రతిపాదించింది. రాష్ట్రంలో 1.34 లక్షల టన్నుల మేర కందుల దిగుబడి వస్తుందని అర్థగణాంక శాఖ అంచనా వేసింది. దాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. అందులో 25 శాతం మేరకు కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. కానీ, బహిరంగ మార్కెట్లో ధరకు, మద్దతు ధరకు చాలా వ్యత్యాసం ఉండడంతో మార్క్‌ఫెడ్, హాకా సేకరణ కేంద్రాలకు కందులు వెల్లువలా వచ్చిపడ్డాయి. పరిస్థితి గమనించిన రాష్ట్ర ప్రభుత్వం 1.50 లక్షల టన్నుల మేరకు కందుల సేకరణ జరపాల్సిందిగా కేంద్రాన్ని కోరగా పరిగణనలోకి తీసుకుంది. ఆ నేపథ్యంలో రాష్ట్రంలో 1,13,600 టన్నుల మేరకు కందుల సేకరణకు కేంద్రం అంగీకరించిందంటూ మార్కెటింగ్ శాఖ మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే మద్దతు ధరకు సేకరణలో తొలి ముందస్తు అంచనా నివేదికనే పరిగణనలోకి తీసుకోవడంతో 67 వేల టన్నులకు మించి సేకరించే పరిస్థితి కనిపించట్లేదు. ఇప్పటికే 1.39 లక్షల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్, హాకాలు రైతులకు రూ.762.54 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.226.53 కోట్లు చెల్లించాయి. ఇవన్నీ పూర్తిగా నాఫెడ్ చెల్లించినవే. కేంద్రం 67 వేల టన్నులకే పరిమితమైతే.. మరో 140 కోట్ల వరకూ నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. అంటే రైతులకు ఇప్పటివరకు బకాయిపడిన మొత్తంలో రూ.396 కోట్ల వరకూ మార్క్‌ఫెడ్, హాకాలే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటుగా ప్రస్తుతం సేకరిస్తున్న కందులకూ ఈ రెండు సంస్థలే చెల్లింపులు జరపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకు రుణం తీసుకునేందుకు హామీ ఇవ్వాలంటూ మార్క్‌ఫెడ్, హాకాలు ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాయి.

'నకిలీ' రైతులపై కఠిన చర్యలు: హరీశ్

రైతుల ముసుగులో క్రయవిక్రయాలు జరిపే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. నకిలీ రైతుల ఘటనలపై ఆయా జిల్లా కలెక్టర్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ఇకపై వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కందులు, వేరుసెనగ, సెనగ కొనుగోలు కేంద్రాల పనితీరుపై సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి ఆయన వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లలో నడుస్తున్న కందుల కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్లకు అనుసంధానించాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి మార్కెట్ కమిటీల్లో జరిగే క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలని కలెక్టర్లకు సూచించారు.

హైదరాబాద్‌లో రక్షణ కారిడార్ పెట్టండి!

(మొదటి పేజీ తరువాయి)

చరిత్ర ఉన్న హైదరాబాద్‌లో.. డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఫిక్కీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 19 వరకూ హైటెక్స్‌లో జరిగే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ కమ్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను కేటీఆర్ కోరారు. అనంతరం కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి.. హైదరాబాద్ ఫార్మా సిటీ క్లస్టర్‌కి సహకరించాలని కోరారు. గురువారం రాత్రి కేంద్ర పెట్రోలియం, మైనింగ్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమై రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. శుక్రవారం ఉదయం 10.30 నిమిషాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో రాష్ట్రపతి భవన్‌లో మంత్రి భేటీ కానున్నారు.

కాంట్రాక్టుల్లోనూ రిజర్వేషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. ఇందులో దామాషా ప్రకారం దళిత, గిరిజన కాంట్రాక్టర్లకు ఆయా పనులను కేటాయించాలని సీఎం భావిస్తున్నారు. అయితే, పెద్ద పెద్ద పనుల్లో అంతర్జాతీయ సంస్థలు కూడా పాల్గొనే అవకాశం ఉన్నందున పరిమిత నిధులతో చేపట్టే పనులకే ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. సంఘాలు (సొసైటీలు)గా ఉన్న కాంట్రాక్టు సంస్థలకు రూ.50 లక్షలలోపు; వ్యక్తులకు రూ.20 లక్షలలోపు పనులకు ఈ రిజర్వేషన్‌ను వర్తింప చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఏటా వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ రహదారుల నిర్మాణం, విద్యుత్ లైన్‌ల ఏర్పాటు, నీటి కాలువల నిర్మాణం, భవనాల నిర్మాణం వంటివి ఆయా ప్రభుత్వ శాఖల అధీనంలో జరుగుతుంటాయి. ఏటా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోనే రూ.1000 కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, నిర్వహణ పనులు జరుగుతుంటాయి. ఈసారి ఉపాధి హామీ పథకం నిధులు రూ.1000 కోట్లతో గ్రామాల అంతర్గత సిమెంట్ రోడ్ల పనులు కూడా చేపడుతున్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణం, గ్రామీణ రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే ప్రజా పనులు ఎలాగూ వేల కోట్లలోనే ఉంటాయి. వీటన్నింటికీ ఆన్‌లైన్ టెండరు విధానంతోనే కేటాయింపులు చేస్తారు. కానీ, వీటిలో కాంట్రాక్టర్లకు రిజర్వేషన్లు లేవు. కాకపోతే, రూ.5 లక్షలలోపు విలువైన పనుల్లో కొన్నింటిని నామినేషన్ పద్ధతిలో ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో పనులను కూడా నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తారు. మిగతావన్నీ టెండరు ద్వారా పొందాల్సిందే. ఈ టెండరు విధానంలో దళిత, గిరిజన కాంట్రాక్టర్లు పోటీ పడలేకపోతున్నారని, పనులను కైవసం చేసుకోలేకపోతున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే వారికి రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ అంశాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. అతి త్వరలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

జోన్లు నాలుగే

» కేడర్లు మాత్రం మూడు.. మల్టీజోన్ పూర్తిగా ఎత్తివేత

» రాష్ట్రస్థాయి కేడర్ పోస్టుల కుదింపు.. సీఎం చెంతకు నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త జోనల్ వ్యవస్థకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ కసరత్తు పూర్తయింది. ఈ కమిటీ నివేదిక సీఎం కేసీఆర్ వద్దకు చేరింది. మల్టీజోన్‌ను పూర్తిగా ఎత్తివేసి రాష్ట్రంలో నాలుగు జోన్లను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. పోస్టులకు సంబంధించి మూడు కేడర్(రాష్ట్ర, జిల్లా, జోన్ స్థాయి)లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. రాష్ట్ర స్థాయి పోస్టులను కుదించాలని కూడా కమిటీ సిఫారసు చేసింది. సీఎం ఆమోదం పొందిన తర్వాత ఈ సిఫారసులను అధికారులు రాష్ట్రపతి ఆమోదానికి పంపనున్నారు. కొత్త జోనల్ వ్యవస్థ అమలు కోసం రాష్ట్రపతి పాత ఉత్తర్వులకే సవరణ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు జోన్లు ఉన్నాయి. వీటి స్థానంలో 31 జిల్లాలను నాలుగు జోన్లుగా విభజించాలని కడియం శ్రీహరి కమిటీ సిఫారసు చేసింది. స్థానిక అభ్యర్థులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేలా జోనల్ వ్యవస్థలో మార్పులు సూచించింది. ఇదే క్రమంలో రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాష్ట్ర, మల్టీ జోనల్, జోనల్, జిల్లా స్థాయి కేడర్లలో మల్టీ జోనల్ కేడర్‌ను పూర్తిగా ఎత్తివేయాలని సూచించింది. దీనివల్ల రాష్ట్ర కేడర్ పోస్టులకు మాత్రమే ఇతర రాష్ట్రాల అభ్యర్థులు పోటీపడే అవకాశం ఉంటుంది. అయితే రాష్ట్ర కేడర్‌లో ఉన్న పోస్టులను కుదించనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర కేడర్‌లో ఉన్న పోస్టులను జోనల్ పోస్టులుగా మార్చాలని కమిటీ ప్రతిపాదించింది. ఇక, జోనల్ వ్యవస్థలో మరో కీలక మార్పు చేయనున్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి తేవాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులను ఒక చోట నుంచి మరోచోటుకు బదిలీ చేసే అవకాశం లేదు. కొత్త జోనల్ వ్యవస్థలో ఏ ఉద్యోగినైనా రాష్ట్రంలో ఎక్కడికైనా బదిలీ చేసే అవకాశం ఉండేలా కమిటీ సిఫారసు చేసింది. తాజా సిఫారసులను బట్టి, కేడర్ మార్పులు, చేర్పులుంటే పరిగణించి రాష్ట్రపతి పాత ఉత్తర్వులకు సవరణలు కోరాలని కమిటీ సూచించింది. నివేదికలోని ప్రతిపాదనలపై సీఎం తుది నిర్ణయం తీసుకున్న తర్వాత వాటిని కేంద్ర హోంశాఖకు పంపుతారు. సీఎం కేసీఆర్ నేరుగా కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాలని కోరనున్నారు.

● జూన్ 1న పాఠశాలల పునఃప్రారంభం

» పాఠశాల అకడమిక్ క్యాలెండర్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే(2018-19) విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం కొత్త విద్యా సంవత్సరం జూన్ 1 నుంచి ప్రారంభం కానుంది. 2019 ఏప్రిల్ 13 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఉంటాయి. 2018 అక్టోబరు 9 నుంచి 23 వరకు దసరా సెలవులు, 2019 జనవరి 12 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. ఇక, పాఠశాలల సమయాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.40 వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు, ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్నాయి. ఇక, 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 10న ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ సమావేశం కానుంది. ఈ భేటీలో పాఠశాలల రేషనలైజేషన్‌పై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

● పరువు పోకుండా ఏం చేద్దాం!

» మేడారం ఘటనతో పోలీసుల దిద్దుబాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): భద్రతా సిబ్బంది ప్రజలు, మీడియా వారితో అతిగా వ్యవహరించకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయంపై డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన జీఈఎస్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంక వచ్చినప్పుడు విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అత్యుత్సాహంతో ఉన్నతాధికారులు స్పందించాల్సి వచ్చింది. తాజాగా మేడారం జాతరలో విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు మీడియా ప్రతినిధులు, ప్రజలతో అతిగా వ్యవహరించిన తీరుపై సీఎం కేసీఆర్ వివరణ ఇచ్చుకున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రముఖుల రాక, పండగలు, ఉత్సవాల సందర్భంగా బందోబస్తు సిబ్బంది అనుసరించాల్సిన తీరుతెన్నులపై అధికారులు దృష్టి సారించారు.

● సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లోనే పాస్ పుస్తకాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెక్ బుక్కులు, నాన్ జ్యుడీషియరీ స్టాంప్ పేపర్లు ముద్రించే చోటే 'ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్ పుస్తకాలు' ముద్రించనున్నారు. కేంద్రప్రభుత్వానికి చెందిన జాతీయ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో పాస్‌పుస్తకాలు ప్రింటింగ్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎంవోయూ చేసుకోవాలని ఐటీ శాఖను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఆదేశించారు. నామినేషన్ ప్రాతిపదికన దాదాపు రూ.140 కోట్ల పనులు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు అప్పగిస్తున్నందున మంత్రివర్గం ఆమోదం తీసుకోవాలని నిర్ణయించారు.

● 11న బీసీ ఉపాధ్యాయుల రాష్ట్ర మహాసభ

తెలంగాణ బీసీ ఉపాధ్యాయుల రాష్ట్ర మహాసభ ఈ నెల 11న నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఫ్యాప్సీలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు.

● సీపీఎస్ రద్దుకు 22న ధర్నా: పీఆర్‌టీయూ

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న అన్ని మండల కేంద్రాల్లో ధర్నా చేయనున్నట్లు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సరోత్తంరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం మూడు దశల్లో పోరాటం చేయనున్నామని తెలిపారు.

● 'ప్రిన్సిపాళ్ల' అధికారాలు రద్దు చేయొద్దు: ఎస్టీయూ

మోడల్ స్కూల్ టీచర్లకు సెలవులు, ఇంక్రిమెంట్లు మంజూరు చేసే అధికారాలను ప్రిన్సిపాళ్ల నుంచి తొలగించొద్దని ఎస్టీయూ అధ్యక్షుడు భుజంగరావు డిమాండ్ చేశారు. వారి అధికారాలకు కత్తెర వేయొద్దని.. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు.

● కోదండ పార్టీ ఎవరి కోసం?: చెరుకు

ఎవరి కోసం పార్టీ పెడుతున్నారో చెప్పాలని టీజేఏసీ చైర్మన్ కోదండరాంను తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు. సీఎం అయ్యేందుకే పార్టీ పెడుతున్నారా? సమాధానం చెప్పాలని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఉపాధ్యక్షుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ పెట్టాక కూడా జేఏసీ కొనసాగుతుందన్న కోదండరాం ప్రకటనను తప్పుబట్టారు.

● నెలాఖరులోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఇతర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, మునిసిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఫిబ్రవరి 28నాటికి పరిష్కరించాలని మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల ఆదేశించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కమిషనర్లకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.


● భగీరథ సెగ్మెంట్లన్నీ నెలలో పూర్తి: ఈఎన్‌సీ

మిషన్ భగీరథలో అన్ని సెగ్మెంట్ల పనులు కూడా మరో నెల రోజుల్లో పూర్తి చేసి, ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి ఆదేశించారు. ఎత్తయిన ప్రాంతాల వద్ద పంపింగ్‌తో వచ్చే ఒత్తిడిని తగ్గించేందుకు సర్జ్ ప్రొటెక్షన్ డివైజ్‌లను బిగించాలని అధికారులను సూచించారు.

● పరిశ్రమల ఏర్పాటు, రెన్యువల్స్ ఫీజుల ఖరారు

నూతన పరిశ్రమల ఏర్పాటు, రెన్యువల్స్‌కు సంబంధించిన అంగీకార ఫీజులను నిర్ణయిస్తూ పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులిచ్చింది. పరిశ్రమలను రెడ్, గ్రీన్, ఆరెంజ్ కేటగిరీలుగా విభజించి, అవి చెల్లించాల్సిన మొత్తాన్ని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీ పీసీబీ చట్టాన్ని సవరించి ఫీజులను నిర్ణయించింది. పరిశ్రమల ఏర్పాటుకు, నిర్వహణకు సంబంధించిన అంగీకార ఫీజు గురువారం నుంచి అమల్లోకి వచ్చిందని ఉత్తర్వుల్లో తెలిపింది.

ఒకటి నుంచే కేజీ టు పీజీ గురుకులాలు



» ప్రాథమికస్థాయిలోనే ఆంగ్ల మాధ్యమం

» ప్రభుత్వానికి సంక్షేమ శాఖల ప్రతిపాదన

హైదరాబాద్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచడంలో భాగంగా ప్రాథమిక స్థాయి నుంచే గురుకుల తరహా విద్యను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకుగాను ఒకటో తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన కోసం సంక్షేమ శాఖల పరిధిలో కేజీ టు పీజీ పథకం కింద మినీ గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు 2018-19 బడ్జెట్‌లో మినీ గురుకులాల ప్రారంభానికి కేటాయింపుల కోసం గిరిజన సంక్షేమశాఖతో పాటు ఇతర సంక్షేమశాఖలు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశాయి. కేజీ టు పీజీ పథకంలో భాగంగా ఇప్పటికే 500కు పైగా వివిధ సంక్షేమశాఖల పరిధిలో కొత్త గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, ఇవన్నీ కూడా 5వ తరగతి నుంచే నడుస్తున్నాయి. నాల్గో తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల ద్వారా ఇక్కడ ప్రవేశాలు పొందుతున్నారు. అయితే, ఒక్కసారిగా తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్ల మాధ్యమానికి మారుతుండడంతో పాఠాలు బోధపడక విద్యార్థుల్లో ప్రమాణాలు క్షీణిస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొంత మెరుగు అని, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యావేత్తలు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఒకటో తరగతి నుంచే మినీ గురుకులాలను ఏర్పాటు చేస్తే, ప్రమాణాలు మెరుగుపడతాయని సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు.

గిరిజన మినీ గురుకులాలు విజయవంతం

ప్రస్తుతం గిరిజన అభివృద్ధి శాఖ తన పరిధిలో మినీ గురుకులాలను నిర్వహిస్తోంది. అక్కడ ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 మినీ గురుకులాల్లో 5వేల మంది పిల్లలున్నారు. ఇక్కడ చదివి, సాధారణ గురుకులాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు మిగతావారి కంటే మెరుగ్గా ఉన్నట్టు సంక్షేమశాఖల అధికారులు చెబుతున్నారు. అందుకే, మినీ గురుకులాలను సంక్షేమ శాఖల పరిధిలోనూ ప్రవేశపెడితే చక్కని ఫలితాలు వస్తాయని అధికారులు అంటున్నారు.

బడులు, కళాశాలలకు గ్రేడింగ్!

» అర్హులందరికీ గురుకులాల్లో ప్రవేశాలు

» వేసవిలో విద్యుత్తు అంతరాయాలు ఉండొద్దు

» 'డబుల్' ఇళ్లను త్వరగా పూర్తి చేయండి

» రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి

» 'స్థానిక'పై ప్రజాభిప్రాయాన్ని సేకరించండి

» వివిధ శాఖల అధికారులతో సమీక్షలో సీఎస్



సీఎస్ ఎస్కే జోషితో భేటీ అయిన తెలంగాణ, ఏపీ సబ్ ఏరియా జీవోసీ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాసరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి విద్యార్థికీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ ప్రవేశాలతో పాటు హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలలకు గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న స్వయం ఉపాధి పథకాలు, శిక్షణ, విద్యాసౌకర్యాలు, విదేశీ విద్యా పథకం తదితర అంశాలపై చర్చించారు. గిరిజన సహకార సంస్థ ద్వారా ఆర్థిక కార్యకలాపాలను విస్తృతపరచాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల వ్యయాన్ని పెంచాలన్నారు. భూపంపిణీ పథకం లబ్ధిదారుల భూములను పరిశీలించి వ్యవసాయం చేసేందుకు సహకారం అందించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, సాంకేతిక విద్యాకళాశాలల్లో ప్రవేశాలు, ఉత్తీర్ణత, ఉపాధి, శిక్షణ, పరిశోధన, ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ నిధుల వినియోగం, మధ్యాహ్నభోజన పథకం తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు అందిస్తున్నందున గరిష్ఠ డిమాండ్ 9460 మెగా వాట్లకు చేరుకుందని, గత ఏడాదితో పోల్చితే 20 శాతం పెరిగిందని విద్యుత్తు శాఖ అధికారులు సీఎస్‌కు వివరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్ అధికారులకు సూచించారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 1,73,406 గృహాలకు టెండర్లు ఖరారవగా.. 1,38,795 ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయని, 5824 గృహాలు పూర్తి అయినట్లు సీఎస్‌కు తెలిపారు. టెండర్లు పూర్తయిన గృహాలన్నీ పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎస్ కోరారు. ఈ ఇళ్లకు సౌభాగ్య పథకం ద్వారా విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి జాతీయ రహదారుల భూసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టరేట్లు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో రూ.7,440 కోట్లతో 5150 కిలోమీటర్ల సింగిల్ లేన్ రోడ్లను రెండు వరసలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి 2890 కి.మీ. పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి వాటర్‌షెడ్ పథకాల ద్వారా ఫలితాలను అధ్యయనం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలన్నారు.

పాస్‌పుస్తకాల జాబితా సిద్ధం చేయండి

పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాల్సిన వారి జాబితాను సిద్ధంగా ఉంచాలని సీఎస్ జోషి ఆదేశించారు. ఈ జాబితాపై తహసీల్దార్లంతా డిజిటల్ సంతకాలు చేయాలన్నారు. నాలుగైదు రోజుల్లో పాస్‌పుస్తకాల ముద్రణ ప్రారంభం కానుందని, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కే ముద్రణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఆయన రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ రాజేశ్వర్ తివారీ, డైరెక్టర్ వాకాటి కరుణలతో కలిసి కలెక్టర్లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల డేటా ఎంట్రీ పనులన్నీ శుక్రవారం కల్లా పూర్తిచేయాలన్నారు. ఆధార్ సీడింగ్‌ను కూడా వెనువెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. మండలాల వారీగా షెడ్యూల్ వస్తుందని, దాని ప్రకారం తహసీల్దార్లంతా పట్టాదారు పాస్‌పుస్తకాలను ముద్రించుకొని తీసుకెళ్లాలని చెప్పారు. మార్చి 12 నుంచి తహసీల్దార్లంతా ఎక్స్‌అఫీషియో సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు.



రైతుకే నేరుగా రాయితీ ఇవ్వండి

» కాళేశ్వరానికి నిధులు కేటాయించాలి: కవిత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల సబ్సిడీ నేరుగా అన్నదాతకే వెళ్లేలా చూడాలని టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత లోక్‌సభలో డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని బడ్జెట్‌పై ప్రసంగంలో ఆమె స్పష్టం చేశారు. వ్యాపార వర్గాన్ని పెద్ద ఎత్తున ఆదుకున్న ఆర్థిక మంత్రి వ్యవసాయరంగానికి ఇచ్చిన హామీల అమలులో మాత్రం వెనుకబడ్డారన్నారు. జీఎస్టీ, రాయితీలు ఇచ్చి పారిశ్రామిక, వ్యాపార రంగానికి ప్రోత్సాహం అందించారని, దాని వల్ల దేశం ర్యాంకింగ్‌లో 41 స్థానాలు ఎగబాకిందని అభినందించారు. అదేవిధంగా రైతు పక్షపాతిగానూ పనిచేయాలని కోరారు. క్రిమిసంహారక బిల్లు, విత్తన బిల్లు, నాబార్డు బిల్లులు ఏళ్ల తరబడి ఆమోదం పొందకుండా పార్లమెంట్‌లోనే ఉండిపోతున్నాయని వాటిపై ఎన్డీయే సర్కారు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సూక్ష్మ సేద్యానికి ఇచ్చే 35% రాయితీ కూడా అనుకున్న సమయానికి విడుదల చేయడం లేదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 100% రాయితీ కల్పిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణకు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం, రైతును యూనిట్‌గా తీసుకుని బీమా కల్పించడం, మద్దతు ధరలో మరిన్ని పంటలు చేర్చడం, భారీగా కొనుగోళ్లు చేయడం వంటివి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా విభజన చట్టంలో పేర్కొన్న రెండు రాష్ట్రాల హామీలను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

పాపం పీఈసీదే!

(మొదటి పేజీ తరువాయి)

ఫైసీస్ కంపెనీ.. సంబంధిత పత్రాలను ఢిల్లీలో తారుమారు చేసినట్లు అధికారులు గుర్తించారు. ముందస్తు వ్యూహంలో భాగంగానే, 1820 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థకు కేవలం రూ.10 లక్షలకే తనఖా పెట్టారు. ఈ భూమికి యజమాని శివ భూషణ్ అని, భూమి విలువ రూ.364 కోట్లని చూపించారు. తనఖా డీడ్‌లోని రెండో పేజీలో రూ.10 లక్షలకు మాత్రమే తనఖా పెడుతున్నట్లు పేర్కొన్నారు. డీడ్ మొత్తం ప్రింటింగ్ అక్షరాలతో ఉండగా ఈ పది లక్షల రూపాయలు అని మాత్రం పెన్నుతో రాయడం విశేషం. తనఖా డీడ్ తంతు పూర్తి చేసిన తర్వాత ఈ పత్రాలను ఢిల్లీ తీసుకు వెళ్లి రెండో పేజీలోని రూ.10 లక్షలు అని రాసిన పదాలను రసాయన పదార్థాలతో తొలగించారు. అక్కడ ఏమీ రాయకుండా ఖాళీగా ఉంచారు. ఇదేమీ పట్టించుకోకుండానే పీఈసీ రూ.332 కోట్ల రుణాన్ని ఫైసీస్ కంపెనీకి ఇచ్చేసింది. అయితే, ఈసీలో 1820 ఎకరాల భూముల విలువ రూ.364 కోట్లుగా చూపించారని, దాని ఆధారంగానే రుణం ఇచ్చామని పీఈసీ ఇప్పుడు వివరణ ఇస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఈ కుంభకోణం ఎప్పటికైనా బయటపడితే ఈ పన్నాగం పన్నిన వారంతా బయటపడేందుకు ఈ ఎత్తుగడ వేసినట్లు తెలిసింది.

భూమి విలువ అంచనా పత్రాలు బోగస్: రిజిస్ట్రేషన్ శాఖ

ఎల్బీ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చూపించిన పత్రాలు కూడా బోగసేనని విచారణాధికారులు నిగ్గు తేల్చారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఎల్బీ నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్నతాధికారులు రికార్డులు పరిశీలించారు. వాటిలో శివ భూషణ్ చూపించిన 1820 ఎకరాలకు సంబంధించిన భూమి విలువ అంచనా పత్రాలు (వాల్యుయేషన్ పత్రాలు) కూడా నకిలీవేనని నిగ్గు తేల్చారు. హైదరాబాద్ రిజిస్ట్రార్ వద్ద 1979లో ఈ భూముల వాల్యుయేషన్ చేయించామని, ఆ పత్రాలు ఇవేనంటూ కొన్ని పత్రాలను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అందజేశారు. కానీ, 1979లో హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు అలాంటి అధికారాలు లేవు.

శివభూషణ్‌కు ఎలాంటి హక్కులు లేవు: రెవెన్యూ శాఖ

ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్వాల్‌గూడ భూముల కుంభకోణంపై సమగ్ర విచారణ చేసిన స్థానిక రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. గ్రామంలోని భూములపై శివభూషణ్‌కు ఎలాంటి హక్కులు లేవని తేల్చారు. భూముల తనఖా సమయంలో అసలు అతను దాఖలు చేసిన పత్రాలన్నీ కూడా నకిలీవేనని ఓ రెవెన్యూ అధికారి తెలిపారు. ఇదే విషయంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. "గ్రామంలో మొత్తం భూమి 2,713 ఎకరాలు. సర్వే నంబర్లు 1 నుంచి 174. ప్రభుత్వ భూమి 287 ఎకరాలు. సీలింగ్ భూమి 685 ఎకరాలు. భూదాన భూమి 125 ఎకరాలు. మిగతా 1616 ఎకరాల్లో రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. వారికి పట్టాలు కూడా ఉన్నాయి" అని నివేదికలో స్పష్టం చేశారు. కాగా కొత్వాల్‌గూడలో సుమారు 1300 ఎకరాల ఎనిమీ ప్రాపర్టీ ఉన్నట్లు ఈ వ్యవహారాలు చూసే ముంబైలోని ప్రాంతీయ సెటిల్‌మెంట్ కమిషనర్ కార్యాలయం చెబుతోంది. దీనిపై గత కొన్ని దశాబ్దాలుగా వివాదం నడుస్తోంది. ఈ భూమి విషయం తేల్చాలని 2010లో ఒక లేఖ రాసింది. తర్వాత కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. కానీ, ఎనిమీ ప్రాపర్టీని సెటిల్‌మెంట్ చేసే పరిస్థితి లేకపోవడంతో రెవెన్యూ అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఎనిమీ ప్రాపర్టీగా చెబుతున్న సర్వే నంబర్లలోని భూముల్లో దాదాపు పట్టా రైతులు ఉన్నారు. దీంతో ఈ సెటిల్‌మెంట్ జరిగే అవకాశాలు లేవని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎనిమీ ప్రాపర్టీగా కొంత భూమిని గుర్తించినా, దాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సంరక్షించాల్సి ఉంటుంది. దీనిపై స్థానికులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రామస్థులకు ఎలాంటి నష్టం జరగదని అధికారులు భరోసా ఇస్తున్నారు.

■ కదిలిన ప్రభుత్వం

» కొత్వాల్‌గూడ తాకట్టుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం

» రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామాన్ని ఓ ప్రైవేటు కంపెనీ తాకట్టు పెట్టిన వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహమూద్ అలీ రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీకి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. భారీ కుంభకోణం, భూముల వ్యవహారంపై కలెక్టర్ రఘునందన్‌రావుతో విచారణ జరిపించి నివేదిక పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. రెవెన్యూ విజిలెన్స్ శాఖ అడిషనల్ డీసీపీ సుదర్శన్ ఆధ్వర్యంలోని అధికారులు గురువారం సాయంత్రం శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను గంటపాటు పరిశీలించారు. గిర్దావర్‌ను పిలిపించి రికార్డుల గదిని తెరిపించారు. కొత్వాల్‌గూడకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను పరిశీలించినట్టు సమాచారం. కొత్వాల్‌గూడ గ్రామాన్ని థర్డ్ పార్టీ ద్వారా ఫైసీస్ అనే ప్రైవేటు సంస్థ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పీఈసీ (ది ప్రాజెక్టు అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్)కి తాకట్టు పెట్టి రూ.332 కోట్ల రుణం తీసుకుని ఎగ్గొట్టిన వైనంపై ప్రభుత్వ వర్గాలు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

కొత్వాల్‌గూడను ఆదుకుంటాం: సబితా రెడ్డి

కొత్వాల్‌గూడ గ్రామస్థుల జీవనానికి భూములే ఆధారమని మాజీ హోం మంత్రి సబితా రెడ్డి, ఆమె తనయుడు కార్తీక్‌రెడ్డి అన్నారు. ఊరు ఊరునే తనఖా పెట్టిన ఘనుడు సౌమిత్ రంజన్ జనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుంభకోణాన్ని సమర్థంగా వెలుగులోకి తీసుకొచ్చిందంటూ 'ఆంధ్రజ్యోతి'ని అభినందించారు.

కండకావరం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. మోదీ, కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు పలుచోట్ల రాస్తారోకో చేశారు. మోదీ, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం కూడా చేశారు. "రాష్ట్రాన్ని పాలిస్తున్న పెద్ద లోఫర్ కేసీఆర్.. ఐటీ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ చిన్న లోఫర్" అని మండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ మండిపడ్డారు. కేసీఆర్ గతంలో పాస్‌పోర్టు ఏజెంట్‌గా పనిచేశారని, కేసీఆర్, కేటీఆర్‌లను ప్రజలు చెంప వాయించే రోజు దగ్గరలోనే ఉందన్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నర్సింగరావు పల్లి చౌరస్తా నుంచి బిచ్కుంద వరకు మోటార్ సైకిల్ యాత్రను ఆయన ప్రారంభించారు. దళితుణ్ని సీఎం చేస్తానన్న కేసీఆరే ముఖ్యమంత్రి పీఠం ఎక్కారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని, పదేళ్ల పాటు ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా మంత్రి పదవైనా తీసుకోని చరిత్ర రాహుల్‌ది అని ఖమ్మంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మోదీ వ్యాఖ్యలు చిన్న పిల్లల మాటలను తలపిస్తున్నాయని, సీఎం కేసీఆర్, కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తెలంగాణను బీజేపీ ఎందుకు సమర్థించిందని, దేవాలయం లాంటి పార్లమెంటును మోదీ అబద్ధాలతో తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణకు బీజేపీ అనుకూలమా, వ్యతిరేకమా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దళిత సీఎం అంజయ్యను రాజీవ్‌గాంధీ అవమానించారని మోదీ పార్లమెంటులో అబద్ధం చెప్పారని, అంజయ్య కులం, అక్కడ ఏం జరిగిందో తెలియకుండా మాట్లాడటం ప్రధాని అవివేకానికి నిదర్శనమన్నారు. చిట్‌చాట్ పేరుతో చిట్టినాయుడు ఉరఫ్ అజయ్ ఉరఫ్ కేటీఆర్ పైత్యం ఎక్కి కాంగ్రెస్‌పై అవాకులు చవాకులు పేలారని, అధికార మదంతో వాస్తవాలు మరిచిన దద్దమ్మ అని, ఆయనకు తెలంగాణ ఉద్యమకారుల ఉసురు తగలక తప్పదని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కుమార్ హైదరాబాద్‌లో విమర్శించారు. కేటీఆర్ నమ్మించి నట్టేట ముంచే లంగ, లంఫంగ, లత్కోరు అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఒకప్పుడు రాయలసీమ ఫ్యాక్షనిజం ఉండేదని, ఇప్పుడు టీఆర్ఎస్ ఫ్యాక్షనిజం వచ్చిందన్నారు. తండ్రి అధికార మదం చూసి రెచ్చిపోతున్న కేటీఆర్ అజ్ఞానం, అహంకారం, కండకావరానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ దుర్యోధనునిలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే కేసీఆర్ ధృతరాష్ట్రునిలా మౌనంగా ఉన్నారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన నాయన మాత్రం దేశం నుంచి మనుషుల్ని అక్రమ రవాణా చేసిన దొంగ అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టీఆర్ఎస్ లత్కోర్ పార్టీ అని, దాన్ని నడుపుతున్నది మోసగాళ్ల కుటుంబమని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మంత్రి కేటీఆర్ కండకావరంతో కొట్టుకుంటున్నారని, బాగా బలిసి మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకునేందుకే తెలంగాణలో నంబర్ వన్ కేటుగాడు ఎవరనే విషయంలో కేటీఆర్, కేసీఆర్ పోటీ పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ను లోఫర్ పార్టీ అని విమర్శించిన మంత్రి కేటీఆర్ శిఖండిలా ఉంటారని మాజీ ఎంపీ వీహెచ్ ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన యువరాజు కేటీఆరే రాష్ట్రంలో నెంబర్ వన్ లోఫర్ అని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌తో రాజకీయ జీవితాన్ని ఆరంభించిన కేసీఆర్ కూడా లోఫరే అని మాజీ ఎంపీ పొన్నం అన్నారు. కేటీఆర్ నడవడికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని మర్రి శశిధర్‌రెడ్డి విమర్శించారు.



మీడియాతో మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్

కేటీఆర్ ఓ అజ్ఞాని : లక్ష్మణ్

కేంద్ర బడ్జెట్‌పై మంత్రి కేటీఆర్ అజ్ఞానిలా మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. రైతులు, అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కొనియాడారు. పంటలకు గిట్టుబాటు ధరలను శాస్త్రీయ పద్ధతిలో పెంచిందని, రైతు రుణాలకు రూ.11 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌కు ప్రజామోదాన్ని జీర్ణించుకోలేకనే టీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు.

కేటీఆర్.. సీసీ ఫుటేజీ బయట పెట్టాలా?

» నా ఆఫీసుకు వచ్చింది నిజం కాదా?: కోమటిరెడ్డి

కేటీఆర్ అని గూగుల్‌లో టైప్ చేస్తే దోపిడీ దొంగ అని వస్తుందని, ఆయన డబ్బా పదవితో మదమెక్కి మాట్లాడుతున్నారని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఇతర పార్టీల నేతలకు వల వేసి దివాలాకోరు రాజకీయాలు చేస్తున్న కేటీఆర్ తన ఆఫీసుకు కూడా వచ్చారన్నారు. తనకు మంత్రి పదవి ఇప్పిస్తానని ఆశ పెట్టారన్నారు. కేటీఆర్ తన ఆఫీసుకు వచ్చిన సీసీ ఫుటేజీని బయట పెట్టేందుకు సిద్ధమన్నారు. తాను పార్టీ మారే ప్రసక్తేలేదన్నారు. రాహుల్‌పై వ్యాఖ్యలను కేటీఆర్ తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శుక్రవారం • 9 ఫిబ్రవరి 2018

సొగసు



మరో నాలుగు రోజుల్లో రాబోయే వాలంటైన్స్‌డే కోసం షాప్స్, మాల్స్‌లో, గిఫ్ట్ షాపుల్లో హడావిడి మొదలైపోయింది. గులాబీ, ఎరుపు రంగుల్లో గిఫ్ట్స్, గ్రీటింగ్ కార్డ్స్ కొలువుదీరాయి. బహుమతులతో పాటు బట్టల్లో కూడా ప్రేమసౌందర్యం కనిపించాలి కదా! అందుకే 'ప్రేమ'కు గుర్తుగా గులాబీ, ఎరుపు రంగులతో అందంగా ముస్తాబైన చీరలు, బ్లౌజ్‌లు మీ కోసం...

యానిమల్ ప్రింట్ ఉన్న ఎరుపు రంగు ఉప్పాడ పట్టు చీర ఇది. ఈ చీరకు కాంట్రాస్ట్‌గా ఫిరోజా (కాపర్ సల్ఫేట్) రంగు, కాశ్మీరి వర్క్ ఉన్న ఫ్యాబ్రిక్‌తో బ్లౌజ్ కుట్టారు. బ్లౌజ్ స్టయిలిష్‌గా కనిపించేందుకు నూడుల్ స్ట్రాప్స్ ఇచ్చారు. మిక్స్ అండ్ మ్యాచ్ ఫ్యాషన్ నడుస్తోంది కాబట్టి కాంట్రాస్ట్ రంగులే వాడుతున్నారు ఎక్కువగా.
చీర : 12,000 రూపాయలు
బ్లౌజ్ : 1,800 రూపాయలు

ప్రేమకు గుర్తుగా...



మోడల్
అదితి మైఖేల్

ఈ చీర కోసం బేబీ పింక్ ఆర్గంజా ఫ్యాబ్రిక్ వాడారు. కుచ్చిళ్లకు మూడు మీటర్ల ఆర్గంజా ఫ్యాబ్రిక్ ఉంచి, చీర పై భాగానికి బేబీ పింక్ నెట్ ఫ్యాబ్రిక్‌నే వాడారు. అంచులకు సిల్వర్ లేస్ ఇచ్చారు. చీర క్లాత్‌నే బ్లౌజ్‌కి కూడా వాడారు. సిల్వర్ చిప్స్ సీక్విన్స్‌తో, వర్క్‌తో బ్లౌజ్ డిజైన్ చేశారు.
బ్లౌజ్‌తో కలిపి చీర ధర: 6,500 రూపాయలు.

మెజెంతా పింక్ ఉప్పాడ పట్టు చీర మీద యానిమల్ ప్రింట్ వచ్చింది. ఈ చీర పైకి కచ్ వర్క్ వచ్చిన బ్లౌజ్ కుట్టారు. ఈ బ్లౌజ్‌కు హాల్టర్ పోలో నెక్ ఇచ్చారు కాబట్టి కచ్‌వర్క్ మిర్రర్స్ డిజైన్ ముందు భాగాన ఇచ్చారు.
చీర : 12,000 రూపాయలు
బ్లౌజ్ : 1,500 రూపాయలు



యాంటిక్ డిజైన్ ఉన్న క్రేప్ జార్జెట్ ఫ్యాబ్రిక్ గ్రే కలర్ చీర ఇది. ఈ చీరకు లేస్ కుట్టారు. మామూలుగా అయితే గ్రే రంగు చీరకు కాంట్రాస్ట్‌గా ఏ రంగైనా వేసుకోవచ్చు. కాని... వాలంటైన్స్ డే అంటేనే గులాబీ, ఎరుపు రంగులు కాబట్టి. అదే థీమ్‌లో మిర్చి రెడ్ కలర్ బ్లౌజ్ కుట్టారు. కట్ వర్క్ క్లాత్, రా సిల్క్ క్లాత్ రెండూ కలిపి ఈ బ్లౌజ్ డిజైన్ చేశారు.
బ్లౌజ్‌తో కలిపి చీర ధర: 4,500 రూపాయలు

సేకరణ : కిరణ్మయి



డిజైనర్: **సమతా రెడ్డి**
సైనిక్‌పురి, సికింద్రాబాద్

కౌన్సెలింగ్ కార్నర్

ఈ బాధ పోయేదెలా?

నా వయసు 23. మా అమ్మానాన్నలకు నేనొక్కతినే సంతానం. వాళ్ళది ప్రేమవివాహం. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నందువల్ల అందరికీ దూరంగా ఉన్నారు. దాంతో అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల ప్రేమకు నేను దూరమయ్యాను. నాన్న కూడా బిజీగా ఉంటూ, ఇంటిని పట్టించుకోరు. దాంతో ఒంటరిని అనే భావన మొదలై, నన్ను కుంగదీస్తోంది. ఎంతగా ధైర్యం తెచ్చుకుందామన్నా, నా వల్ల కావడం లేదు. ఈ బాధ పోవాలంటే ఏం చేయాలి?

- కావ్య



చదువు, ఉద్యోగం, స్నేహితులు అంటూ తీరిక లేకుండా ఉండే వయసు మీది. అయినా అయినవారి ప్రేమ కోసం తపిస్తున్నారు. అమ్మానాన్న ఉన్నా ఇంత బాధ పడుతున్నారంటే ఇంకేదో సమస్య ఉండి ఉండాలి. నాన్న బిజీగా ఉన్నా, అమ్మతో మాట్లాడవచ్చు కదా! అసలు ఇన్నేళ్లు మీ వాళ్ళను కలిసేందుకు ప్రయత్నాలు జరగలేదా? ఎవరైనా సరే పిల్లలు పుట్టాక కలిసిపోతారు. మరి మీ అమ్మానాన్నలకు ఏం ఇబ్బందులున్నాయో? ఒకసారి అమ్మతోనో, నాన్నతోనో మాట్లాడండి. వీలైతే మీ బంధువులను కలిసే, కలిపే ప్రయత్నం చేయండి. నాన్న తీరిక లేకుండా ఉన్నారంటే మీ భవిష్యత్తు కోసమే అనుకోవచ్చుగా! అయినా మీకు ప్రేమగా చూసుకునే తల్లిదండ్రులు ఉన్నారు. మీరిలా బాధపడితే వారెంత కుంగిపోతారో కదా! పోట్లాడుకునేవారు పదిమంది చుట్టూ ఉండడం కన్నా, ప్రేమగా ఉండే ఒకరిద్దరు చాలు. ఎవరూ లేని అనాథలు, అందరూ ఉండీ ఒంటరులైనవారు చాలామంది ఉన్నారు. వారి గురించి ఆలోచించండి. వీలయితే అటువంటి వారికి ఆదరణ కల్పించండి. అనుబంధాలకూ, ఆప్యాయతకూ బంధుత్వాలే పునాది కానక్కరలేదని తెలుసుకుంటారు.

• **కె.శోభ,** ఫ్యామిలీ కౌన్సెలర్,
హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com

విభిన్నం

ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లల 'డ్రాపౌట్స్'కు ప్రధానకారణం 'పీరియడ్స్' సమస్యగా చాలాకాలం క్రితమే గణాంకాలు తేల్చాయి. నెలసరి సమయంలో బాలికలు మానసిక ఆందోళనకు గురవుతుంటారు. ఇంటిదగ్గర కన్నా పాఠశాల తరగతుల గదుల్లో ఉన్న సమయంలో వారిలో ఈ ఆందోళనలు ఎక్కువగా ఉంటాయి. అందుకే బడికి రాకుండా ఇంటిదగ్గరే ఉండిపోతారు. వారిలో ఆందోళనలు తొలగించి, ఈ సున్నితమైన సమస్యకు చక్కని పరిష్కార మార్గాన్ని చూపింది ఓ ప్రభుత్వ పాఠశాల.





ఆదర్శం... ఆ ప్రభుత్వ పాఠశాల!

విజయవాడలోని పటమటలంకలో ఉన్న వల్లూరి సరోజినీదేవి నగరపాలక సంస్థ (వి.ఎం.సి) ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులు నెలసరి సమస్యను జయించారు. ఈ పాఠశాలలో ప్రయోగాత్మకంగా 'వెండిగో శానిటరీ నాప్కిన్స్' యంత్రాలను ఏర్పాటు చేశారు. తరగతి గదిలో ఉండగా పీరియడ్స్ వస్తే వెంటనే బాత్‌రూంకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన శానిటరీ నాప్కిన్ మెషిన్‌లో రూ. 10 కాయిన్‌లను వేసి నాప్కిన్‌లు పొందొచ్చు. ఈ యంత్రాల వినియోగంపై తొలుత కొంతమంది విద్యార్థినిలకు అవగాహన కల్పించి వారిలో నలుగురిని టీమ్‌గా ఏర్పాటు చేశారు. ఈ నలుగురు తోటి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తారు. పటమటలంక పాఠశాలలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ విధానం విజయవంతమై ఉపాధ్యాయులు, బాలికలు, వారి తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు వస్తుండటంతో... మిగతా పాఠశాలల్లో ఈ యంత్రాలను ఏర్పాటు చేయాలని విజయవాడ నగర కమిషనర్ నివాస్ నిర్ణయించారు.

ఎలా పనిచేస్తాయి ....

బరువు తూచే యంత్రాల తరహాలో వెండిగో సంస్థ ఈ యంత్రాలను రూపొందించింది. తొలి ప్రయత్నంగా రూ.50 వేలతో రెండు శానిటరీ మెషిన్స్, ఒక బర్నింగ్ మెషిన్ పటమటలంక పాఠశాలలో ఏర్పాటుచేశారు. ఈ యంత్రం లోపల ప్రొడక్ట్ -1 , ప్రొడక్ట్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి ఒక్కో విభాగంలో మూడు నాప్కిన్స్ కలిగిన 10 ప్యాకెట్లు ఉంటాయి. ఒక్కో ప్యాకెట్ వెల రూ. 10. రూ.1, రూ.5, రూ.10 కాయిన్స్ మెషిన్‌లో వేసుకునే విధంగా ఒకదాని కింద ఒకటి వరుసగా ఉంటాయి. తొలుత ప్రొడక్ట్ - 1 లేదా, 2 బటన్‌ను ప్రెస్ చేసిన తరువాత బీప్ శబ్దం రాగానే రూ. 10కి సరిపడా కాయిన్స్ మెషిన్‌లో వేయాలి. అంటే రూపాయి కాయిన్లు అయితే పది, ఐదు రూపాయల కాయిన్లు రెండు, పది రూపాయల కాయిన్ ఒకటి వేసిన తరువాత మెషిన్‌లో నుంచి శానిటరీ నాప్కిన్ ప్యాకెట్ వస్తుంది.



బర్నింగ్ మెషీన్

కాలుష్య నివారణకు 'బర్నింగ్ మెషీన్'

సాధారణంగా వాడేసిన నాప్కిన్‌లు మరుగుదొడ్ల ద్వారా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి పంపడంతో అవి నీటిలో కుళ్లకుండా మ్యానుహోల్ వద్ద గుట్టలకొద్ది పేరుకుపోయి మురుగునీరు దిగువకు వెళ్లకుండా ఆటంకం కలిగిస్తున్నాయని కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పాఠశాలలో 'బర్నింగ్ మెషీన్'ను కూడా ఏర్పాటు చేశారు. ఈ మెషీన్ పరిమాణం 10 నాప్కిన్ల వరకు ఉంటుంది. 10 నాప్కిన్లతో నిండిన బర్నింగ్ మెషీన్ స్విచ్చాన్ చేసి హీట్ చేయడం ద్వారా అవి దగ్ధమై మెషీన్‌లో నుంచి పొగ బయటకు వెళుతుంది. పొగ తెలుపు నుంచి నలుపు రంగులోకి మారగానే స్విచ్ఛాఫ్ చేయాలి. కొద్దిసేపటికి బూడిద మెషీన్‌లో అమర్చిన ప్లేట్‌లోకి వచ్చేస్తుంది. ఆ ప్లేట్‌ను తొలగించి డస్ట్‌బిన్‌లో వేయాలి. ఇలా అతి సులువైన సాంకేతిక విధానం ద్వారా బాలికల సున్నితమైన సమస్యకు పరిష్కారాన్ని చూపారు. ఇటీవల పాఠశాలలోని ఈ యంత్రాల పనితీరును పరిశీలించిన కమిషనర్ ఉపాధ్యాయులను మెచ్చుకుని ఈ యంత్రాలను మిగతా పాఠశాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మా విద్యార్థినులు అదృష్టవంతులు



- జ్యోతి రాధ, హెచ్‌ఎం

నగరంలోని ఏ కార్పొరేట్ పాఠశాలలోనూ లేని సదుపాయాన్ని మా పాఠశాల విద్యార్థినులకు ఏర్పాటు చేశారు. ఈ యంత్రాలు వచ్చిన తరువాత విద్యార్థినులు ఆరోగ్యకరంగా వీటిని వినియోగించుకుంటున్నారు. ఈ యంత్రాలతో పాటు బర్నింగ్ మెషిన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పారిశుధ్య సమస్య లేదు. బాలికల సున్నితమైన సమస్యను దృష్టిలో ఉంచుకుని వీటిని ప్రతి పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

• **పి.ప్రద్యుమ్న,** విజయవాడ
ఫోటోలు: డి.శివబాబు

లక్ష్య శుద్ధి!



ఉపదేశం

ఒక లక్ష్యాన్ని ఎంచుకోండి. ఆ లక్ష్యాన్నే మీ జీవితంగా మార్చుకోండి. దాని గురించే యోచన చెయ్యండి. దాన్నే కలలు కనండి. ఆ లక్ష్యం మీదే జీవించండి. మీ మెదడు, కండరాలు, నరాలు- ఇలా మీ శరీరంలోని ప్రతి భాగాన్నీ దానితోనే నింపండి. మిగిలిన ఆలోచనలన్నిటినీ విడిచిపెట్టండి. విజయం సాధించడానికి మార్గం ఇదే.

● స్వామి వివేకానంద

సమాచారం

సద్గురు చెంత శివరాత్రి

సద్గురు జగ్గీవాసుదేవ్ ప్రధాన కార్యక్షేత్రమైన ...



సందర్భం

శంకరం... శుభకరం



ఫిబ్రవరి 13 మహాశివరాత్రి

మాఘ బహుళ చతుర్దశి రోజున జ్వాలా స్తంభంలో తేజో శివలింగంగా మహా శివుడు ఆవిర్భవించాడని పురాణాలు చెబుతున్నాయి. అందువల్లే ఆ రోజు మహా శివరాత్రిగా ప్రసిద్ధి. భారత దేశ వ్యాప్తంగా హిందువులు పాటించే పర్వదినం ఇది. శివభక్తులకు ముఖ్యమైన పండుగ. ఈ రోజున భక్తులు పగలంతా ఉపవాసం ఉంటారు. శివ కథలు వింటూ, భజనలతో, రుద్రాభిషేకాలతో స్వామిని అర్చిస్తారు. రాత్రి జాగరణ చేస్తారు.

"శివరాత్రి మహారాత్రం నిరాహారో జితేంద్రియః
అర్చయే ద్వా యథాన్యాయం యథా బల మవంచకః
యత్ఫలం లభతే సద్యః శివరాత్రౌ మదర్చనాత్!"

... యుగంలో శివుని పూజించి తమ కార్యాలను నెరవేర్చుకున్నారు. 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీమంత్రం శివుడికి పంచభూతాత్మకమైన సర్వవ్యాపకత్వం ఉందని తెలియజేస్తోంది. ఆ అక్షరాలలో 'ఓం' అంటే పరమశివుడు. 'న' అంటే నభము- ఆకాశం, 'మ' అంటే మరుత్తు- గాలి, 'శి' అంటే శిఖ- అగ్ని, 'వ' అంటే నీరు, 'య' అంటే పృథ్వి- నేల అనే అర్థాలున్నాయి.

"ఈ పర్వదినాన ఎవరైనా తెలిసికానీ, తెలియక కానీ పరమేశ్వరుణ్ణి ఆరాధిస్తే- అతడు ...

● డాక్టర్ రాపాక ఏకాంబరాచార్యులు

శ్రీభగవాన్ అద్భుత లీలలు

(గత సంచిక తరువాయి)

రామలింగస్వామి అనే ఆయన తన కథని ఇట్లా చెప్పుకున్నాడు. "నాకన్నా దురదృష్టవంతుడెవ్వడూ ఉండడు. పెళ్లయిన కొద్ది రోజులకే కుష్టు రోగం వచ్చింది. ఎన్ని మందులు వాడినా గుణం కనిపించలేదు. చివరకు నా భార్యను కూడా కన్నెత్తి చూడలేకపోయాను. నా జీవితం దుర్భరమైంది. తిరువణ్ణామలైలో 'విభూతిస్వామి' అని ఒకాయన ఉన్నారని, ఆయన నా జబ్బుని నయం చేయగలరని ఒక స్నేహితుడు చెబితే ఆయనను దర్శించుకున్నాను. తీరా వెళితే ఆ స్వామి పచ్చి మోసగాడని తెలిసింది. ఏం చేయాలో తెలియక దిగాలుగా తిరుగుతూంటే ఎవరో ఒక అపరిచిత వ్యక్తి నాతో 'ఎందుకింత దిగులు! శ్రీరమణాశ్రమంలో ఒక మహనీయుడున్నాడు. ఆ ఆశ్రమం ...

శ్రీరమణ కథామృతం



(సశేషం)

● పింగళి సూర్యసుందరం

ఇది మాకు పరీక్షేమో!

- సాయిధరమ్‌తేజ్



"మెగా హీరోలం ఒకేసారి థియేటర్లలోకి రావాలని ఎప్పుడూ అనుకోం. ఈ సారి నేను, వరుణ్ ఒక రోజు గ్యాప్‌తో వస్తున్నాం. ఇప్పుడు కూడా పోటీపడకుండా ఉండటానికి వీలవుతుందేమోనని కూర్చుని ఆలోచించాం. కానీ మా నిర్మాతలు ముందుగానే విడుదల తేదీలను ప్లాన్ చేసేశారు. దాంతో మేం చేసేదేమీ లేక ఇద్దరం చేతులు ఎత్తేశాం. ఇది మాకు పరీక్షా కాలమేమో. మున్ముందు ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలి" అని సాయిధరమ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ "చిరంజీవిగారితో 150వ సినిమా చేసిన వెంటనే వినాయక్‌గారు నాతో ప్రాజెక్ట్ మొదలుపెడతారని నేనెప్పుడూ ఊహించలేదు. ఆయన ఫోన్ చేసి సినిమా చేద్దామన్నప్పుడు చాలా ఆనందమేసింది. నా దృష్టిలో నా గురువులందరూ ఇంటలిజెంట్‌లే. నేను ప్రతి సినిమా ... నేర్చుకుంటాను. సినిమాలు ఎందుకు ఆడలేదో కూడా ఆలోచిస్తాను. ఆ తప్పులు దిద్దుకుంటాను. ... చిత్రాల నుంచి చాలా నేర్చుకున్నాను" అని చెప్పారు. రీమిక్స్ పాటల గురించి మాట్లాడుతూ ... 'చమక్కు చమక్కు..' పాటను రీమిక్స్ చేసి పెట్టాలనే ఆలోచన వినాయక్‌గారిది. మావయ్య ... చేసిన ప్రతిసారి మరింత బాధ్యతగానే చేశాను. మా ఫ్యామిలీలోని యువ ... మావయ్యలు చాలా సపోర్ట్ చేస్తారు. వీలైనంతవరకు మా ఫంక్షన్లకు రావడాని ...



వీరనారిగా సన్నీ!

... అభిమానులు ఉన్నారిక్కడ' షూటింగ్ ప్రారంభమైన అనంతరం సన్నీ మీడియాతో మాట్లాడిన మాటలివి.

కోరిక కాదు.. అవసరం!

- సమంత



... అక్షరరూపం ఇచ్చారు. తెలుగు, తమిళంలో ఈ ఏడాది ఆమె ఆరు సినిమాలతో బిజీగా ఉన్నారు.





ట్రై సుడోకు - 101

8			7	5	2		1	
3					6	8		
9	7							5
6				3				
			2		8			
				6				8
5							6	9
		1	5					2
	3		6	2	7			1

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 100 సమాధానం

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

సందేశం




అలా చేయడం విధి!

... ● మహమ్మద్ వహీయుద్దీన్

ఆ నాలుగు ప్రశ్నలు

ధర్మపథం



... ● బొర్రా గోవర్ధన్

విడిపించుకోవాల్సిందే!



నవజీవనవేదం

సాధారణంగా రజోగుణ ప్రవృత్తి ఎక్కువగా కలిగి ఉంటే, అది క్రమక్రమంగా విజృంభిస్తుంటే తమోగుణంగా, ఆసురీగుణంగా మారిపోతుంది. ఆ ఆసురీ గుణం గురించి చెబుతున్నాడు ఇంకాస్త వివరంగా శ్రీకృష్ణపరమాత్ముడు. "అర్జునా! ఆశాపాశాలు మనిషిని బంధిస్తాయి. దాన్ని విడిపించుకునే ప్రయత్నం భక్తి వైరాగ్యాల ద్వారా చేయకపోతే మనిషి గోతిలో పడతాడు. పైగా అతని ఆలోచనలు ఎలా ఉంటాయంటే...

ఇద మద్య మయా లబ్ధం ఇమం ప్రాప్స్యే మనోరథమ్!
ఇద మస్తీద మపి మే భవిష్యతి పునర్ధనమ్!!

సాధారణంగా కొత్తగా ఉద్యోగంలో చేరినవారు, కొత్తగా వ్యాపారం ప్రారంభించిన వారు, కొత్తగా సంసార జీవితంలోకి ప్రవేశించిన వారు ఇలా ఆలోచిస్తారు. ముఖ్యంగా మొదటి సంవత్సరం ఇలా ఆలోచిస్తారు. ఆ తరువాత మారతారు. మొదటి సంవత్సరం ఎలా ఉంటుందంటే 'ఇదమద్య మయా లబ్ధం'. వాడి భార్య గురించి మాట్లాడుతూ 'నేను ఎలాంటి అమ్మాయి కావాలనుకున్నానో అలాంటి అమ్మాయి దొరికింది' అంటాడు. అమ్మాయి కూడా 'నా భర్త గురించి ఎంత చెప్పినా ...



● డా. గరికిపాటి నరసింహారావు

ఆచరించడమే ఆదర్శం!




దైవ సందేశం

... ● సుశీల్ సంధ్యాల




సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
a v.v.vinayak film
నేడే
విడుదల
ఇంటెలిజెంట్
INTTELLIGENT
వి.వి.వినాయక్ సి.కళ్యాణ్
సి.వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా యస్.యస్.తమన్
శివ ఆకుల గౌతంరాజు ఎస్.వి.విశ్వేశ్వర్ బ్రహ్మ కడలి వెంకట్ బి.ఏ.రాజు
TO PARTICIPATE IN INTELLEGENT MOVIE CONTEST
SCAN QR CODE IN Paytm APP
AND WIN UPTO 1 LAKH PAYTM CASH
U/A
ADITYA MUSIC
ప్రేక్షక అభిమానులు 'ఇంటెలిజెంట్' పైరసీ లింక్ తెలిసినచో ఈ క్రింది ఫోన్ నంబర్ లేదా
ఈ-మెయిల్ కు తెలియచేసి, మా హీరో చేతుల మీదుగా బహుమతి అందుకోండి.
ఫోన్: 040-23547823, వాట్సప్ నెం: 99665 04504 (మహేందర్)
ఈ-మెయిల్: cybercell@apfilmchamber.com


ARIAANA - VIVIANA - VIDYA NIRVANA PRESENT
SREE LAKSHMI PRASANNA PICTURES
#MB42
నేడే
విడుదల
గాయత్రి
WORKING TITTLE
GAYATRI
DR M MOHAN BABU MADAN RAMIGANI
VIJAY BANDLA SUBBA ARUMILLI SARVESH MURARI 'DIAMOND' RATNABABU PARUCHURI BROTHERS
S S THAMAN KANAL KANNAN CHINNA MR VARMA
sillymonks
U/A


#MB42
నేడే
విడుదల
ARIAANA - VIVIANA - VIDYA NIRVANA PRESENT
SREE LAKSHMI PRASANNA PICTURES
గాయత్రి
GAYATRI
DR M MOHAN BABU MADAN RAMIGANI
VIJAY BANDLA SUBBA ARUMILLI SARVESH MURARI 'DIAMOND' RATNABABU PARUCHURI BROTHERS
S S THAMAN KANAL KANNAN CHINNA MR VARMA
sillymonks
U/A

గూగుల్‌కు రూ.136 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ : అనుచిత వ్యాపార విధానాలు అనుసరిస్తున్నందుకు సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్‌కు కాంపిటీషన్ కమిషన్ 136 కోట్ల రూపాయల జరిమానా విధించింది. గూగుల్‌పై అనుచిత వ్యాపార ధోరణుల కేసు 2012లో దాఖలయింది. యాంటీ ట్రస్ట్ ప్రవర్తన నిబంధనలు ఉల్లంఘించినందుకు ఈ జరిమానా విధిస్తున్నట్టు సిసిఐ తెలిపింది. ఇలాంటి అభియోగంపై గూగుల్ జరిమానా భరించాల్సివచ్చిన అరుదైన కేసు ఇది. కేసును అన్ని కోణాల నుంచి సునిశితంగా పరిశీలించిన తర్వాతే జరిమానా విధింపు నిర్ణయం తీసుకున్నట్టు సిసిఐ వివరించింది.



ఆటో ఎక్స్‌పోలో భాగంగా హ్యుండయ్ స్వచ్ఛ్ క్యాన్‌తో బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్, హ్యుండయ్ ఎండి, సిఇఒ వైకె కూ

రెండు నెలల్లో ఆటో విధానం ముసాయిదా

భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్ గీతే

గ్రేటర్ నోయిడా: వచ్చే రెండు నెలల కాలంలో సరికొత్త ఆటో విధాన ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేయనున్నట్టు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్ గీతే పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పర్యావరణ అనుకూల వాహనాలకు అవసరమైన టెక్నాలజీ ప్రాధాన్యం పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ విధానం తీసుకురానున్నట్టు ఆయన చెప్పారు. గురువారంనాడిక్కడ 14వ ఆటో ఎక్స్‌పోను ప్రారంభించిన సందర్భంగా అనంత్ గీతే మాట్లాడారు. పరిశ్రమకు, వినియోగదారులకు అనుకూలంగా ఉండే విధానాన్ని తెస్తామని, ఇందుకోసం అన్ని వర్గాల సలహాలను స్వీకరిస్తామని ఆయన చెప్పారు. ఫేమ్ పథకం వచ్చే మార్చిలో ముగిసిపోతుందని, దీన్ని రెండో విడతగా కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. పన్నులకు సంబంధించి పరిశ్రమవర్గాల నుంచి అనేక అభ్యర్థనలు వస్తున్నాయని, కొత్త ఆటో విధానంలో వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై జిఎస్‌టి 12 శాతం కాకుండా 5 శాతం ఉండాలని పరిశ్రమ కోరుతోందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమ సిద్ధంకావాలని, బిఎస్-6 నిబంధనలకు తగిన వాహనాలు తెచ్చేందుకు కంపెనీ రెడీ కావాలన్నారు. కంపెనీలకు ప్రభుత్వం వైపు నుంచి తగిన సహకారం ఉంటుందని చెప్పారు. జిఎస్‌టి అమలవుతున్నప్పటికీ రాష్ట్రాల్లో స్థానిక పన్నుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిపై దృష్టిసారించాలని భారత ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ సంఘం (సియామ్) ప్రెసిడెంట్ అభయ్ ఫిరోడియా ప్రభుత్వాన్ని కోరారు.

మారుతి కొత్త స్విఫ్ట్ వచ్చేసింది...



మారుతి సుజుకీ తన సరికొత్త స్విఫ్ట్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర 4.99 లక్షల రూపాయల నుంచి 8.29 లక్షల రూపాయల (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) వరకు ఉంది. ఈ కారుకు గత నెలలోనే కంపెనీ బుకింగ్స్ ప్రారంభించింది. సుజుకీ ఐదో జెనరేషన్ హియర్‌టెక్ట్ ప్లాట్‌ఫామ్‌పై ఈ కారును రూపొందించినట్టు కంపెనీ పేర్కొంది. పెట్రోల్, డీజిల్ ఇంజన్లతో కొత్త స్విఫ్ట్ అందుబాటులో ఉంటుంది. పెట్రోల్ కారు 1.2 లీటర్ ఇంజన్, డీజిల్ కారు 1.3 లీటర్ ఇంజన్‌ను కలిగి ఉంటాయి. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పో రెండో రోజైన గురువారం నూతన స్విఫ్ట్‌ను విడుదల చేసిన సందర్భంగా మారుతి సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కెనిచి అయుకవా విలేకరులతో మాట్లాడారు. దేశీయ కస్టమర్ల అభిరుచుల్లో వేగవంతంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఇందుకు అనుగుణంగా కొత్త కార్లను తెస్తున్నామని ఆయన చెప్పారు. 2005లో స్విఫ్ట్‌ను మార్కెట్లోకి తెచ్చామని, ఇప్పటి వరకు 18 లక్షలకు పైగా అమ్మకాలను నమోదు చేసుకున్నట్టు ఆయన తెలిపారు. టూపెడల్ టెక్నాలజీతో మొదటిసారిగా స్విఫ్ట్ ఆటోగేర్ షిఫ్ట్‌తో అందుబాటులోకి వస్తోందన్నారు. కొత్త వెర్షన్‌లో పొడవైన వీల్‌బేస్ ఉందని, కేబిన్, లగేజ్ స్పేస్ ఎక్కువగా ఉందని ఆయన తెలిపారు. డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్స్, ఇబిడితో కూడిన ఎబిఎస్ వంటి ఆధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆటో క్లస్టర్

ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తామన్న కేంద్ర మంత్రి సురేష్ ప్రభు

న్యూఢిల్లీ : దేశ తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల్లో ఆటోమొబైల్ క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. వీటి ద్వారా ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధికి, ఎగుమతుల్లో పురోగతికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆటో క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రణాళికా విషయమై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడుతో చర్చిస్తానని సురేష్ ప్రభు తెలిపారు. విశాఖపట్నంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో ఆటో క్లస్టర్ విషయమై మాట్లాడనున్నట్టు మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఆటో క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నామని ఆయన స్పష్టం చేశారు. గురువారంనాడిక్కడ ఆటో కాంపోనెంట్స్ ఎక్స్‌పోను ప్రారంభించిన సందర్భంగా సురేష్ ప్రభు మాట్లాడారు.

తూర్పు తీరంలో ఆటో పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఒక బ్లూప్రింట్‌ను పరిశ్రమ తయారు చేయాలని, దీని ఆధారంగా చర్చలను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పశ్చిమ తీరంలోనూ క్లస్టర్ తెస్తామని, ఫలితంగా ఆటో ఎగుమతులు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. రానున్న సంవత్సరాల్లో దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయిని తాకుతుందని, ఇందులో లక్ష కోట్ల డాలర్లు వస్తుసేవల ఎగుమతుల ద్వారా సమకూరనున్నట్టు ఆయన చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వం స్పష్టమైన వ్యూహంతో ముందుకెళుతోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ ఆటోమొబైల్ కంపెనీలు భారత్‌లో తయారీకి అవకాశం ఉన్న ఉత్పత్తులపై దృష్టిపెట్టాలని ఆయన కోరారు. పరిశ్రమకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందన్న భరోసాను ఇచ్చారు.


ఎపి సిఎం చంద్రబాబు సమక్షంలో ఎంఒయుపై సంతకాలు చేస్తున్న ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ చైర్మన్ షేక్ అహ్మద్ బిన్ సయీద్, ఎపిఇడిబి సిఇఒ కృష్ణ కిశోర్

ఎపి విమానయాన రంగానికి ఎమిరేట్స్ గ్రూప్ తోడ్పాటు

మౌలిక సదుపాయాల కల్పనపై ఎంఒయు

హైదరాబాద్ : రాష్ట్రంలో విమానయాన రంగ అభివృద్ధికి తోడ్పడేందుకు ఎమిరేట్స్ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా ఇందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వంతో సహకరిస్తుంది. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందం(ఎంఒయు)పై ఎమిరేట్స్ ఎయిర్‌లైన్ అండ్ గ్రూప్ చైర్మన్, సిఇఒ షేక్ అహ్మద్ బిన్ సయీద్ అల్ మక్తౌం, ఎపి ఆర్థిక అభివృద్ధి బోర్డు (ఎపిఇడిబి) సిఇఒ కృష్ణ కిశోర్ సంతకాలు చేశారు. రాష్ట్రంలో విమానయాన రంగ అభివృద్ధికి అసరమైన నైపుణ్యాలు, పెట్టుబడుల విషయంలోనూ ఎమిరేట్స్ గ్రూప్ సహకారం అందిస్తుంది. రాష్ట్రంలో వైమానిక, విమానయాన రంగాలను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఒప్పందం మరింత చేయూత ఇస్తుందని ఎపిఇడిబి సిఇఒ చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలు, అందుకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి విషయంలోనూ ఎమిరేట్స్ గ్రూప్ సహకరిస్తుంది.

78 శాతం తగ్గిన గ్లెన్‌మార్క్ లాభం

ముంబై : గ్లెన్‌మార్క్ ఫార్మాసూటికల్స్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 104.70 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది (477.10 కోట్ల రూపాయలు)తో పోల్చితే నికర లాభం ఏకంగా 78 శాతం క్షీణించింది. సమీక్షా కాలంలో మొత్తం రాబడులు కూడా 13.07 శాతం తగ్గి 2,203.66 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి.

అమెరికా కంపెనీ అదిరే బైక్స్..



అమెరికాకు చెందిన బైక్‌ల కంపెనీ క్లెవెలాండ్ సైకిల్‌వెర్క్స్ (సిడబ్ల్యుసి) భారత మార్కెట్లోకి ప్రవేశిస్తోంది. ఆటో ఎక్స్‌పోలో పాల్గొంటున్న ఈ కంపెనీ రెండు బైక్‌లను గురువారం విడుదల చేసింది. ఏస్, మిస్‌ఫిట్ పేర్లతో ఇవి మార్కెట్లో అందుబాటులో ఉంటాయి. ఏస్ బైక్ 229 సిసి ఫోర్ స్ట్రోక్ ఇంజన్ కలిగి ఉంది. ఏస్ కేటగిరీలో మూడు సబ్ మోడల్స్ (ఏస్ డీలక్స్, ఏస్ స్క్రాంబ్లర్, ఏస్ కేఫ్) ఉన్నాయి. మిస్‌ఫిట్ మోడల్ కూడా 229 సిసి ఇంజన్‌తో వస్తోంది. 2019 సంవత్సరం నాటికి 5,000 బైక్‌లను విక్రయించాలన్న లక్ష్యంతో కంపెనీ ఉంది. 23 దేశాల్లో ఈ కంపెనీ తన బైక్‌లను విక్రయిస్తోంది. భారత్‌లో తన బైక్‌లను విక్రయించేందుకు లైష్ మాడిసన్ మోటార్ వెర్క్స్(ఎల్ఎంఎండబ్ల్యు)తో కంపెనీ చేతులు కలిపింది. పుణెలో ఇంటిగ్రేటెడ్ అసెంబ్లి యూనిట్ ఉందని, దీని స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం 35,000 యూనిట్లుగా ఉందని ఎల్ఎంఎండబ్ల్యు సిఇఒ ప్రణవ్ టి దేశాయ్ తెలిపారు. ప్రస్తుతం మన దేశంలో బిఎండబ్ల్యు, డుకాటీ, హార్లేడేవిడ్సన్, ట్రయంఫ్ వంటి కంపెనీలు తమ లగ్జరీ బైక్‌లను విక్రయిస్తున్నాయి.

ట్వంటీ టు మోటార్స్ ఎలక్ట్రిక్ 'ఫ్లో'



ఎలక్ట్రిక్ టూవీలర్లను తయారు చేస్తున్న ట్వంటీ టు మోటార్స్ కంపెనీ స్మార్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఫ్లో'ను విడుదల చేసింది. దీని ధర 74,740 రూపాయలు. వచ్చే మూడేళ్లకాలంలో రెండు లక్షలకు పైగా స్కూటర్లను మార్కెట్లోకి తీసుకురానున్నట్టు కంపెనీ పేర్కొంది. రెండో త్రైమాసికంలో హర్యానాలోని మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కంపెనీ ప్రారంభించనుంది. ఏటా 50,000 వాహనాలను తయారు చేయనుంది. తొలుత రోజుకు 300 స్కూటర్లను ఉత్పత్తి చేస్తామని, క్రమంగా ఉత్పత్తిని పెంచుకుంటూ వెళతామని ట్వంటీ టు మోటార్స్ సిఇఒ, సహ వ్యవస్థాపకుడు పర్వీన్ ఖర్బ్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ కలిగిన ఈ బైక్‌ను దూర ప్రాంతం నుంచి కూడా ట్రాక్ చేయవచ్చని ఆయన చెప్పారు. ఈ బైక్‌లో జియో ఫెన్సింగ్ సదుపాయం ఉందని, దీని ద్వారా ఎవరైనా బైక్‌ను దొంగిలిస్తే వాహన యజమానికి అలర్ట్‌లు వస్తాయని తెలిపారు. 5 గంటల పాటు చార్జింగ్ చేస్తే 80 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చు.



లోహియా 'కంఫర్ట్ ఇ ఆటో'

లోహియా గ్రూప్‌నకు చెందిన లోహియా ఆటో ఎలక్ట్రిక్ త్రీవీలర్ 'కంఫర్ట్ ఇ ఆటో'ను విడుదల చేసింది. దీని ధర 1.49 లక్షల రూపాయలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ). సెంట్రల్‌లాకింగ్ సిస్టమ్, జిపిఎస్ వంటి సదుపాయాలున్నాయి. లిథియం అయాన్ బ్యాటరీతో నడిచే ఈ ఆటో గంటకు 30 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే 80 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చు. ఆటో ఎక్స్‌పోలో భాగంగా ఈ కంపెనీ ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శిస్తోంది.

ఎంఫ్లక్స్ మోటార్స్ నమూనా ఇ-బైక్

స్టార్టప్ సంస్థ ఎంఫ్లక్స్ మోటార్స్.. తన ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ బైక్ ఎంఫ్లక్స్ వన్ నమూనాను ఇక్కడ ప్రదర్శించింది. 2019 ఏప్రిల్ వరకు ఇది మార్కెట్లోకి రానుంది. 9.7కెడబ్ల్యుహెచ్ లిథియం అయాన్ బ్యాటరీ కలిగిన ఈ బైక్ గంటకు 200 కిలో మీటర్ల వేగంతో వెళుతుంది. విస్తరణ కోసం 50 లక్షల డాలర్లు సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది. తొలుత 199 వాహనాలు దేశీయ మార్కెట్‌కోసం, 300 వాహనాలు విదేశాలకు ఎగుమతి చేసేందుకు తయారు చేస్తామని కంపెనీ సహవ్యవస్థాపకుడు, సిఇఒ వరుణ్ మిట్టల్ తెలిపారు.



- యుఎం లోహియా టూవీలర్స్ కంపెనీ ఎలక్ట్రిక్ క్రూజర్ 'రెనెగేడ్ థార్'ను విడుదల చేసింది. దీని ధర 4.9 లక్షల రూపాయలు (ఎక్స్‌షోరూమ్). రెనెగేడ్ డ్యూటీ ఎస్, రెనెగేడ్ డ్యూటీ ఏస్ బైక్‌లను కూడా కంపెనీ విడుదల చేసింది. వీటి ప్రారంభ ధర 1.9 లక్షల రూపాయలుగా ఉంది.
- ఐదు సీట్లు ఉండే ఎలక్ట్రిక్ కారును తెచ్చే నిమిత్తం భారత్‌కు చెందిన బర్డ్ గ్రూప్‌తో స్వీడన్ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ యునిటి చేతులు కలిపింది. 2020నాటికి 7.14 లక్షల రూపాయల ధరతో కారును తీసుకురావాలని ఈ కంపెనీలు భావిస్తున్నాయి. యునిటి వన్ పేరుతో రెండు సీట్లున్న కారును ఈ కంపెనీ ప్రదర్శించింది.


సౌర ప్రాజెక్టులపై రూ.1,900 కోట్ల పెట్టుబడులు

థింక్ ఎనర్జీ, ఎవర్‌స్ట్రీమ్ క్యాపిటల్ వెల్లడి.. హైదరాబాద్ కేంద్రంగా జాయింట్ వెంచర్ కార్యకలాపాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భారత సోలార్ ఫొటో వోల్టాయిక్ (పివి) రంగంలో అవకాశాలను సొంతం చేసుకునేందుకు జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అమెరికా న్యూజెర్సీకి చెందిన థింక్ ఎనర్జీ, ఎవర్‌స్ట్రీమ్ క్యాపిటల్ ప్రకటించాయి. జాయింట్ వెంచర్‌లో భాగంగా భారతీయ సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల్లో 30 కోట్ల డాలర్ల (సుమారు 1,900 కోట్ల రూపాయలు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్ కేంద్రంగా ఈ భాగస్వామ్య సంస్థ కార్యకలాపాలు సాగించటమే కాకుండా వచ్చే మూడేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 2000 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లు లేదా కొనుగోలు చేయాలని చూస్తున్నట్లు థింక్, ఎవర్‌స్ట్రీమ్ జాయింట్ వెంచర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవిశంకర్ తూములూరి తెలిపారు. కాగా థింక్ ఎనర్జీ, ఎవర్‌స్ట్రీమ్.. ఇప్పటికే స్పానిష్ డెవలపర్‌తో కలిసి తెలంగాణలోని ఆరు జిల్లాల్లో 104 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టులను ప్రారంభించినట్లు థింక్ ఎనర్జీ సోలార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ అగర్వాల్ తెలిపారు.

2017 సంవత్సరం చివరి త్రైమాసికంలో ఈ ప్రాజెక్టులను విజయవంతంగా ప్రారంభించటమే కాకుండా వాణిజ్యపరంగా కార్యకలాపాలు ప్రారంభించాయని ఆయన పేర్కొన్నారు. జాయింట్ వెంచర్ సంస్థ గ్రౌండ్ మౌంటెడ్, రూఫ్‌టాప్ ఫొటో వోల్టాయిక్‌పై ప్రధానంగా దృష్టిసారించనుందని చెప్పారు. వీటితోపాటు ఎంపిక చేసిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ టెండర్లలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఇప్పటికే కర్నాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రల్లో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన టెండర్లలో పాల్గొని 23.39 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులను చేజిక్కించుకున్నట్లు అగర్వాల్ వెల్లడించారు. వచ్చే మూడేళ్ల కాలంలో భారత్‌లో పటిష్ఠమైన పోర్టుఫోలియోను ఏర్పాటు చేసుందుకుగాను 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. భారతీయ సౌర విద్యుదుత్పత్తి మార్కెట్ నిలకడగా ముందుకు సాగుతోందని, రానున్న రోజుల్లో భారీ స్థాయి సోలార్ పార్కులు వచ్చే అవకాశం ఉందని, జాయింట్ వెంచర్ సంస్థ ఇందులో మెరుగైన అవకాశాలు చేజిక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని అగర్వాల్ వెల్లడించారు.

'క్రిప్టో' ధనవంతుడు క్రిస్ లార్సన్ : ఫోర్బ్స్



న్యూయార్క్ : క్రిప్టోకరెన్సీలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల జాబితాను ఫోర్బ్స్ తొలిసారిగా విడుదల చేసింది. ఈ జాబితాలో రిప్పిల్ కో ఫౌండర్ క్రిస్ లార్సన్ 750-800 కోట్ల డాలర్ల క్రిప్టో నెట్‌వర్త్‌తో అగ్రస్థానంలో నిలిచారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీలతో అత్యంత రహస్యంగా వినూత్నమైన పద్ధతులను అవలంబించటం ద్వారా అనధికార క్రిప్టోకరెన్సీల విలువను అమాంతం పెంచుకుంటూ పోయిన సంగతి తెలిసిందే. క్రిప్టోకరెన్సీల్లో ప్రధానంగా బిట్‌కాయిన్, ఎథెరియం, ఎక్స్ఆర్‌పి ఉండగా 2017లో వీటి సగటు ధర 14,409 శాతం మేర పెరిగిందని ఫోర్బ్స్ తెలిపింది. ప్రస్తుతం 1,500కు పైగా క్రిప్టో ఆస్తులు ఉండగా వీటి విలువ 55,000 కోట్ల డాలర్లని పేర్కొంది. 2017 ప్రారంభం నుంచి చూస్తే ఈ ఆస్తుల విలువ ఏకంగా 31 రెట్లు పెరిగిపోయిందని ఫోర్బ్స్ తెలిపింది. కాగా క్రిస్ లార్సన్ తర్వాత ఈ జాబితాలో జోసెఫ్ లూబిన్ (100-500 కోట్ల డాలర్లు), చాంగ్‌పెంగ్ జోహ (100-120 కోట్ల డాలర్లు), కామెరాన్, టైలర్ వింకిల్‌వోస్ (90-110 కోట్ల డాలర్లు), మాథ్యూ మెల్లన్ (110 కోట్ల డాలర్లు) ఉన్నారు. ఇంకా ఈ జాబితాలో బ్రియాన్ ఆర్మ్‌స్ట్రాంగ్, మాథ్యూ రోస్‌జాక్, ఆంటోనీ డి లోరియో, బ్రాక్ పియర్స్, మైఖెల్ నోవగ్రాట్జ్, బ్రెండన్ బ్లుమర్, వాలెరీ వావిలోవ్, చార్లెస్ హాస్కిన్‌సన్, బ్రాడ్ గార్లింగ్‌హౌజ్, బ్యారీ సిల్బర్ట్, వితాలిక్ బుటెరిన్, టిమ్ డ్రాపర్, సోంగ్ చి హ్యాంగ్ ఉన్నారు. క్రిప్టో కరెన్సీలో భారీ ఒడిదుడుకులు, అనిశ్చితి నెలకొనటం వంటి అంశాల కారణంగా నెట్‌వర్త్‌ను వివిధ శ్రేణుల్లో అంచనా వేసినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. ఈ కరెన్సీల రుజువులను సమర్పించిన వారి ఆస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్లు ఫోర్బ్స్ తెలిపింది.

ఎంఎస్‌ఎంఇల వర్గీకరణ విధానం భేష్

మరిన్ని ఉపాధి అవకాశాలకు మార్గం

న్యూఢిల్లీ: టర్నోవర్ ఆధారంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీ (ఎంఎస్‌ఎంఇ)లను వర్గీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై పారిశ్రామిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. 'మన ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్‌ఎంఇలే వెన్నెముక. ఈ వర్గీకరణతో ఈ రంగంలో ఉత్పాదకత, సామర్థ్యం, పోటీతత్వం, ఉద్యోగ అవకాశాలు మరింత పెరుగుతాయి' అని సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ చెప్పారు. దీని వలన పారదర్శకత ఏర్పడి ఎంఎస్‌ఎంఇల వ్యాపార నిర్వహణ మరింత తేలికై ఈ రంగంలో మరిన్ని ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉందని ఫిక్కి అధ్యక్షుడు రశేష్ షా అన్నారు.

భారత పౌల్ట్రీపై సౌదీ అరేబియా నిషేధం

రియాద్: భారత్ నుంచి పౌల్ట్రీ ఉత్పత్తుల దిగుమతిపై నిషేధం విధిస్తున్నట్టు సౌదీ అరేబియా ప్రకటించింది. బెంగుళూరులోని ఒక కోళ్ల ఫారంలోని కోళ్లకు ప్రమాదకరమైన బర్డ్ ఫ్లూ వ్యాధి సోకినట్టు తెలియడంతో ఈ చర్య తీసుకున్నట్టు సౌదీ అరేబియా వ్యవసాయ మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పారిస్ కేంద్రంగా పనిచేసే ప్రపంచ పశు ఆరోగ్య సంస్థ (ఒఐఇ) నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భారత్ నుంచి బతికున్న కోళ్లతో పాటు కోడి పిల్లల ఉత్పత్తికి ఉపయోగించే హేచింగ్ ఎగ్స్, కోడి పిల్లల దిగుమతిని కూడా నిషేధిస్తున్నట్టు తెలిపింది.

2016కు ముందు గృహ రుణం తీసుకున్నారా ?

అయితే మీ ఇఎంఐ తగ్గుతుంది..



న్యూఢిల్లీ : ఏప్రిల్ ఒకటి నుంచి బేస్ రేటును ఎంసిఎల్ఆర్‌ను అనుసంధానం చేయాల్సిందిగా బ్యాంకులను ఆర్‌బిఐ ఆదేశించడంతో 2016 కంటే ముందు గృహనిర్మాణ రుణాలు తీసుకున్నవారిపై వడ్డీ భారం తగ్గే అవకాశం ఉంది. ఆర్‌బిఐ 2016 ఏప్రిల్ ఒకటి నుంచి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్స్ (ఎంసిఎల్ఆర్) విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతకుముందు బ్యాంకుల రుణాలపై వడ్డీ రేట్లను బేస్ రేట్ ఆధారంగా ఏకపక్షంగా నిర్ణయించేవి. ఎంసిఎల్ఆర్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ అత్యధిక శాతం బ్యాంకుల్లో అత్యధిక శాతం రుణఖాతాలకు బేస్ రేట్ ఆధారిత వడ్డీ రేట్లనే వర్తింపజేస్తున్నారు. దీనివల్ల ఆర్‌బిఐ పాలసీలకు అనుగుణంగా వడ్డీరేట్లు తగ్గినప్పుడు ఆ లాభం గృహరుణాలు తీసుకున్నవారికి అందడం లేదు. ఈ విషయంలో ఆర్‌బిఐ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేసినా బ్యాంకులు పెద్దగా పట్టించుకోలేదు. పెద్ద నోట్ల రద్దు తర్వాత బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టినా గతంలో హౌజింగ్ రుణాలు తీసుకున్నవారికి మాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో బుధవారం నాడు జరిగిన ద్రవ్యపరపతి విధాన సమీక్ష సందర్భంగా, వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి బేస్‌రేట్‌ను ఎంసిఎల్ఆర్‌ను లింక్ చేయాలని ఆర్‌బిఐ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అంటే ఎంసిఎల్ఆర్ ఆధారంగా బేస్‌రేట్‌ను బ్యాంకులు ఎప్పటికప్పుడు సవరించాల్సి ఉంటుంది. ఆర్‌బిఐ పాలసీ రేట్లకు అనుగుణంగా ఎంసిఎల్ఆర్ మారుతుంటుంది. దీనివల్ల పాలసీ రేట్లలో మార్పు వచ్చిన ప్రతిసారి దాని ప్రభావం వినియోగదారులకు కూడా చేరుతుంది.

బ్యాంకులు డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేట్లు, ఆర్‌బిఐ నుంచి, మార్కెట్ నుంచి రుణాలుగా సమీకరించే మొత్తాలపై చెల్లించే వడ్డీరేట్లు....వీటి ఆధారంగా బేస్ రేటును నిర్ణయిస్తాయి. బేస్ రేటు విషయంలో ఏ బ్యాంకు లెక్కలు ఆ బ్యాంకుకు ఉన్నాయి. బేస్ రేటు కంటే తక్కువ రేటుకు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వీల్లేదు. బ్యాంకులు అస్మదీయులకు ఒక రేటు తస్మదీయులకు ఒక రేటు చొప్పున చిత్తంవచ్చినట్టుగా రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయిస్తుండటంతో పారదర్శకత కోసం బేస్ రేట్ ఆధారంగా రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించాలని ఆర్‌బిఐ ఆదేశించింది. బేస్‌రేటు విషయంలో ఒకో బ్యాంకు ఒకో పద్ధతి అనుసరిస్తుండటంతో ఏకీకృతవిధానం, పారదర్శకత కోసం ఆర్‌బిఐ ఎంసిఎల్ఆర్‌ను ప్రతిపాదించింది. ఈ విధానంలో బ్యాంకు కొత్తగా సమీకరించే రుణాలపై చెల్లించే వడ్డీరేట్లను ముఖ్యంగా రెపో రేటను కూడా పరిగణనలోకి తీసుకొని వివిధ కాలపరిమితులకు సంబంధించి బ్యాంకుపై పడుతున్న నిధుల సమీకరణ భారాన్ని లెక్కిస్తారు. ఈ పద్ధతిలో రెపో రేటు తగ్గినప్పుడు ఎంసిఎల్ఆర్ కూడా వెంటనే తగ్గుతుంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34413.16	10576.85	30005	37670	64.26	66.84
▲ 330.45	▲ 100.15	▼ 380	▼ 765	▲	▼

ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

గ్రాన్యూల్స్ లాభం రూ.35 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : గ్రాన్యూల్స్ ఇండియా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ 411 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ రాబడులపై 35 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే నికర లాభంలో 8.5 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ తెలిపింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 413 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 34 కోట్ల రూపాయల నికర లాభాన్ని సాధించినట్లు పేర్కొంది. కాగా 1 రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 25 పైసల మధ్యంతర డివిడెండ్‌ను గ్రాన్యూల్స్ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ డివిడెండ్‌ను ప్రకటించటం ఇది మూడో సారి. వ్యాపారపరంగా నిలకడగా వృద్ధిని సాధించటమే కాకుండా తృతీయ త్రైమాసిక రాబడుల్లో 14 శాతం వృద్ధిని సాధించినట్లు గ్రాన్యూల్స్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణప్రసాద్ చిగురుపాటి తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవటంతోపాటు కొత్త వ్యాపారాలను ప్రారంభించటంతో రానున్న రోజుల్లో నిలకడగా వృద్ధిని సాధించే అవకాశాలున్నాయని అన్నారు. గురువారం బిఎస్ఇలో కంపెనీ షేరు 0.55 శాతం నష్టంతో 118.55 రూపాయల వద్ద స్థిరపడింది.

నష్టాల్లో ఆంధ్రాబ్యాంక్

క్యూ3లో రూ.532 కోట్ల లాస్

దెబ్బతీసిన కేటాయింపులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రాబ్యాంక్ డిసెంబరు 2017తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 532 కోట్ల రూపాయల నికర నష్టాన్ని ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఆంధ్రాబ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 4,000 కోట్ల రూపాయలుంటుంది. స్మాల్ క్యాప్ షేర్ల విభాగంలోకి వచ్చే ఈ సంస్థ గత మూడు త్రైమాసికాలుగా నిరుత్సాహకరమైన ఫలితాలనే ప్రకటిస్తోంది. 2017 ఏప్రిల్-డిసెంబరు మధ్య 9 నెలల కాలంలో సంస్థ నికరనష్టం మొత్తం 877 కోట్ల రూపాయలుంది. సెప్టెంబరు-డిసెంబరు త్రైమాసికంలో సంస్థ రుణాల రాబట్టే వడ్డీ రాబడి అంతకుముందు ఏడాది ఇదే కాలం కంటే 3 శాతం అధికంగా 4549 కోట్ల రూపాయలుంది. వడ్డీయేతర రాబడి మాత్రం 10 శాతం తగ్గుముఖంతో 544 కోట్ల రూపాయలకు చేరింది.

వాస్తవానికి ఈ త్రైమాసికంలో సంస్థ వ్యయాలను గణనీయంగా తగ్గించుకుంది. వడ్డీల వ్యయం 10 శాతం తగ్గుముఖం పట్టి 3,191 కోట్ల రూపాయల నుంచి 2,877 కోట్ల రూపాయలకు చేరింది. దీంతో నికర వడ్డీ ఆదాయం అంతకుముందు ఏడాది (1,218 కోట్ల రూపాయలు) కంటే 37 శాతం అధికంగా 1,672 కోట్ల రూపాయలుంది. అయితే పెరిగిపోతున్న మొండిపద్దుల భారం దృష్ట్యా ప్రొవిజన్స్ అండ్ కాంటిన్జెన్సీస్ కింద 1,862 కోట్ల రూపాయలు కేటాయించాల్సి రావడం బ్యాంక్‌ను నష్టాల్లోకి నెట్టింది. ఈ పద్దులో గతేడాది ఇదే కాలం (853 కోట్ల రూపాయలు) కంటే 118 శాతం ఎక్కువగా కేటాయింపులు జరపాల్సి వచ్చింది. బ్యాంక్ స్థూల మొండి పద్దుల (ఎన్‌పిఎ) మొత్తం డిసెంబరు త్రైమాసికంలో 19839 కోట్ల రూపాయల నుంచి 21,599 కోట్ల రూపాయలకు చేరింది. నికర మొండిపద్దుల మొత్తం (7.55 శాతం) 10,858 కోట్ల రూపాయలుంది.



భెల్ లాభంలో 64 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రభుత్వ రంగ సంస్థ బిహెచ్ఇఎల్ నికర లాభం 64 శాతం వృద్ధి చెంది 153.19 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 93.54 కోట్ల రూపాయలుగా ఉంది. సమీక్షా కాలంలో సంస్థ మొత్తం రాబడులు కూడా 6,187.48 కోట్ల రూపాయల నుంచి 6,494.44 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2 రూపాయలు ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 40 శాతం (0.80 రూపాయలు) మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ఈ నెల 28 నుంచి ఈ మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు భెల్ తెలిపింది. వ్యూహాత్మకంగా వ్యయాలను తగ్గించుకోవటంతో పాటు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయటంపై దృష్టి పెట్టడంతో మెరుగైన ఫలితాలను రాబట్టుకోగలిగినట్లు భెల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ సోబ్తి తెలిపారు. గురువారం బిఎస్ఇలో కంపెనీ షేరు 1.60 శాతం లాభంతో 95.45 రూపాయల వద్ద క్లోజైంది.

ఏడు రోజుల అనంతరం ఊరట

సెన్సెక్స్ 330 పాయింట్ల రికవరీ



ముంబై : ఏడు రోజుల వరుస పతనాలకు మార్కెట్ ఎట్టకేలకు తెరదించింది. ప్రోత్సాహకరంగా ఉన్న కార్పొరేట్ ఫలితాలు, ఆసియా మార్కెట్లలో ఆశావహ వాతావరణం అందించిన మద్దతుతో సుదీర్ఘ విరామం అనంతరం ఇండెక్స్‌లు మంచి రికవరీ సాధించాయి. సెన్సెక్స్ 330 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్ల మేరకు లాభపడ్డాయి. రెండు వారాల వ్యవధిలో సెన్సెక్స్ నమోదు చేసిన గరిష్ఠ వృద్ధి ఇదే. ఇంతకు ముందు వరుసగా ఏడు సెషన్లలో సెన్సెక్స్ 2200.54 పాయింట్లు నష్టపోయింది. సర్వత్రా ఆశావహ దృక్పథం కారణంగా జనవరిలో వెనుక చూపనేదే లేకుండా ఆర్జించిన లాభాలన్నీ ఊడిచిపెట్టుకుపోయి ఏడు రోజుల్లోనే రెండు లక్షల కోట్ల రూపాయల మేరకు ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. మార్కెట్‌లో ఏర్పడిన ఈ హేతుబద్ధమైన కరెక్షన్ విలువ ఆధారిత కొనుగోలు అవకాశాలు మలచుకున్న ఇన్వెస్టర్లు ఫార్మా, ఐటీ రంగాల షేర్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. మరోవైపు క్రూడాయిల్ ధర పతనం, ఆర్థిక వృద్ధిపై పెరిగిన ఆశలు కూడా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ఆరు వారాల కనిష్ఠ స్థాయి 65.16 డాలర్లకు దిగజారింది. మొత్తం మీద ఆశావహమైన వాతావరణంలో 330 పాయింట్ల లాభంతో 3,4413.16 పాయింట్ల వద్ద క్లోజయింది. నిఫ్టీ 100.15 పాయింట్లు లాభపడి 10,576.85 పాయింట్ల వద్ద ముగిసింది.

● సన్‌ఫార్మా గరిష్ఠంగా 6.32 శాతం లాభంతో సెన్సెక్స్ షేర్లలో అగ్రగామిగా నిలవగా డాక్టర్ రెడ్డీస్, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్, హెచ్‌యుఎల్, ఎల్ అండ్ టి, రిలయన్స్, మహీంద్రా, కోల్ ఇండియా, బజాజ్ ఆటో లాభపడిన షేర్లలో ఉన్నాయి.

● మూడో త్రైమాసికంలో ప్రోత్సాహక ఫలితాలు ప్రకటించడంతో సిప్లా షేరు 7.83 శాతం, భారత్ ఫోర్జ్ షేరు 8 శాతం లాభపడ్డాయి.

● పవర్‌గ్రిడ్, ఎన్‌టిపిసి, టాటా మోటార్స్, ఓఎన్‌జిసి, అదానీ పోర్ట్స్, ఐటిసి, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌లు కూడా లాభాల్లో క్లోజయ్యాయి.

● స్టాక్ మార్కెట్ల గణాంకాల ప్రకారం బుధవారం దేశీయ సంస్థలు 461.19 కోట్ల రూపాయల విలువ గల షేర్లు కొనుగోలు చేయగా ఎఫ్‌పిఐలు 1,022.50 కోట్ల రూపాయల విలువ గల అమ్మకాలు సాగించాయి.

గెలాక్సీ సర్ఫెక్టెంట్స్ అదిరింది...

గురువారం లిస్టింగ్ అయిన గెలాక్సీ సర్ఫెక్టెంట్స్ షేరు తొలి రోజే 15 శాతం మేరకు లాభపడింది. ఇష్యూ ధర 1,480 రూపాయలు కాగా 15 శాతం లాభంతో 1,520 రూపాయల వద్ద లిస్టింగ్ అయింది. ఇంట్రాడేలో ఈ షేరు 17 శాతం వరకు కూడా లాభపడి చివరికి 14.73 శాతం లాభంతో 1,698.10 రూపాయల వద్ద బిఎస్ఇలో క్లోజయింది. ఎన్ఎస్ఇలో 14.89 శాతం లాభంతో 1,700.45 రూపాయల వద్ద ముగిసింది. జనవరి 29-31 తేదీల మధ్య మార్కెట్‌లో ఉన్న ఈ ఇష్యూ 20 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది.



కార్పొరేట్ ఫలితాలు సానుకూలంగా ఉండడం, ఆసియా మార్కెట్లపై ఏర్పడిన ఆశావహ దృక్పథం, వడ్డీ రేట్ల విషయంలో ఆర్‌బిఐ తటస్థ వైఖరి మార్కెట్లు నిలదొక్కుకోవడానికి దోహదపడిన అంశాలు. అయితే ఇన్వెస్టర్లు ఇప్పటికీ అంతర్జాతీయ అస్థిరతలపై దృష్టి కేంద్రీకరిస్తారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా రేట్ల ప్రకటన వెలువడనున్న కారణంగా యూరోపియన్ మార్కెట్లలో ముందస్తు ఆటుపోట్లు ఏర్పడుతున్నాయి.


- ఆనంద్ జేమ్స్, చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

బులియన్




బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,920	---	30,900	---	30,010
క్రితం ముగింపు	31,240	31,000	31,280	30,900	30,330
22 క్యారెట్లు	28,630	---	28,420	---	28,580
క్రితం ముగింపు	28,920	28,800	28,800	28,610	28,890
వెండి (కిలో)	38,700	---	38,800	---	40,700
క్రితం ముగింపు	39,500	40,000	39,400	39,700	41,500

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	66.00	విజయవాడ	71.00
కరీంనగర్	68.00	గుంటూరు	71.00
వరంగల్	68.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	66.00	చిత్తూరు	65.00
కర్నూలు	66.00	నెల్లూరు	73.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	70.00
గోదావరి	70.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	345.00	చిత్తూరు	373.00
వరంగల్	347.00	చెన్నై	380.00
విజయవాడ	335.00	నమక్కల్	365.00
గోదావరి	335.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	340.00	ముంబై	390.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.54	67.88
పౌండ్	81.34	94.35
యూరో	71.90	83.39
ఆస్ట్రేలియా డాలర్	45.80	53.00
బ్రెహెయిన్ దినార్	158.55	181.69
కువైట్ దినార్	177.39	220.83
ఒమని రియాల్	155.26	177.63
సౌదీ రియాల్	15.56	18.45
సింగపూర్ డాలర్	44.13	52.28
యుఎఇ దిరమ్	15.93	18.63

10600 పైన మరింత అప్‌ట్రెండ్

టెక్ వ్యూ

నిఫ్టీ మంచి రికవరీలో ప్రారంభమై కీలక స్థాయి 10600 పాయింట్ల వరకు వెళ్లినా ద్వితీయార్థంలో ఆ స్థాయిలో నిలదొక్కుకోలేక చివరికి ఈ స్థాయి కన్నా స్వల్పంగా దిగువన క్లోజయింది. కొద్ది రోజులుగా మైనర్ రికవరీ సాధిస్తూ ఆటుపోట్ల ధోరణి సద్దుబాటు చేసుకుంటోంది. ఇప్పటికీ కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ఉన్న ఇండెక్స్ మరింత కన్సాలిడేట్ కావలసి ఉంది. ఇండెక్స్ ఇప్పటికీ 20 డిఎంఏ దిగువన ఉంది. 50 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10600 **మద్దతు** : 10500

నిఫ్టీ మరింత రికవరీ బాట పడితే మైనర్ నిరోధ స్థాయి 10600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10700. వీక్లీ చార్టుల పాటర్న్‌కు శుక్రవారంనాటి ముగింపు అత్యంత కీలకం. ఇదే మార్కెట్‌కు స్వల్పకాలిక దిశను నిర్దేశిస్తుంది.

● మరింత బలహీనత ప్రదర్శించి ప్రధాన మద్దతు స్థాయి 10500 కన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక బలహీనత కొనసాగుతుంది.

● బ్యాంక్ నిఫ్టీ కూడా మైనర్ రికవరీ సాధించి మానసిక అవధి 26000 కన్నా స్వల్పంగా దిగువన క్లోజయింది.

■ వి.సుందర్ రాజా

సాధారణ నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ దశమి **నక్షత్రం :** అనూరాధ

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10576.85 (+100.15)

ట్రెండ్ మార్పు వేళలు : 10.12

ధోరణి : గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై చెప్పుకోదగ్గ కదలికలేవీ లేకుండా రోజంతా నిస్తేజ ధోరణిలోనే ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10615, 10650

మద్దతు స్థాయిలు : 10535, 10500

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 5.65(5.94)411
AGRO TECH FO 644.4(634.55)731
AISHWARYA TE 7.41(7.78)18731
ALPHAGEO (I) 861.35(881.2)6267
ALU FLUORIDE 121.2(117.9)10625
AMAR RAJA BA 810.2(790.45)19074
ANDHRA BANK 47.2(46.35)327501
ANDHRA CEMEN 12.02(11.58)33236
ANDHRA PETRO 68(65.75)138120
ANJANI PORTL 209.75(209.9)2653
ASTRA MICRO 106.65(105.1)47016
AUROB.PHARMA 601.9(616.75)346663
AVANTEL LTD 568.7(517)14623
AVANTI FEEDS 2523.2(2423.55)29080
B.N.RATHI SE 40.8(39.95)3570
BALAJI AMINE 637.95(616.25)14714
BAMBINO AGRO 244(244.9)1084
BARTRONICSIN 13.5(13.23)5172
BHAGIRA.CHEM 293.3(283.5)1004
BHAGYA INL 43.2(40.1)12839
BHARATFIN 1011.7(1004.6)13266
BNR UDYOG 34.45(34.35)1739
CAMBRIDGE 80.05(78.5)3114
CCHHL 15.5(15.05)13168
CCL PRODUCTS 298.55(297.1)6625
CELESTIAL 17.25(16.3)18717
CIL SECURITS 33.35(30.7)190
COROM INTER 545.85(542.75)10253
CUBEX TUBING 24.55(23.6)7230
CYBERMATE 3.43(3.16)50580
CYIENT 624(605.55)29063
DANLAW TECH. 80.05(77.3)2718
DECAN CEMENT 581.5(546.9)2269
DHAN ROTO SP 38.75(37)3650
DIAMONPOWER 17.35(16.9)61719
DIVI'S LAB. 1028.6(1011.8)294887
DIVYA.GRANIT 108(107.3)636
DQ ENT 16.3(16.4)13475
DR.REDDY'S 2178.95(2111.7)56913
EMPEE SUGARS 4.51(4.3)1142
EVEREST ORG. 138.45(135.3)1454
FACOR ALLOYS 3.49(3.33)132311
FIRSTOBJ 15.2(15.3)4176
GATI LTD. 117.05(119.8)266775
GAYATRI BIO 9(9)1200
GAYATRI PROJ 202.7(195.2)448494
GENNEX LAB 4.95(4.34)309202
GMR INFRASTR 19.35(19.1)3151806
GODAVARI DRU 34.5(34.9)1150
GOLDST INFRA 198.7(189.4)29045
GOLDSTONE EN 14.55(13.9)5081
GRANULES (I) 118.55(119.2)287257
GVK POWERINF 19.65(18.75)1907193
HBL P SYS 59.25(55.85)163980
HERITGFOOD 696.8(717)4456
HIND.FLUROCA 14.5(14.5)1690
I.C.S.A. IND 4.18(4.12)16415
IKF TECHNO .99(1.04)126734
INCAP LTD. 104.55(99.6)1303
IPAPPM 325.1(309.35)22415
IVRCL LTD 5.06(4.91)164433
KAKATIYA CEM 314.85(306)12275
KALLAM SPG. 23.95(23)33041
KAVERI SEED 473.5(470.85)84448
KCP LTD 138.5(132.45)49626
KERNEX MICRO 43.55(44.8)45138
KNR CONST 306.65(306.95)10315
KREBS BIOCHM 136(137)100
LANCO INFRA 1.38(1.41)2789818
LOKESH MACH 64.55(61.45)31900
LOTUS CHOC 50.8(49.85)22726
MADHUCON PRJ 30.05(28.6)68660
MOLD-TEK TEC 64(62.65)2769
MOSCHIP SEMI 34.1(35.45)160702
MSR INDIA 39.5(37.9)8882
N C L IND. 256.95(244.05)22032
NACLIND 47.75(45.5)50011
NATCO PHARM 826.75(831.45)44833
NCC 113.7(110.45)410917
NEHA INTER. 8.37(7.61)26876
NETTLINX LTD 84(83.45)21259
NEULAND LAB. 701.65(697.65)2031
NIHAR INFO 13.25(13.2)2895
NILE LTD. 880.2(849.8)2610
NTL 4.12(4.1)6201
OIL COUNTRY 46.45(45.6)9781
PADMALAYA TE 4.98(4.89)12842
PALRED 96.2(93.7)3670
PANYAM CEMEN 55.25(52.7)21655
PENNAR STEEL 59.55(59.4)107889
PFL INFOTECH 9.57(9.12)41
PHYTOCHEM I. 70.65(64.3)7361
PITTI LAMIN. 85.4(79.25)22918
POKARNA LTD 212.3(201.8)6410
PRAJAY ENGS. 14.8(14.15)43852
PREMIER EXPL 411.45(415.45)1105
PRISM CEMENT 133.7(121.9)160983
RAIN 383.4(362.2)923923
RAJ PACKAGIN 38.5(38.15)3576
RAJVIR IND 45.5(45.6)65
REG.CERAMIC 5.72(5.95)25
RESTILE CER. 7.81(8)2270
SAGAR CEM. 981.15(901.1)5404
SAMKRG PIST. 310.7(297.05)6848
SAMPRE NUTRI 58.9(62)13659
SANGHI IND. 122.7(117.35)29640
SATVAH.ISPAT 25.3(23.55)11567
SAVEN TECHNO 20.4(20.7)1331
SMPL 1.45(1.4)54500
SMS PHARMACE 95.75(91.1)11245
SREE RAYALA 193.9(183.6)2420
STEEL EXCH 31.55(30.05)11336
SUJANA INDUS .97(.97)42260
SURANATP 5.52(5.5)16200
SURYACHAKRA 1.4(1.43)95150
SURYAMBA SP 72.2(66.1)1572
SURYAVA SPIN 8.13(8.55)1690
SURYLAK.COTT 85.35(81.15)1460
SUVEN LIFE S 197.85(192)72445
TAJ GVK HOTL 174.6(172.55)9854
TANLA 32.65(31.35)82331
TRANSCORP IN 37.95(39.25)7738
TRANSGENE BI 2.24(2.17)13926
TRANSPORT CO 274.15(266.4)4589
USHER AGRO 7.68(7.75)5739
VICEROY HOTE 16.15(15.95)111879
VIJAY TEXTIL 53.55(51)3039
VIMTA LABS 194.75(190.55)9910
VIRAT CRANE 44.45(44.9)1303
VIRINCHI 124.9(116.2)95140
VISAKA IND. 680.9(655.7)10629
VISTA PHARMA 40.05(40.25)10751
VIVIMED LABS 86.4(83.95)208703
VST INDUS. 3210(3199.95)21
WATERBASE 382.75(354.05)515408
XLENERGY 3.11(3.27)5165
YBRANTDIGI 6.03(5.75)1240577
ZEN TECH 117.85(118.4)34889
ZENOTECH 45(44.2)14921

ఎన్ఎస్ఇ-500 (NSE)
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 612.55(608)12386
AARTIIND 1137.35(1125.65)27145
ABAN 188.85(188.25)1259854
ABB 1594.85(1578.5)104852
ABFRL 154.05(152)823122
ABGSHIP 11.4(11.5)5132
ACC 1693.25(1587.4)1516076
ADANIENT 204.5(196.75)4439467
ADANIPORTS 405.1(407)2952821
ADANIPOWER 32.8(32)9392734
ADANITRANS 197.55(193.35)819438
AEGISCHEM 266.7(265.65)110313
AHLUCONT 341.6(344.05)11321
AIAENG 1440.7(1444.95)77629
AJANTPHARM 1397.8(1331.85)245114
AKZOINDIA 1779.65(1753.35)2659
ALBK 59.3(57.95)2215481
ALLCARGO 192.5(187.8)253485
ALOKTEXT 3.7(3.6)2786880
AMARAJABAT 809.65(789.75)508036
AMBUJACEM 261.9(248.3)4063203
AMTEKAUTO 24.85(24.15)398704
ANANTRAJ 59.75(57.2)1650650
ANDHRABANK 47.25(46.2)4310902
APARINDS 751.3(741.1)20499
APLLTD 541.75(535.2)401775
APOLLOHOSP 1131.8(1132.7)355444
APOLLOTYRE 269.75(261.1)5327898
ARVIND 402.9(384.7)2018757
ASHIANA 182.55(181.15)111323
ASHOKA 238.35(225.45)209808
ASHOKLEY 134.15(132.9)24389428
ASIANPAINT 1124.05(1121.1)1185917
ASTRAL 794.95(771.3)17292
ASTRAZEN 1038(1033)7257
ATUL 2724.75(2716.3)36609
AUROPHARMA 601.85(616.1)4415403
AVANTIFEED 2515(2430.85)132018
AXISBANK 568.45(559.35)5816886
BAJAJ-AUTO 3157.95(3135.55)202895
BAJAJCORP 481.05(475.4)11032
BAJAJELEC 510.15(489.3)1541350
BAJAJFINSV 5057.25(5012.05)154586
BAJAJHIND 13.65(13.55)1789883
BAJAJHLDNG 2709.75(2691.8)13977
BALKRISIND 1131.25(1105.5)318785
BALLARPUR 15.25(14.65)1550535
BALMLAWRIE 236.05(230.5)104216
BALRAMCHIN 119.9(113.6)7380139
BANKBARODA 156.2(153.95)6839457
BANKINDIA 142.35(141)3860590
BASF 2080.9(2003.25)23524
BATAINDIA 710.55(697.05)788118
BBTC 1331.95(1300.85)103188
BEML 1246(1212.9)442709
BERGEPAINT 250.8(247.35)836582
BFUTILITIE 438.9(428.95)470396
BGRENERGY 123.4(120.75)115071
BHARATFIN 1011.85(1004.95)374110
BHARATFORG 761.2(706.3)3709081
BHARTIARTL 429.8(430.25)5563903
BHEL 95.15(94.25)22688194
BHUSANSTL 52.25(53.35)9649358
BIOCON 614.9(590.6)3077890
BIRLACORPN 1009.95(1027.25)48374
BLISSGVS 203.55(202.7)333009
BLUEDART 4566.05(4554.1)2700
BLUESTARCO 725(727.05)27353
BOMDYEING 242.25(235.8)4942563
BOSCHLTD 19592.25(19244.75)19788
BPCL 478.2(476.25)6038834
BRFL 63.8(60.8)14179
BRIGADE 300(287.75)305327
BRITANNIA 4628(4550.45)99666
CADILAHC 405.2(396.35)3105912
CANBK 323.15(314.35)3660958
CAPF 689.85(676.9)576826
CARERATING 1335.2(1329)138780
CASTEXTECH 5.2(5.1)905227
CASTROLIND 194.65(187.75)3913982
CCL 298.65(300.15)222406
CEATLTD 1524.7(1519.7)883558
CENTRALBK 67(67)401504
CENTURYPLY 326.6(335.75)284140
CENTURYTEX 1268.5(1224.55)562983
CERA 3333.25(3262.35)3222
CESC 992.3(977.9)801200
CHAMBLFERT 156.6(157.95)936588
CHENNPETRO 372.9(369.15)1000077
CHOLAFIN 1305.3(1295.95)158996
CIPLA 612.65(569.25)8349913
CLNINDIA 624.6(593.3)68934
COALINDIA 300(297.6)3286814
COLPAL 1100.85(1099.25)160079
CONCOR 1341.35(1342.55)209186
COROMANDEL 545.75(542.45)101544
CORPBANK 35.85(35.35)276695
COX&KINGS 255.35(247.4)167642
CRISIL 1980.7(1943.75)26331
CUB 162.25(156.5)1326684
CUMMINSIND 839.6(818.45)156840
CYIENT 623.85(604.9)213039
DABUR 340.3(338.35)1463375
DALMIABHA 2795.45(2705.45)222937
DBCORP 327.4(326.95)49977
DBREALTY 53.35(50.85)607644
DCBBANK 168.45(164.8)731304
DCMSHRIRAM 545.95(541.3)133695
DEEPAKFERT 371(361.05)509332
DELTACORP 335.95(320.9)2756239
DEN 113.6(103.85)767786
DENABANK 22.75(22.75)2044527
DHANUKA 692.05(669.6)12530
DHFL 513.4(500.2)4580018
DISHTV 73.7(75)5739906
DIVISLAB 1029.9(1013.25)424810
DLF 229.35(225.25)8201053
DREDGECORP 738.1(728.75)394931
DRREDDY 2180.45(2111.4)889623
DYNAMATECH 1783.8(1831.45)2758
ECLERX 1340(1326.9)19787
EDELWEISS 259.6(248.95)2979579
EICHERMOT 28198(28010.45)68533
EIDPARRY 326.5(316.65)117264
EIHOTEL 180.05(174.8)106451
ELECTCAST 32.7(31.55)554523
ELGIEQUIP 334.55(319.75)95173
EMAMILTD 1115.7(1125.55)63514
ENGINERSIN 170.35(167.1)1070324
EROSMEDIA 199.05(190.45)809705
ESCORTS 906.8(912)1312194
ESSDEE 69(65.8)15091
ESSELPACK 276.4(265.35)24656
EVEREADY 380.95(384.45)66058
EXIDEIND 209.85(204.2)857116
FCONSUMER 64.95(64.05)4767653
FDC 281.4(254.55)1528213
FEDERALBNK 94.75(93.4)8196866
FINCABLES 676.1(646.45)33207
FINPIPE 702.35(662.85)148226
FLFL 377.7(375.15)42378
FORTIS 126.05(123.75)8170647
FSL 41.25(40.4)6465721
GAIL 461.85(460.3)3560673
GATI 117.3(120.1)1619141
GDL 218.8(218.75)61102
GEPIL 859.85(873)200034
GESHIP 389.25(387.25)21507
GET&D 415.1(387.65)225723
GILLETTE 6495.25(6438.8)4463
GLAXO 2461.65(2440)9975
GLENMARK 579.6(569.1)2067700
GLOBOFFS 34.7(34.2)13309
GMDCLTD 143.15(140.95)142363
GMRINFRA 19.35(19.1)34267301
GODFRYPHLP 859.2(848.75)48239
GODREJCP 1017.55(1011.7)391678
GODREJIND 551.25(546.45)796412
GODREJPROP 822.55(793.45)244694
GPPL 146.45(141.4)404639
GRANULES 118.45(119.15)2952768
GREAVESCOT 130.45(130.15)1029379
GREENPLY 363.1(337.1)235038
GRINDWELL 501.3(501.5)14667
GRUH 509.45(514)398011
GSFC 129.4(125.55)2965116
GSKCONS 6188.7(6281.4)5823
GSPL 207.35(202.75)553723
GUJFLUORO 780.35(756)102767
GUJGASLTD 849.9(858.05)21144
GULFOILLUB 1012.7(928.45)58041
GVKPIL 19.6(18.7)5206355
HATHWAY 38.95(37.6)3066271
HAVELLS 520.9(504.2)998079
HCC 35.1(34.1)10118125
HCL-INSYS 55.5(54.3)2408539
HCLTECH 944.35(938.55)1448268
HDFC 1811.8(1785.35)1865933
HDFCBANK 1880.95(1872.8)1292861
HDIL 52.55(51.3)9211694
HEIDELBERG 161.3(150)2566381
HEROMOTOCO 3582.2(3566.4)325607
HEXAWARE 337.35(355.55)3198445
HFCL 28.4(25.7)10907489
HIMATSEIDE 364.1(352.95)69013
HINDALCO 245.2(246)10180978
HINDCOPPER 79.65(74)3999646
HINDPETRO 399.8(396.35)6767391
HINDUNILVR 1329.55(1312.65)1146084
HINDZINC 287.3(288.9)4075914
HMT 34.7(34)1973
HMVL 240.6(245.9)10358
HONAUT 16962(16550.6)834
HOTELEELA 19.8(19.8)492279
HSIL 423.3(417.7)51632
HTMEDIA 96.6(93.7)232684
IBREALEST 212.7(201.1)12326529
IBULHSGFIN 1314.4(1274.1)1594358
ICICIBANK 333.85(332.55)10294899
ICRA 3972.45(3847.05)797
IDBI 61.6(57.7)11481495
IDEA 85.55(84.3)15343661
IDFC 53.8(52.2)5212917
IFBIND 1366.25(1303.75)14753
IFCI 23.35(22.8)10768436
IGARASHI 811.3(804.65)18676
IIFL 754.4(750.2)122164
IL&FSTRANS 76.3(74.05)182071
INDHOTEL 136.85(131.85)1712492
INDIACEM 161.35(152.8)5302898
INDIANB 340.45(330.35)864336
INDOCO 274.4(271.1)78399
INDUSINDBK 1670.85(1661.75)801569
INEOSSTYRO 962.2(931.9)8699
INFRATEL 349.2(338.55)1436457
INFY 1134.25(1109.05)4403622
INGERRAND 743(728.7)11137
INOXLEISUR 302.95(305.05)966475
INOXWIND 122.25(119.7)140303
INTELLECT 191.5(186.25)1432846
IOB 21.05(20.85)751168
IOC 385.6(404.75)7736486
IPAPPM 326.95(309.25)121272
IPCALAB 593.35(573.1)1080714
IRB 222.95(219.05)2840547
ITC 274.1(275.15)9779911
J&KBANK 70.65(69.6)186451
JAGRAN 170(162.5)92963
JAICORPLTD 159.5(153.2)2355796
JBCHEPHARM 302.8(299.55)53180
JBFIND 185.6(171.05)143626
JCHAC 2328.2(2245.6)7424
JETAIRWAYS 776.55(747)4912311
JINDALPOLY 342.75(337.8)51764
JINDALSTEL 266.3(252.65)16036869
JISLJALEQS 115(111.85)11911594
JKCEMENT 1038.15(1018.5)19820
JKIL 307.35(296.8)99268
JKLAKSHMI 419.25(406.2)99405
JKTYRE 176.7(171.65)1226436
JMFINANCIL 158(161.9)794945
JPASSOCIAT 17.75(17.75)76130457
JPINFRATEC 14.9(14.75)2988905
JPPOWER 6.45(6.35)2684526
JSWENERGY 82.6(81.9)3184488
JSWHL 1727.65(1706.1)4009
JUBILANT 970.2(1007.4)1131331
JUBLFOOD 1999.9(1999.95)857848
JUSTDIAL 455.7(432.05)6158742
JYOTHYLAB 353(354.2)50148
KALPATPOWR 462.7(449.55)194010
KANSAINER 503.25(499.95)264611
KEC 355(363.05)897613
KESORAMIND 143.2(134.9)692742
KIRLOSENG 375.05(365.45)5692
KITEX 287.45(279)75999
KOLTEPATIL 328.7(324.55)227370
KOTAKBANK 1051.75(1036.3)1839297
KPIT 221.15(211.85)6630043
KRBL 560.4(556.75)190794
KSCL 472.4(468.55)530736
KSK 13.65(14.2)1215369
KTKBANK 136.35(133.15)2920934
KWALITY 90.95(89.75)1310834
L&TFH 163.2(157.3)6601230
LAKSHVILAS 126.4(126.25)723883
LAOPALA 618.7(612.3)17241
LAXMIMACH 5724.35(5680.75)1788
LICHSGFIN 514.45(502.75)1708087
LITL 1.45(1.5)1720970
LT 1347.4(1333.75)1932082
LUPIN 812.45(806.05)2057573
M&M 752.2(747.1)3024010
M&MFIN 449.2(440.6)1461757
MAGMA 159.15(147.25)169240
MAHINDCIE 215.7(213.1)304323
MAHLIFE 468.25(463.05)52289
MANAPPURAM 108.6(104.3)4809990
MANPASAND 406.2(387.65)150140
MARICO 300.1(300.35)1187715
MARKSANS 39.5(37.8)3048309
MARUTI 9030.7(8921.8)465683
MAYURUNIQ 499.4(489.7)13039
MCDOWELL-N 3154.5(3127.15)258332
MCLEODRUSS 172.1(168.8)338044
MERCK 1477(1433.3)11124
MHRIL 304.95(301.15)71342
MINDACORP 195.7(196.05)142838
MINDTREE 733.3(717.45)1430828
MMTC 55.95(53.65)1901636
MOIL 234.6(229.35)494904
MONSANTO 2500(2485.25)18547
MOTHERSUMI 364(355)2672494
MOTILALOFS 1157.7(1152.45)105901
MPHASIS 872.05(833.45)337605
MRF 70171.05(68827.45)12304
MRPL 118.05(115.15)1222177
MTNL 22.85(22.45)1759808
MUTHOOTFIN 430.7(402.95)1750814
NATCOPHARM 829.6(828.6)396188
NATIONALUM 71.65(70.75)3659509
NAUKRI 1240(1172.85)473758
NAVKARCORP 171.35(172.2)383795
NCC 113.9(110.3)5699172
NETWORK18 50.8(49.6)927512
NHPC 28.7(28.5)4548550
NIITTECH 827.85(838.05)960541
NITINFIRE 6(5.75)44074
NLCINDIA 102.6(100.2)509044
NMDC 133.7(129.95)2968350
NTPC 163.7(165.45)6238973
OBEROIRLTY 476.15(471.15)223401
OFSS 4092.8(4096.8)83924
OIL 362.1(356.05)587556
OMAXE 229.1(229)520143
ONGC 188.7(190)4540513
ORIENTBANK 110.05(108)2407398
ORIENTCEM 156.75(152.05)80716
ORISSAMINE 1772.5(1724.45)4651
PAGEIND 20702.75(19350.2)40622
PARSVNATH 21.55(20.8)209753
PCJEWELLER 382.15(380.1)10686740
PEL 2705.8(2650.7)180086
PERSISTENT 794.1(758.85)409554
PETRONET 248.9(246.15)1691407
PFC 110.15(109.4)3906768
PFIZER 2267.95(2272.85)32773
PFS 33.55(33.2)823582
PGHH 9273.65(9088.85)6789
PHOENIXLTD 619.9(615.65)52549
PIDILITIND 884.9(865.15)836120
PIIND 823.05(823.8)53217
PNB 159.35(156.55)16358889
POLARIS 463.55(452)320428
POWERGRID 193.2(195.5)18864371
PRAJIND 97.35(94.8)1279025
PRESTIGE 295.7(290.2)991569
PRISMCEM 133.45(121.85)979927
PTC 96.3(94.1)973919
PUNJLLOYD 21.65(20.8)1705735
PURVA 156.6(142.2)1079821
PVR 1414.15(1380.1)206669
RADICO 338.5(331.9)1413582
RAIN 383.7(362.05)5386798
RAJESHEXPO 810.75(815.9)380283
RALLIS 233(224.3)529827
RAMCOCEM 725.15(730.45)240384
RAMCOSYS 460.8(459.15)49153
RATNAMANI 984.8(944.5)7618
RAYMOND 966.25(919.15)760370
RCF 86.75(83.15)3436870
RCOM 26.55(25.15)110606868
RECLTD 150.55(149.05)4192965
REDINGTON 143.9(139.9)206082
RELAXO 608.75(602.1)47285
RELCAPITAL 470.15(441.6)5596502
RELIANCE 904.55(894.4)6320734
RELINFRA 444.2(431.1)2852391
RENUKA 15.3(15)2422340
REPCOHOME 590.55(594.55)411558
RIIL 479.2(460.15)768657
RKFORGE 795.9(765.7)18125
RNAVAL 38.25(36.75)5618273
ROLTA 66.4(63.25)1884475
RPOWER 42.2(40.8)7641508
RTNPOWER 6.4(6.3)6555091
RUCHISOYA 16.5(15.55)2098401
SADBHAV 406.25(403.2)80019
SADBHIN 137.9(133.2)56724
SAIL 86(82.85)10365411
SANOFI 4720.45(4787.2)5402
SBIN 301.4(292.8)18932796
SCHAEFFLER 5403.1(5285.85)11891
SCHNEIDER 112.2(111.3)153739
SCI 76.25(74.2)900576
SHARDACROP 395.2(391.65)15134
SHILPAMED 514.5(511.1)49545
SHK 283.25(281.45)40635
SHOPERSTOP 530.6(520.3)61005
SHREECEM 17005.05(16996.55)16094
SHRIRAMCIT 1979.6(1956.25)64376
SIEMENS 1226(1217.3)202974
SIMPLEXINF 578.15(552.65)17290
SINTEX 22.75(21.6)4821891
SITINET 20(19.95)245804
SJVN 36.5(35.8)538385
SKFINDIA 1723.65(1704.65)5214
SMLISUZU 825.7(792.05)37165
SNOWMAN 52.15(51.9)1130557
SOBHA 559.85(552.35)458164
SOMANYCERA 690.55(692.75)20069
SONATSOFTW 290.75(283.65)553865
SOUTHBANK 27.7(26.85)9616349
SPARC 432.05(407.5)375707
SREINFRA 82.2(78.05)2798440
SRF 1843.2(1776.2)540155
SRTRANSFIN 1337.6(1325.2)351971
STAR 712.05(693.15)372840
STCINDIA 156.85(151.1)59850
SUNDARMFIN 1650.75(1664.95)6746
SUNDRMFAST 524.55(514.65)99024
SUNPHARMA 584.1(549.5)13707589
SUNTV 1006.55(933.1)1927256
SUPREMEIND 1187.2(1198.2)193540
SUVEN 197.6(191.4)364173
SUZLON 13.25(13.05)29451658
SWANENERGY 195.7(205.85)312969
SYMPHONY 1702.3(1691.45)17315
SYNDIBANK 65.4(64)2919801
SYNGENE 599.55(595.15)58455
TAKE 166.45(164.1)426168
TATACHEM 708.15(680.85)1469372
TATACOFFEE 140.45(136.8)665495
TATACOMM 618.95(601.5)726417
TATAELXSI 995.9(972.85)475024
TATAGLOBAL 280.45(280.15)5863983
TATAMOTORS 374.85(377.8)12452396
TATAMTRDVR 210.9(210.65)3318482
TATAPOWER 85.05(84.7)3975580
TATASPONGE 1054.2(990.95)354115
TATASTEEL 671.45(661.8)5845590
TBZ 117.45(114.15)306722
TCS 2974.2(2955.05)1377502
TECHM 608.25(603.1)2894969
TECHNO 365(355.95)12442
TEXRAIL 93.8(92.85)1005014
THERMAX 1197.8(1175.9)38958
THOMASCOOK 238.75(235.05)174890
TIDEWATER 6693.7(6507.7)2621
TIMKEN 834.15(823.55)11927
TITAN 800.75(783.65)2219546
TNPL 419.2(426.15)62256
TORNTPHARM 1380.85(1375.75)156061
TORNTPOWER 257.5(245.75)3375631
TREEHOUSE 13.1(12.9)27619
TRIDENT 73.8(71.35)807688
TRITURBINE 126.9(128.2)773956
TTKPRESTIG 7000.15(6942.75)2730
TTML 6.6(6.3)867176
TV18BRDCST 54.7(54.05)8220535
TVSMOTOR 666.2(648.5)792373
TVSSRICHAK 3589.2(3500.7)9506
TVTODAY 456.8(467.75)101942
UBL 1059.4(1094.45)439293
UCOBANK 29.55(29.55)627129
UFLEX 380.75(394.2)673677
ULTRACEMCO 4167(4081.55)188256
UNICHEMLAB 371.7(358.9)633274
UNIONBANK 125.15(123.65)4120305
UNITECH 7.55(7.35)27618391
UPL 718.05(701.25)1603409
VAIBHAVGBL 692.8(691.7)11874
VAKRANGEE 192.1(202.2)830360
VEDL 314.45(315.7)16604938
VIDEOIND 18.1(17.25)450486
VIJAYABANK 60.15(61)1613026
VINATIORGA 871.15(854.85)11827
VIPIND 354.05(353.55)438475
VOLTAS 600.2(599.75)1511438
VRLLOG 432.6(420.2)66082
VSTIND 3196.6(3192.4)669
VTL 1315.3(1301.4)27997
WABAG 570.5(562.9)87939
WABCOINDIA 7340.05(7251.25)2759
WELCORP 165.95(157.4)2311235
WELSPUNIND 67.65(65.9)1496569
WHIRLPOOL 1455.75(1392.9)29847
WIPRO 289.8(289.35)5297067
WOCKPHARMA 791.55(768.8)1718459
WONDERLA 369.2(368.65)61800
ZEEL 584.8(581.15)1194015
ZEELEARN 43.45(42.85)260575
ZENSARTECH 940.25(928.8)11350
ZYDUSWELL 1146.9(1052.95)123372

ఆంధ్రజ్యోతి
13 krushi@andhrajyothy.com
కృషి అగ్రి బిజినెస్
నిజామాబాద్ • శుక్రవారం 9 ఫిబ్రవరి 2018

మల్చింగ్‌తో పుచ్చ సాగు

ఎకరానికి 25 టన్నుల దిగుబడి .. ఐదు లక్షల లాభం

మూస పద్ధతికి స్వస్తి పలికి ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తూ అరుదైన ఫలితాలు సాధిస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల కేంద్రానికి చెందిన గాడి తిరుపతిరెడ్డి. మల్చింగ్ పద్ధతిలో పుచ్చ సాగు చేసి 75 రోజుల్లో ఐదు లక్షలు ఆర్జించారు ఆ రైతు.



తనకున్న పదెకరాల సొంత భూమితో పాటు మరో 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని గతేడాది నవంబర్‌లో వసుధ రకం పుచ్చను రెండు దఫాలుగా విత్తారు తిరుపతిరెడ్డి. 20 ఎకరాల్లో మల్చింగ్ (పాలిథిన్ కవర్ కప్పు) పద్ధతిలో సాగుచేసి డ్రిప్ అమర్చాడు. దీనికిగాను ఒక్కో ఎకరానికి పెట్టుబడిగా విత్తనాలు, పేపర్, డ్రిప్, వేపపిండి, ఆముదం పిండి, పొటాష్, డీఏపీ, యూరియా మొత్తం రూ.70 వేలు ఖర్చయింది. మల్చింగ్ విధానంలో కూలీల ఖర్చుతోపాటు ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గింది. 75 రోజుల అనంతరం ఎకరానికి మొదటి విడతగా 15 టన్నుల పంట దిగుబడి వచ్చింది. పదెకరాలలో తొలి విడతగా 150 టన్నులు పంట దిగుబడి వచ్చింది. ప్రస్తుత మార్కెట్‌లో టన్ను రూ. ఏడు వేలు ఉండగా, పంట అమ్మగా రూ.10 లక్షలు వచ్చాయి. ఖర్చులు పోను ఐదు లక్షలు నికర లాభం ఆర్జించారు ఈ రైతు. మండల వ్యాప్తంగా ములకలపల్లి, కమలాపురం, జగన్నాథపురం, తిమ్మంపేట, రాజుపేట తదితర గ్రామాల్లో 200 ఎకరాల్లో రైతులు పుచ్చ పంట సాగు చేశారు. వారందరిలో తిరుపతిరెడ్డి ఒక్కరే మల్చింగ్ విధానంలో సాగుచేసి లాభం గడించడం విశేషం. వసుధ రకం పుచ్చ సాగుకు ఎకరానికి ఐదు ట్రక్కుల పశువుల ఎరువు, 50 కేజీల వేపపిండి, 50 కేజీల ఆముదం పిండి, 50 కేజీల పొటాష్, 50 కేజీల డీఏపీ, యూరియా 100 కేజీలు వాడాను. డ్రిప్, మల్చింగ్ విధానంతో ఎకరానికి 10 నుంచి 15 టన్నుల పంట దిగుబడి వచ్చింది. సాధారణ పద్ధతిలో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పంట మాత్రమే దిగుబడి వస్తుందన్నారు ఆ రైతు.

వైవిధ్యం



- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ములకలపల్లి

సేంద్రియ పద్ధతిలో ఖర్చు తక్కువ



సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గుతుంది. తెగుళ్లు రాలేదు. నాణ్యమైన కాయలు రావడం వల్ల మంచి ధర వచ్చింది. ఏటా ఒకే పంట కాకుండా పంట మార్పిడి పాటించడం వల్ల ప్రయోజనం వుంటుంది. డ్రిప్ కోసం ఉద్యాన శాఖ సబ్సిడీ ఇచ్చింది. విత్తనాల మీద కూడా సన్నకారు రైతులకు సబ్సిడీ ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- గాడి తిరుపతిరెడ్డి, రైతు, ములకలపల్లి

దశ మార్చే దేశీ కోళ్లు



బీటెక్ చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూడలేదు ఆ యువకులు. నాటుకోళ్లకు పెరుగుతున్న డిమాండ్ గమనించి అరుదైన నాటుకోళ్ల పెంపకం చేపట్టారు ఖమ్మం పట్టణానికి చెందిన యువకులు బసవ నవీన్‌కుమార్, శేరెడ్డి శివారెడ్డి. 20 ఎకరాల భూమిని లీజుకు తీసుకుని అరుదైన నాటుకోళ్లను పెంచుతూ లాభాలు ఆర్జించడంతో పాటు పది మందికి ఉపాధి కల్పిస్తున్న ఆ యువకులు ప్రస్థానం.

ఇద్దరు ఇంజనీర్ల వినూత్నయత్నం

విజయగాథ



ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన రుక్మాంగదరావు 20 ఎకరాల తన వ్యవసాయ భూమిలో ఏడాది క్రితం నాటు కోళ్ల ఫారం ఏర్పాటు చేశారు. వివిధ రకాలు, జాతులకు చెందిన నాటుకోళ్లను పెంచి విక్రయించేవారాయన. ఆయన గురించి తెలుసుకున్నారు ఖమ్మం పట్టణానికి చెందిన బసవ నవీన్‌కుమార్, శేరెడ్డి శివారెడ్డి. ఏదైనా లాభసాటి వ్యాపారం చేయాలని ఆలోచిస్తూ రుక్మాంగదరావును కలుసుకున్నారు. నాటుకోళ్ల పెంపకం గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌ను అధ్యయనం చేశారు. వారి ఆసక్తిని గమనించిన కోళ్ల పారం యజమాని ఫారంను లీజుకిచ్చేందుకు ముందుకొచ్చారు. ఇంజనీరింగ్ చదివిన ఆ యువకులు పౌల్ట్రీ రైతులుగా మారారు. తాము చదువుకున్న విద్యతో, ఒంటబట్టించుకున్న సాంకేతికతను జోడించి పౌల్ట్రీని లాభసాటిగా తీర్చిదిద్దారు. పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిన ఆ యువకులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు

సొంతంగా ఏదైనా చేయాలని...


బీటెక్ చదివినా ఏదో వెలితి. ఊరికి, అయినవారికి దూరంగా ఎక్కడో ఉద్యోగం చేసే కంటే.. సొంతంగా వ్యాపారం చేసి.. స్థిరపడాలనే కోరిక. వ్యాపారంపై మక్కువతోనే ఈ కోళ్ల వ్యాపారంలోకి అడుగుపెట్టాం. దీని ద్వారా మరో పదిమందికి ఉపాధి కూడా అందించగలుగుతున్నాం.

- బసవ నవీన్‌కుమార్ (సెల్ 9160608085),
శేరెడ్డి శివారెడ్డి (సెల్ 9492051986)

నెలకు 70 వేల ఆదాయం

వెరైటీ నాటుకోళ్లకు పెరుగుతున్న గిరాకీని గమనించిన ఆ యువకులు ఏపీ తదితర ప్రాంతాల నుంచి కడక్‌నాథ్ కోళ్లతో పాటు చీమకోళ్లు, సవేలా, డేగ, టర్కీ, కాకినెమలి, ఇటుక తదితర జాతులకు చెందిన నాటు కోడిపుంజులు, పెట్టలను తీసుకువచ్చి పెంచుతున్నారు. వీటితో పాటు కౌజు పిట్టలను కూడా పెంచుతున్నారు. కేవలం కోళ్ల పెంపకానికి పరిమితం కాకుండా జర్సీ, గిర్ జాతులకు చెందిన ఆవులను పెంచుతూ పాలను విక్రయిస్తూ రెండు విధాలా ఆదాయం గడిస్తున్నారు. ఫారంలో నాటు మేకపోతులు, గొర్రెపోతులను కూడా పెంచుతున్నారు ఈ యువకులు. ఈ కోళ్లఫారంలో పెంచుతున్న కోళ్ల నుంచి వచ్చే గుడ్లను ఇంక్యుబేటర్ సాయంతో పొదిగించి పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. నాటుకోడి, కడక్‌నాథ్, కౌజుపిట్టల గుడ్లను మిషన్ ద్వారా పొదిగించడం విశేషం. ఈ కోళ్ల ఫారంలో కేవలం కోడిపిల్లలను మాత్రమే విక్రయిస్తున్నారు. కోళ్లను అమ్మకుండా కేవలం వాటినుంచి వచ్చే గుడ్ల ద్వారా పిల్లలను పొదిగించి.. వాటిని, కోడిగుడ్లను అమ్ముతూ లాభార్జన చేస్తున్నారు. నాటుకోళ్ల నుంచి రోజుకు 30 గుడ్లు, కడక్‌నాథ్ కోళ్లనుంచి 20 గుడ్లు వస్తుంటాయి. నెలకు నాటుకోళ్లకు 900 గుడ్లు వస్తే వాటిలో 600 గుడ్లను పొదగేసి.. పిల్లలు ఉత్పత్తి చేయిస్తారు. ఒక్కో కోడిపిల్లను రూ.50లకు విక్రయిస్తారు. అలా నెలకు సుమారు 600 పిల్లలను విక్రయిస్తే రూ.30 వేల ఆదాయం వస్తుందని, కడక్‌నాథ్ గుడ్లు కూడా రోజుకు 20 చొప్పున నెలకు 600 వస్తుంటాయి. అందులో 400 గుడ్లను పిల్లలు చేయించి.. ఒక్కో పిల్లను రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తామని నవీన్, శివారెడ్డి చెబుతున్నారు. వాటి ద్వారా నెలకు రూ.40వేల ఆదాయం వస్తుందని చెప్పారు. వాటితోపాటు కౌజుపిట్ట గుడ్లను పొదిగించి వాటిని పెంచి ఒక్కో పిట్టను రూ.50 లకు విక్రయిస్తుంటామని మొత్తంగా... అన్ని కోళ్లు.. కౌజుపిట్టల ద్వారా సుమారు రూ.70 వేల వరకు ఆదాయం ఉంటుందని వారు తెలిపారు.

వ్యవసాయం కంటే మేలు



వ్యవసాయానికి భారీగా ఖర్చు పెట్టాలి. కలిసి రాకపోతే అప్పులు మిగులుతున్నాయి. పెద్దగా పెట్టుబడులు లేని, ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువ ఉండే వ్యాపారం చేయాలనుకుని నాటుకోళ్ల వ్యాపారం మొదలుపెట్టానన్నారు ఈ ఫారం యజమాని రుక్మాంగదరావు. ఇప్పుడు యువకుల ఆసక్తిని గమనించి ఫారంను వాళ్లకు లీజుకిచ్చినట్లు వివరించారు.



- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం రూరల్

కలుపు కష్టాలకు చెల్లు

నయా మాల్



పత్తి చేలలో, కూరగాయల సాగులో కలుపు తీయడానికి కూలీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి, వారికి ఉపయోగపడే యంత్రం రూపొందించాలని ఆలోచించాడు ఓ యువకుడు. కలుపు తీయడంతో పాటు గొర్రుగా కూడా ఉపయోగించుకునే యంత్రాన్ని రూపొందించాడు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన కొడుముంజ ప్రవీణ్‌కుమార్ అనే యువకుడు రైతులకు ఉపయోగపడే కొత్త యంత్రాలు ఆవిష్కరిస్తున్నాడు. ఏడో తరగతి వరకే చదువుకున్న ప్రవీణ్... మోటర్ వైండింగ్‌లో ఏడాది పాటు శిక్షణ పొందాడు. గ్రామంలో వ్యవసాయ విద్యుత్తు మోటర్ల మరమ్మతులు చేస్తుండేవాడు. జిల్లెల్ల గ్రామంలో షాప్ ఏర్పాటుచేసుకుని వైండింగ్‌తో పాటు లేత్ మిషన్, వెల్డింగ్ పనులు చేయడం మొదలుపెట్టాడు. మొదట సైకిల్‌తో కలుపు తీసే పరికరం రూపొందించాడు. ఆ తరువాత తక్కువ శ్రమతో సునాయాసంగా కలుపుతీసే లక్ష్యంతో సుజికి ఇంజన్‌తో కలుపుతీసే యంత్రాన్ని తయారుచేశాడు. దాని ఇంజన్ స్పీడ్ ఎక్కువగా వుండటంతో అది సరిగా పని చేయలేదు. దాంతో ఈసారి స్కూటర్ ఇంజన్‌తో ప్రయోగం చేసి విజయం సాధించాడు ప్రవీణ్. ఇంజిన్‌లో రెండు లీటర్ల పెట్రోలు పోస్తే ఎకరంలో కలుపు తీస్తుంది.

ఈ యంత్రంతో కూలీల సమస్య తీరడంతో పాటు డబ్బు, సమయం కూడా ఆదా అవుతుంది. ఓ రైతు సహకారంతో 15 వేలు ఖర్చు చేసి కలుపు యంత్రాన్ని సిద్ధం చేశాడు ప్రవీణ్. ముందుగా స్టాండ్ తయారుచేసి దానికి ఇంజన్‌తో పాటు బేరింగ్‌లు, చైనులు బిగించాడు. అనంతరం స్కూటర్ లేక ఆటోకు చెందిన పాత హ్యాండిల్‌ను బిగించి గేరు, బ్రేక్ అక్కడే ఏర్పాటుచేశాడు. కేవలం కలుపు తీయడం కాకుండా బహుళ ప్రయోజనకరంగా ఈ యంత్రాన్ని తీర్చిదిద్దాడు. కలుపు తీయడంతో గొర్రుగా కూడా ఈ యంత్రాన్ని ఉపయోగించవచ్చంటాడు ప్రవీణ్.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, తంగళ్లపల్లి,

చేయూతతో అద్భుతాలు



ప్రభుత్వం, ప్రైవేట్ రంగ సంస్థలు సహకరిస్తే రైతులకు ఉపయోగపడే యంత్రాలు తయారు చేయగలననే నమ్మకం వుంది. తక్కువ ఖర్చుతో కొత్త యంత్రాలు తయారుచేసే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తున్నాను. రైతులకు ఈ రకంగా సేవచేయడం సంతోషంగా వుంది.

- కొడుముంజ ప్రవీణ్, చిన్నలింగాపూర్

సలహా

మామిడికి తేనెమంచు పురుగు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు రైతులకు వివిధ పంటల సంరక్షణకై ఈ క్రింది సూచనలు చేస్తున్నారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడి పంటకు తేనె మంచు పురుగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు ఆశించడానికి అవకాశం ఉంది. తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు నివారణకు 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ + 1 గ్రాము కార్బండజిమ్ మందును లీటరు



నీటికి కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు కనుక సోకినట్లయితే 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా ఒక మి.లీ. కారాతేన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న

పైరు మొలిచిన 10-15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైరు 25 - 30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3-4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి. మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే అవకాశముంది. నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమిటాన్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కూరగాయలు

కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్లయితే నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటలలో డైమండ్ రెక్కల పురుగు నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 మి.లీ. స్పినోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పంట కోతకు 15 రోజుల ముందుగా పిచికారీ చేయాలి.

వరిలో కాండం తొలుచు పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా నాటిన 15-20 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 10 కిలోలు వేసుకోవాలి.

సమస్య - సమాధానం

జింక్ లోపానికి చెమత్కార్‌తో చెక్



ఈ ఏడాది ప్రభుత్వం జింక్‌ను రాయితీ మీద ఇవ్వలేదు. ఫలితంగా వరి పంటకు జింక్ వేయలేక పోయాం. ప్రస్తుతం వరిలో జింక్ లోపం కనిపిస్తోంది. మొగి పురుగు కూడా ఉంది. 1010 రకం వరిలో అగ్గి తెగులు ఉంది. పరిష్కారం సూచించండి.

- ఇ. గంగాధర్, రైతు, గోవింద్‌పేట్, ఆర్మూర్ మం., నిజామాబాద్ జిల్లా



డా. ఎల్. కిషన్‌రెడ్డి, రిటైర్డ్ శాస్త్రవేత్త

జింక్ లోపం నివారణకు ఎకరానికి కిలో జిట లేదా చమత్కార్, 10 కిలోల యూరియాలో కలిపి చల్లాలి. లేదా ఫార్ములా 4 లేదా ఫార్ములా 6 లేదా న్యూటమిక్స్, లేదా స్వర్ణఫల్ ఎకరానికి 300 గ్రా. చొప్పున మూడు రోజులకోసారి మూడుసార్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొగి పురుగు నివారణకు నాటిన 15-20 రోజుల మధ్య ఫెర్ టెర్రగుళికలు ఎకరానికి నాలుగు కిలోలు వేయాలి. లేదా ఎకరానికి 60 మి.లీ కొరాజన్, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ముందు నాటిన 1010 వరిలో అగ్గి తెగులు కనిపిస్తోంది. దీని నివారణకు ఎకరానికి 250 మి.లీ పాలిక్యూర్, లేదా 120 గ్రాముల ట్రైసైక్లోజోల్, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

గృహ శోభ



క్లోరో ఫైటమ్ మొక్క

ఆకర్షణతో పాటు ఆహ్లాదాన్ని పంచే ఇండోర్ క్రోటన్స్ మొక్కలు ఇల్లు, కార్యాలయాల అందాలను పదింతలు చేస్తున్నాయి. ప్రశాంతతను కలిగించడంతో పాటు గాలిని శుద్ధి చేసే గుణాలుండటంతో ఇలాంటి మొక్కలకు ఆదరణ పెరుగుతున్నది.

వేసవిలో చల్లదనాల తివాచీ

వేసవిలో ఇల్లు చల్లగా వుండేందుకు తోడ్పడే ఈ మొక్కలకు నర్సరీల్లో భలే గిరాకే వుంది. ఇండోర్ క్రోటన్స్ మొక్కలను సంవత్సరాల తరబడి మట్టి, గాజు, పింగాణీ కుండీల్లో పెంచుకోవచ్చని, కొద్దిపాటి నీరు పోస్తే వాటంతట అవే పెరుగుతాయంటున్నారు నర్సరీ నిర్వాహకులు.

క్లోరో ఫైటమ్: క్లోరో ఫైటమ్ మొక్కలను ఇంటి ముందు చిన్న మట్టి కుండీలను వేలాడదీసి, వాటిలో కూడా పెంచుకోవచ్చు. ఈ మొక్కలను బాత్రూమ్‌లో కూడా పెంచుకుంటారు. క్లోర్‌ఫైటమ్ మొక్కలు ఆక్సిజన్ విడుదల చేస్తాయి. ఇవి తీగల రూపంలో పొదవుగా పెరుగుతాయి. రోజుకు ఒకసారి నీళ్లు పోసి, నెలలో ఒకసారి ఆకులను కత్తిరించుకుంటే సరిపోతుంది.

సాంగ్ ఆఫ్ ఇండియా: ఈ మొక్కలు నాలుగు అడుగుల ఎత్తు పెరుగుతాయి. ఇళ్లలో ఈ మొక్కలు పెంచుకుంటే కనులకు ఇంపుగా వుంటుంది. ఇంట్లో పచ్చదనాల తివాచీ పరిచినట్లు వుండే ఈ మొక్కను పర్యావరణ ప్రేమికులు అమితంగా ఆదరిస్తున్నారు.

ఫిలోడెండ్రన్: ఈ మొక్కలు రెండు అడుగుల ఎత్తు పెరుగుతాయి. ఇంటితో పాటు కార్యాలయాల్లో ఈ మొక్కలను పెంచుకుంటే ఇంటి స్వరూపమే మారిపోతుంది. నెలలో ఒకసారి వీటి ఆకులను ట్రిమ్ చేసుకుని, రోజుకు కాసిని నీళ్లు పోస్తే ఈ మొక్క నిత్యనూతనంగా వుంటుంది.

వీటితో పాటు డ్రెసినా, పెట్నోక్రోటన్, వాటర్ హోల్‌కోనియాస్, బాంబూగ్రాస్ లాంటి పలు రకాల ఇండోర్ క్రోటన్స్ మొక్కలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్ ప్రతినిధి అలఖ్య. తమ వద్ద 500 రకాల ఇండోర్ మొక్కలు అందుబాటులో వున్నాయన్నారామె.

- సిటీ బ్యూరో, హైదరాబాద్



డ్రెసినా మొక్క



ఫిలోడెండ్రన్ మొక్క



మళ్లీ వచ్చింది ఉద్యోగాల రైలు

భారతీయ రైల్వే నుంచి మరో భారీ నోటిఫికేషన్ వెలువడింది. దేశ వ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో ఖాళీగా ఉన్న అనేక రకాల పోస్టులను భర్తీ చేయడానికి సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటిస్‌ను విడుదల చేసింది. గ్రేడ్ - 4 కేటగిరీలో వేల సంఖ్యలో ట్రాక్‌మ్యాన్, హెల్పర్, పోర్టర్ ఖాళీలు ఉన్నాయి. పదో తరగతి, ఐటీఐ చదివిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ఇదే సరైన తరుణం. కొద్దిగా కష్టపడితే ఐదంకెల జీతంతో రైల్వేల్లో కెరీర్‌ను ప్రారంభించే చక్కని అవకాశం మీ సొంతం అవుతుంది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ వివరాలు చూద్దాం...

ప్రస్తుత ప్రకటన ద్వారా భారతీయ రైల్వే శాఖ దేశ వ్యాప్తంగా 16 జోన్లలోని ఖాళీలను భర్తీ చేస్తుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు సౌత్ సెంట్రల్ రైల్వే - సికింద్రాబాద్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే - భువనేశ్వర్ పరిధిలోని ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం ఖాళీలు: 62,907
- సికింద్రాబాద్ డివిజన్ ఖాళీలు: 2,801
- ఈస్ట్‌కోస్ట్ డివిజన్ ఖాళీలు: 1626

భర్తీ చేసే పోస్టులు

గ్రేడ్-4 (ట్రాక్‌మ్యాన్), గేట్‌మ్యాన్, పాయింట్స్‌మ్యాన్, హెల్పర్ (ఎలక్ట్రికల్ / ఇంజనీరింగ్ / మెకానికల్ / సిగ్నల్ / టెలి కమ్యూనికేషన్) పోర్టర్ తదితర విభాగాల్లో ఖాళీలున్నాయి. ఎంపికైన వారికి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఏడో పే కమిషన్ సిఫార్సుల మేరకు వేతనాలు చెల్లిస్తారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇతర భత్యాలు, సౌకర్యాలు ఉంటాయి.

అర్హత ఏమిటి?

అభ్యర్థులు 10వ తరగతి / నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎన్‌సీవీటీ) లేదా స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎస్‌సీవీటీ) గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఐటీఐ / తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. లేదా నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్ ప్రదానం చేసిన నేషనల్ అప్రెంటిషిప్ సర్టిఫికెట్ ఉండాలి. లేదా 10వ తరగతితోపాటు ఎన్‌సీవీటీ / ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఐటీఐ / 10వ తరగతితోపాటు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ ప్రదానం చేసిన నేషనల్ అప్రెంటిషిప్ సర్టిఫికెట్ ఉండాలి. పదో తరగతి / ఐటీఐ/ సంబంధిత కోర్సు ఇంకా చదువుతున్న విద్యార్థులు / పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

ఫిజికల్ ఫిట్‌నెస్

గ్రేడ్ - 4 ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక సమయంలో అభ్యర్థుల శారీరక ప్రమాణాలను పరీక్షిస్తారు. ఈ క్రమంలో ఎంపికైన వారికి మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశించిన విధంగా ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండాలి. లేని పక్షంలో సదరు ఉద్యోగానికి అనర్హుడిగా ప్రకటిస్తారు. కాబట్టి దరఖాస్తు సమయంలో సంబంధిత వివరాలను క్షుణ్నంగా గమనించడం మంచిది.

వయోపరిమితి

అభ్యర్థులకు జూలై 1, 2018 నాటికి వయసు 18 - 31 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో మినహాయింపులు ఉంటాయి. ఈ క్రమంలో ఎస్సీ / ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియ ఆయా పోస్టులను అనుసరించి వేర్వేరుగా ఉంటుంది. అయితే ఆయా పోస్టులకు భర్తీ కోసం నిర్వహించే అన్ని రకాల రాత పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. వీటి తరవాత పోస్టును అనుసరించి స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ దశలు ఉంటాయి.

- విభాగాల వారీగా పోస్టులు, రాత పరీక్ష విధానం, సిలబస్, ఇతర వివరాలతో కూడిన నియామక ప్రకటనను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఈనెల పదో తేదీన విడుదల చేయనుంది. ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్లలో ఈ సమాచారం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తు ప్రారంభం: ఫిబ్రవరి 10, 2018.
- దరఖాస్తు ముగింపు: మార్చి 12, 2018.
- దరఖాస్తు ఫీజు వివరాలు: రూ. 500 (ఎస్సీ / ఎస్టీ / ఎక్స్ సర్వీస్‌మెన్ / దివ్యాంగులు / మహిళలు / ట్రాన్స్‌జెండర్స్ / మైనార్టీస్ / ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ. 250).
- ఆన్‌లైన్ / ఎస్‌బీఐ చలానా ద్వారా ఫీజు చెల్లించడానికి చివరి తేదీ : మార్చి 12, 2018.
- పోస్టాఫీస్ చలానా ద్వారా ఫీజు చెల్లించడానికి చివరి తేదీ : మార్చి 10, 2018.
- వెబ్‌సైట్: http://rrbsecunderabad.nic.in/

ఏఎల్‌పీ, టెక్నీషియన్ పోస్టులు

గ్రేడ్ - 4 ప్రకటనకు ముందుగా ఇటీవలే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు అసిస్టెంట్ లోకో పైలెట్ (ఏఎల్‌పీ), టెక్నీషియన్ పోస్టులకు కూడా నియామక ప్రకటన విడుదల చేసింది. ఇందులో 26,502 పోస్టులు ఉన్నాయి. వీటికి కూడా పదో తరగతి / ఐటీఐ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం మీద 10వ తరగతి, ఐటీఐ చదివిన వారికి రైల్వేల ద్వారా దాదాపు 90 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. ఏఎల్‌పీ, టెక్నీషియన్ నియామక ప్రకటన పూర్తి వివరాలు, సిలబస్, ఎంపిక ప్రక్రియ, ప్రిపరేషన్ విధానం, తదితరాలు ఫిబ్రవరి 4 (ఆదివారం) నాటి దిక్సూచి పేజీలో లభిస్తాయి.

విద్యారంగంలో టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (లండన్ నుంచి ప్రచురితం) పత్రికకు మంచి గుర్తింపు ఉంది. ఇది ఏటా ప్రపంచవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల పనితీరును మదింపు చేసి, అవి పాటించే ప్రమాణాల ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తోంది. 2004 నుంచి ఇలా ర్యాంకులను ప్రచురిస్తోంది. ఈ జాబితాలో చోటు దక్కించుకోవడాన్ని చాలా సంస్థలు ప్రతిష్టాత్మకంగా భావిస్తాయి. చాలామంది విద్యార్థులు ఈ ర్యాకింగ్స్ ప్రాతిపదికగానే విదేశాల్లో, స్వదేశంలో యూనివర్సిటీలను ఎంచుకుంటారు. ఈ ఏడాది కూడా టైమ్స్ సంస్థ ర్యాంక్‌లను వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఈ జాబితాలో టాప్ స్థానంలో నిలిచిన సంస్థలు, భారతీయ సంస్థల పనితీరు తదితర అంశాలపై విశ్లేషణ...



వర్సిటీ ర్యాంకుల్లో మనం ఎక్కడ..?

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 6న ఈ ఏడాది వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకులను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 77 దేశాలకు చెందిన 20 వేల ఉన్నత విద్యా సంస్థల్లో 1000 యూనివర్సిటీలకు మాత్రమే ఈ జాబితాలో స్థానం లభించింది.

ఆక్స్‌ఫర్డ్ టాప్.. యూరప్ హవా

ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ టాప్ స్థానంలో ఉంది. తరవాతి స్థానాన్ని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ దక్కించుకుంది. ఈ రెండు సంస్థలు కూడా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందినవే కావడం విశేషం. మొత్తమ్మీద టాప్-200 ఇన్‌స్టిట్యూట్స్‌లో యూరప్ సంస్థల హవా కొనసాగింది. ఇందులో సగానికిపైగా యూరప్ ఖండానికే చెందిన సంస్థలు ఉండటం గమనార్హం. వీటిల్లో కూడా జర్మనీ, యూకే, నెదర్లాండ్స్ సంస్థలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇటలీ, స్పెయిన్ వర్సిటీలకు తొలిసారి ఈ జాబితాలో చోటు లభించింది.

2018 టాప్ - 10 యూనివర్సిటీలు

1. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ
2. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ
3. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
3. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ
5. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
6. హార్వర్డ్ యూనివర్సిటీ
7. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ
8. ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్
9. చికాగో యూనివర్సిటీ
10. స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - జ్యూరిచ్

ఆసియాలో చైనా హవా

ఎప్పటి మాదిరిగానే వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల్లో ఆసియా ఖండానికి సంబంధించి టాప్ విభాగంలో ఈసారి కూడా చైనా యూనివర్సిటీల హవా కొనసాగింది. టాప్ - 100 ఏషియన్ యూనివర్సిటీల్లో చైనా, హాంకాంగ్‌కు చెందిన 30 యూనివర్సిటీలకు స్థానం లభించింది. కానీ తొలి ర్యాంక్ మాత్రం సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి దక్కింది. చైనాకు చెందిన టిసింగ్వా యూనివర్సిటీ రెండో స్థానంలో ఉంది. మూడు, నాలుగు, ఐదో స్థానాలను కూడా చైనా వర్సిటీలు దక్కించుకున్నాయి. మిగతా ఆసియా దేశాల విషయానికొస్తే.. జపాన్, పాకిస్థాన్, దక్షిణకొరియా, తైవాన్, టర్కీ యూనివర్సిటీలు కూడా పనితీరు మెరుగుపరుచుకొని ఈసారి జాబితాలో జాబితాలో చోటు దక్కించుకున్నాయి. మొత్తంగా చూస్తే ఆసియా టాప్ - 350 జాబితాలో అత్యధికంగా జపాన్‌కు చెందిన 89 సంస్థలకు చోటు దక్కింది. 69 యూనివర్సిటీలతో చైనా తరవాతి స్థానంలో ఉంది.

భారత్ పరిస్థితి...

భారతీయ విద్యా సంస్థల విషయానికొస్తే.. ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న యూనివర్సిటీల సంఖ్య పెరిగింది. మొత్తమీద ఆసియా టాప్ - 350 ఇన్‌స్టిట్యూట్స్ జాబితాలో మన దేశానికి చెందిన 42 యూనివర్సిటీలకు స్థానం లభించింది. క్రితం సారి సంఖ్య 33. గతంలో 300 యూనివర్సిటీలకు మాత్రమే ర్యాంకులు ఇచ్చేవారు. ఈసారి ఈ సంఖ్యను 350కి పెంచారు. భారతీయ సంస్థల ఎంట్రీలు పెరగడానికి ఈ అంశం దోహదం చేసింది. మొత్మమీద ఆసియా టాప్ - 200లో 17 భారతీయ సంస్థలకు చోటు దక్కింది. టాప్ - 50 ఇన్‌స్టిట్యూట్‌లలో రెండు, టాప్ - 100లో మూడు భారతీయ సంస్థలకు మాత్రమే చోటు దక్కింది.

ర్యాంకులు పడిపోయాయి..

ఒక వైపు వరల్డ్ ర్యాంకింగ్స్‌లో స్థానం పొందిన భారతీయ యూనివర్సిటీల సంఖ్య పెరగటం ఆశాజనక విషయమే.

టాప్- 200లో భారతీయ సంస్థలు..

విద్యాసంస్థ	స్థానం
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్	29
ఐఐటీ - బాంబే	44
ఐఐటీ - ఖరగ్‌పూర్	60
ఐఐటీ - రూర్కీ	65
ఐఐటీ - కాన్పూర్	81
ఐఐటీ - ఢిల్లీ	86
తేజ్‌పూర్ యూనివర్సిటీ	100
ఐఐటీ - మద్రాస్	103
ఐఐటీ - గౌహతి	112
పంజాబ్ యూనివర్సిటీ	114
నిట్ - రూర్కెలా	126
జాదవ్‌పూర్ యూనివర్సిటీ	127
ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్	141
ఢిల్లీ యూనివర్సిటీ	144
అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ	158
సావిత్రిబాయ్ పులే యూనివర్సిటీ	188
ఐఐటీ - వారణాసి	194

అయితే అదే సమయంలో ర్యాంకింగ్స్ విషయంలో గతం కంటే దిగజారిపోవడం ఆందోళన కలిగించే అంశం. ఉదాహరణకు ఐఐటీ - మద్రాస్ గత ర్యాంకింగ్స్‌లో 41వ స్థానంలో ఉంటే ఈ సారి 103 స్థానానికి దిగజారింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ 27 నుంచి 29కి, ఐఐటీ - బాంబే 42 నుంచి 44కి పడిపోయాయి. ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్, ఐఐటీ - వారణాసి తొలిసారి ఈ జాబితాలో చోటు సంపాదించుకున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో...



తెలుగు రాష్ట్రాల్లోని యూనివర్సిటీలు కూడా ఆసియా టాప్ - 350 జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. అవి.. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ - తిరుపతి, ఉస్మానియా యూనివర్సిటీ - హైదరాబాద్, ఆంధ్రా యూనివర్సిటీ - విశాఖపట్నం, గీతమ్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ అనంతపురం. ఇందులో 201 - 250 శ్రేణి ర్యాంకుతో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ - తిరుపతి ఉత్తమంగా నిలిచింది. తరవాతి స్థానాల్లో ఆంధ్రా యూనివర్సిటీ - విశాఖపట్నం (251-300 ర్యాంకు), ఉస్మానియా యూనివర్సిటీ (251 - 300 ర్యాంకు), గీతమ్ యూనివర్సిటీ (301 - 350 ర్యాంకు), జేఎన్‌టీయూ అనంతపురం (301 - 350 ర్యాంకు). పనితీరు, పరిశోధనల విషయంలో భారతీయ యూనివర్సిటీలు మంచి స్కోర్ చేశాయి. టీచింగ్ విషయంలో మాత్రం వెనకబడిపోయాయి.

13 అంశాలాధారంగా..

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ 13 అంశాల ఆధారంగా ర్యాంకింగ్స్‌ను నిర్ధారిస్తుంది. అవి.. చదువుతున్న విద్యార్థుల సంఖ్య, ఆఫర్ చేస్తున్న కోర్సులు, పరిశోధనలు, టీచింగ్ స్టాఫ్ సంఖ్య, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్, అంతర్జాతీయ విద్యార్థులు, విద్యార్థులు - బోధన సిబ్బంది మొదలైనవి.

జాబ్ కార్నర్

కానిస్టేబుల్

ఖాళీలు 447

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)- తాత్కాలిక ప్రాతిపదికన కానిస్టేబుల్/ డ్రైవర్, కానిస్టేబుల్/ డ్రైవర్ కం పంప్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి పురుషుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టుల వారీ ఖాళీలు: కానిస్టేబుల్/ డ్రైవర్ 344, కానిస్టేబుల్/ డ్రైవర్ కం పంప్ ఆపరేటర్ 103
- వయసు: దరఖాస్తు నాటికి 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి / మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. హెవీ / లైట్ / గేర్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, హైట్ బార్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంటేషన్, ట్రేడ్ (డ్రైవింగ్) టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా
- రాత పరీక్ష వివరాలు: ఇది పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో జనరల్ అవేర్‌నెస్ / జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మేథమెటిక్స్, అనలిటికల్ ఆప్టిట్యూడ్, హిందీ / ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి పదోతరగతి స్థాయిలో ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. రాత పరీక్షను హిందీ, ఇంగ్లీషు భాషల్లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు 35%, రిజర్వుడు వర్గాలకు 33% మార్కులను కటాఫ్‌గా నిర్ణయించారు.



- ట్రేడ్ (డ్రైవింగ్) టెస్ట్ వివరాలు: ఇందులో లైట్ వెహికిల్, హెవీ వెహికిల్‌కు సంబంధించిన డ్రైవింగ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ఒక్కోదానికి 50 మార్కులు కేటాయించారు. వీటిలో అర్హత పొందాలంటే ప్రతి టెస్ట్‌లో 25 మార్కులు సాధించాల్సి ఉంటుంది. మోటార్ మెకానిజంలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు సంబంధించిన టెస్ట్‌కు 30 మార్కులు కేటాయించారు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 15 మార్కులు తెచ్చుకోవాలి.
- దరఖాస్తు ఫీజు: రూ.100
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 19
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సిఐఎస్ఎఫ్ చిరునామా: DIG, CISF (South Zone) HQrs, Chennai.
- వెబ్‌సైట్: https://cisfrectt.in

బోర్డర్ పోలీస్ ఫోర్స్

ఖాళీలు 134

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటిబిపిఎఫ్)- తాత్కాలిక ప్రాతిపదికన కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వయసు: దరఖాస్తు నాటికి 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పదోతరగతి లేదా మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. లైట్ / మీడియం / హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: రాతపరీక్ష, ప్రాక్టికల్ (స్కిల్) టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, హైట్ బార్ టెస్ట్, మెడికల్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా
- రాత పరీక్ష వివరాలు: పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. జనరల్ నాలెడ్జ్, మేథమెటిక్స్, హిందీ, ఇంగ్లీష్ విభాగాల్లో ఒక్కోదాని నుంచి 10 ప్రశ్నలు, ట్రేడ్ రిలేటెడ్ థియరీ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలో ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. సమాధానాలను ఒఎంఆర్ షీట్‌మీద బ్లాక్/ బ్లూ పెన్‌తో గుర్తించాలి. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు 35%, ఎస్సీ/ ఎస్టీ/ ఒబిసిలకు 33% కటాఫ్‌గా నిర్ణయించారు.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 14
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 15
- వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in

ఇండియన్ ఆయిల్

ఖాళీలు 350

ఇండియన్ ఆయిల్ మార్కెటింగ్ డివిజన్ -అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- టెక్నికల్ అప్రెంటీస్‌లు: 100
- నాన్ టెక్నికల్ ట్రేడ్ అప్రెంటీస్‌లు: 150
- టెక్నీషియన్ అప్రెంటీస్‌లు: 100
- రాష్ట్రాలవారీ ఖాళీలు: తెలంగాణ 44, ఆంధ్రప్రదేశ్ 44, కేరళ 46, కర్ణాటక 66, తమిళనాడు& పాండిచ్చేరి 150
- వయసు: జనవరి 31 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: టెక్నికల్ ట్రేడ్ అప్రెంటీస్‌కు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల ఐటిఐ (ఫిట్టర్ / ఎలక్ట్రీషియన్ / ఎలక్ట్రానిక్ మెకానిక్ / ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ / మెషినిస్ట్) పూర్తిచేసి ఉండాలి. టెక్నీషియన్ అప్రెంటీస్‌లకు 50 శాతం మార్కులతో మూడేళ్ల డిప్లొమా (మెకానికల్/ ఎలక్ట్రికల్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ / సివిల్ / ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రానిక్స్) పూర్తిచేసి ఉండాలి. నాన్ టెక్నికల్ ట్రేడ్ అప్రెంటీస్ -అకౌంటెంట్ పోస్టులకు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 19
- వెబ్‌సైట్: www.iocl.com

జూనియర్ రీసెర్చ్ ఫెలోస్

ఖాళీలు 7

గ్వాలియర్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ - జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలు: మైక్రోబయాలజీ / బయోటెక్నాలజీ/ బయోకెమిస్ట్రీ / ఫార్మకాలజీ / జువాలజీ (ఎంటమాలజీ) / కెమిస్ట్రీ (ఆర్గానిక్ / ఇన్‌ఆర్గానిక్/ అనలిటికల్ / ఫిజికల్)
- అర్హత: సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, నెట్ అర్హత ఉండాలి.
- వయసు: 28 ఏళ్లు మించరాదు
- స్టయిపెండ్: నెలకు రూ.25,000.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 4
- వెబ్‌సైట్: www.drdo.gov.in

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
15
నిజామాబాద్ • శుక్రవారం 9 ఫిబ్రవరి 2018

'జియో'లో వింటర్ ఒలింపిక్స్

ముంబయి: ప్రముఖ టీవీ యాప్ జియో టీవీ శుక్రవారంనుంచి దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో ఆరంభం కానున్న వింటర్ ఒలింపిక్స్‌ను ప్రసారం చేయనున్నది. ఇండియాలో వింటర్ ఒలింపిక్స్‌కు సంబంధించి డిజిటల్ ప్రసార హక్కులను ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ తమకు కేటాయించినట్టు జియో టీవీ గురువారం వెల్లడించింది.

రిటైర్మెంట్ యోచనలో మలింగ..!

కొలంబో: క్రికెట్ కెరీర్‌కు త్వరలో గుడ్‌బై చెప్పనున్నట్టు శ్రీలంక పేసర్ లసిత్ మలింగ చెప్పాడు. మానసికంగా అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించినట్టు తెలిపాడు. గత కొన్నేళ్లుగా గాయాలతో మలింగ కెరీర్ ఒడిదొడుకులకు గురైంది.

మళ్లీ అదే ఫలితం...

న్యూఢిల్లీ: ఫెడరేషన్ కప్‌లో రెండో రోజూ భారత్‌కు నిరాశే ఎదురైంది. గురువారం కజకిస్థాన్ చేతిలో 1-2తో పరాజయం పాలైంది. భారత క్రీడాకారిణుల్లో అంకిత రైనా సింగిల్స్ మ్యాచ్‌ను గెలుపొందగా మరో సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌ను కోల్పోయింది. దీనికి తోడు అంపైరింగ్ తప్పిదాలు భారత క్రీడాకారిణుల ఆటపై ప్రభావం చూపాయి. తొలి సింగిల్స్‌లో కర్మన్‌కౌర్ థండి 3-6, 2-6 స్కోరుతో జరినా దియాస్ చేతిలో ఓడిపోయింది. తరువాత అంకిత రైనా 6-3, 1-6, 6-4 స్కోరుతో కజక్ నంబర్‌వన్ క్రీడాకారిణి యులియా పుతిన్‌సెవాను ఓడించి టై స్కోరును 1-1గా సమం చేసింది. ఫలితాన్ని తేల్చే డబుల్స్‌లో అంకిత-ప్రార్థన మాంబ్రె జంట 0-6, 4-6తో పుతిన్‌సెవా, దియాస్ జోడీ చేతిలో ఓడిపోయింది. ఈ పరాజయంతో భారత మహిళల జట్టుకు ప్రపంచ ప్లేఆఫ్ పోటీలకు అర్హత కోల్పోయింది.

'టైమింగ్స్' మార్పులకు నో

• వ్యతిరేకిస్తున్న ఐపీఎల్ ఫ్రాంచైజీలు

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఈసారి క్రికెట్ మ్యాచ్‌ల సమయాలు మారిన విషయం తెలిసిందే. సాయంత్రం 4 గంటల మ్యాచ్‌ను 5.30 గంటలకు, రాత్రి 8 గంటల మ్యాచ్‌ని ఓ గంట ముందుగా...అంటే 7 గంటలకు మార్చాలనే ప్రతిపాదనను బీసీసీఐ, ఐపీఎల్ పాలకమండలి, బ్రాడ్‌కాస్టర్ స్టార్ టీవీ ఇదివరకే ఆమోదించాయి. అయితే లీగ్‌లోని 8 ఫ్రాంచైజీలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయని సమాచారం. రెండు మ్యాచ్‌లు జరిగే రోజున గంటన్నర పాటు వీక్షకులు ఏదో ఒక మ్యాచ్‌కు దూరమవుతారని ఓ బోర్డు అధికారి చెప్పాడు. అందుకు ఫ్రాంచైజీలు సుముఖత వ్యక్తం చేయడం లేదన్నాడు.

శ్రీలంక 222 ఆలౌట్

• బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

ఢాకా: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో బౌలర్ల ఆధిపత్యం కొనసాగడంతో.. బంగ్లాదేశ్ తొలిరోజే కష్టాల్లో పడింది. గురువారం మొదలైన టెస్టులో.. అబ్దుల్ రజాక్ (4/63), తైజుల్ ఇస్లాం (4/83) చెరో నాలుగు వికెట్లతో విజృంభించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 222 పరుగులకు కుప్పకూలింది. కుశాల్ మెండిస్ (68), రోషన్ సిల్వ (56) అర్ధ శతకాలు నమోదు చేశారు. అనంతరం బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 56/4తో కష్టాల్లో పడింది. లిటన్ దాస్ (25 బ్యాటింగ్), మీర్జా (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఒక్క రోజే 14 వికెట్లు నేలకూలడం విశేషం.

హైదరాబాద్ జోరుకు బ్రేక్

• విదర్భ చేతిలో భారీ ఓటమి
• విజయ్ హజారే టోర్నీ

హైదరాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ గెలుపు జోరుకు విదర్భ బ్రేకులు వేసింది. గ్రూప్-డిలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్‌ను 237 పరుగుల తేడాతో చిత్తు చేసింది. కెప్టెన్ ఫజల్ (103) చెలరేగడంతో విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 350 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత హైదరాబాద్ 34.2 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ తర్వాత కెప్టెన్ అంబటి రాయుడు (21) బరిలోకి దిగినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది.

జమ్మూ కశ్మీర్ గెలుపు: జింఖానాలో జరిగిన మ్యాచ్‌లో సౌరాష్ట్రపై జమ్మూ కశ్మీర్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. సౌరాష్ట్ర నిర్దేశించిన 268 పరుగుల లక్ష్యాన్ని జమ్మూ కశ్మీర్ 49 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అసోంపై కర్ణాటక, హరియాణాపై బరోడా, ఒడిశాపై పంజాబ్, రాజస్థాన్‌పై గోవా, తమిళనాడుపై ముంబై నెగ్గాయి.



నలభై తొమ్మిది ఓవర్ల పాటు క్రీజులో నిలిచి... 220 నిమిషాల పాటు పోరాడి.. 159 బంతులు ఎదుర్కొని.. సవాల్ విసిరే బౌలింగ్‌లో.. ప్రతికూల పరిస్థితుల్లో... సహచరులు వెనుదిరుగుతున్నా.. గుండెనిబ్బరంతో బ్యాటింగ్ చేసిన భారత సారథి విరాట్ కోహ్లీ 160 పరుగుల అజేయ సెంచరీతో మూడో వన్డేలో గొప్ప విజయాన్ని అందించాడు..! ఇంత గొప్పగా పోరాడాలంటే అంకిత భావమే కాదు.. ఆటలో తీవ్రత కూడా ముఖ్యం. విరాట్ కూడా అదే చెబుతున్నాడు. ఆటలో తీవ్రతే తనలో ఉత్తేజాన్ని నింపుతుందన్న కోహ్లీ అది కోల్పోయిన రోజు మైదానంలో ఏం చేయాలో తనకు తెలియదని అంటున్నాడు. అందుకే ఫిట్‌నెస్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తూ దాన్ని కాపాడుకుంటున్నానని తెలిపాడు. అలాగే, మూడు వన్డేల్లో 21 వికెట్లు కూల్చి ప్రత్యర్థికి సింహస్వప్నంగా మారిన మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌పై కోహ్లీ ప్రశంసలు కురిపించాడు. వాళ్ల బౌలింగ్ నమ్మశక్యంగా లేదన్న విరాట్ మూడో వన్డే ముగిశాక పలు విషయాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశాడు. ఆ వివరాలు అతని మాటల్లోనే..

ఆ తీవ్రత లేకుంటే ఆడలేనేమో!

దాన్ని కోల్పోతే మైదానంలో ఏం చేయాలో తెలియదు

• శారీరక ఫిట్‌నెస్‌పై ప్రధాన దృష్టి • మూడో వన్డేలో సెంచరీ సంతృప్తి నిచ్చింది • జట్టు అవసరాలు నా కష్టాన్ని మరిపిస్తున్నాయి
• కుల్దీప్, చాహల్ బౌలింగ్‌ను నమ్మకలేకపోతున్నా • భారత సారథి విరాట్ కోహ్లీ!

ఈ ఏడాది నేను 30వ పడిలోకి చేరబోతున్నా. నాకు 34-35 ఏళ్లు వచ్చినా కూడా ఇదే రకమైన క్రికెట్ ఆడాలనుకుంటున్నా. అందుకే, నేను ఇంత కఠినమ్మైన శిక్షణ తీసుకుంటున్నా. నేను తీవ్రతతో ఆడే వ్యక్తిని. ఒకసారి దాన్ని కోల్పోతే.. మైదానంలోకి వచ్చి ఏం చేయాలో నాకు తెలియదు. అందుకే దాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నా. అందుకోసం కఠినమ్మైన ట్రైనింగ్ తీసుకుంటున్నా. నా ఆహారపు అలవాట్ల (డైట్)పై శ్రద్ధ తీసుకుంటున్నా. ఆ కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కుతోంది. జట్టుకు అవసరం వచ్చిన ప్రతీసారి అండగా నిలబడాలి. ఒక క్రీడాకారుడిగా మనం ఇలాంటి రోజుల కోసం ఆత్రుతగా ఉండాలి.

జట్టు కోసం ఆడితేనే అద్భుతాలు..

మూడో వన్డేలో సెంచరీ ఎంతో సంతృప్తినిచ్చింది. నాణ్యమైన బౌలింగ్‌ను ఎదుర్కొని చేసిన పరుగులు ఇవి. ఆ మాటకొస్తే అంతర్జాతీయ స్థాయిలో పరుగులు చేయడం అంత సులభం కాదు. ప్రతీ పరుగు వెనుక కష్టం ఉంటుంది. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై కొన్నిసార్లు పరుగులు సులభంగా వస్తుంటాయి. కానీ, ఇలాంటి నాణ్యమైన బౌలింగ్‌ను ఎదుర్కొని నిలవడం అంత తేలిక కాదు. పరిస్థితులకు తగ్గట్టు నడుచుకోవాలి. ఆరంభంలో పేస్, బౌన్స్‌తో సవాల్ ఎదురవుతుంది. 30 ఓవర్ల తర్వాత వికెట్ నెమ్మదిగా మారుతుంది. అందువల్ల ఇన్నింగ్స్ ఆసాంతం ఆట తీరును మార్చుకుంటూ ఉండాలి. ఇలాంటి మారథాన్ ఇన్నింగ్స్‌లు ఆడేప్పుడు శారీరకంగా కూడా ఎంతో శ్రమించాల్సి వస్తుంది. ఈ మ్యాచ్‌లోనూ 90ల్లోకి వచ్చాక కాలి కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడ్డా. అయినా బ్యాటింగ్ కొనసాగించడం నాకెంతో సంతృప్తినిచ్చింది. ఆ తర్వాత క్రమంగా వికెట్లు పడుతుండడంతో పాటు నాలో శక్తి హరించుకుపోతోందని తెలిసి షాట్లు కొట్టడం మొదలుపెట్టా. వ్యక్తిగతంగా కాకుండా జట్టు కోసం అనుకుంటే మన శక్తికి మించిన పనులు కూడా చేయొచ్చు.

ఆట తీరు మార్చుకోవాలి..

మొదట బ్యాటింగ్ చేసేటప్పుడు, లక్ష్య ఛేదనలో నా ఆటతీరులో స్పష్టమైన తేడా ఉంటుంది. ఛేదనలో లక్ష్యం ఎంతో తెలుసు గనుక ఎలా ఆడాలో ముందుగానే తెలుస్తుంది. ఎప్పుడు దూకుడు పెంచాలి, సింగిల్స్ రాబట్టాలనే విషయాలపై అవగాహన ఏర్పడుతుంది. అదే మొదట బ్యాటింగ్ చేస్తే.. ఒకరు దూకుడుగా ఆడితే.. మరొకరు స్ట్రయిక్ రొటేట్ చేసే బాధ్యత తీసుకోవాలి. ధవన్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నేను సింగిల్స్ తీస్తూ స్ట్రయిక్ రొటేట్ చేసే బాధ్యత తీసుకొని మా భాగస్వామ్యం కొనసాగేలా చూశా. అతను అవుటైన తర్వాత నేను వేగం పెంచాలని అనుకున్నా కానీ, వెంటనే రెండు వికెట్లు పడ్డాయి. దానికి తగ్గట్టుగా ఆటతీరును మార్చుకున్నా.

సగం కూడా పూర్తి కాలేదు..

సౌతాఫ్రికాలో మేం తొలిసారి మూడు వన్డేలు నెగ్గాం. ఇప్పుడు 3-0తో ఆధిక్యంలో నిలిచాం. ప్రత్యర్థులు స్పిన్ ఆడడంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సిరీ...

మేం 6-0తో క్లీన్‌స్వీప్ చేసే అవకాశం ఉందని కొందరు చెబుతున్నారు. కానీ, దానికి నేను ఇప్పుడే అంగీకరించను. మా పనిలో ఇంకా సగం కూడా పూర్తి కాలేదు.మరో మూడు మ్యాచ్‌లు మిగిలున్నందున ఇప్పుడే వైట్‌వాష్ గురించి మాట్లాడడం సరి కాదు. అయితే ఇప్పటికైతే సిరీస్ కోల్పోయే అవకాశం లేకపోవడం సానుకూలాంశం. ఇది మేం మరింత ఉత్సాహంతో ముందుకెళ్లేందుకు దోహదపడనుంది.

ఆ ఇద్దరికీ హ్యాట్సాఫ్

చాహల్, కుల్దీప్ స్వదేశంలో ఫ్లాట్ వికెట్లపైనే రాణించారు గనుక ఇక్కడ కూడా వికెట్లు పడగొడతారని అనుకున్నాం. వాళ్లు మా నమ్మకాన్ని నిలబెట్టారు. పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పుడు నిలకడగా వికెట్లు రాబట్టారు. ఇప్పుడు చాలా మంది వాళ్లను టెస్టుల్లో (కుల్దీప్ టెస్టు అరంగేట్రం చేశాడు) చూడాలని కోరుకుంటున్నారు. కానీ, ఇప్పటికైతే అది కాస్త దూరంలోనే ఉంది. అయితే చాహల్, కుల్దీప్ తమ ఉనికిని గొప్పగా చాటుకుంటున్నారు. తమ స్పిన్‌తో ప్రత్యర్థిని చుట్టేయడం చూస్తుంటే నమ్మబుద్ధి కావడం లేదు. మూడో వన్డేలో 8 వికెట్లు తీయడం నిజంగా చాలా గొప్ప విషయం. కొన్ని పరుగులు ఇస్తున్నా కూడా ధైర్యం కోల్పోకుండా వికెట్లు తీస్తున్నారు. వారి గురించి వర్ణించడానికి నా దగ్గర మాటలు లేవు. అలాగే, ధైర్యంగా టాస్ బాల్స్ వేస్తూ బ్యాట్స్‌మెన్ క్రీజు ముందుకొచ్చి రిస్కీ షాట్లు ఆడేలా చేస్తున్నారు. ఈ విషయంలో వారికి హ్యాట్సాఫ్. పిచ్‌ల నుంచి కొంచెం సహకారం అందినా కూడా ఇద్దరూ తమ అత్యుత్తమ ఆటను కనబరుస్తున్నారు. ఫ్లాట్ పిచ్‌లపైనా ధైర్యంగా ఆడుతూ ఫలితాలు రాబడుతున్నారు. గత రెండు మ్యాచ్‌ల్లో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ మెజారిటీ వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య ఉన్న పెద్ద తేడా అదే.

అలా ఫలితం రాబడుతున్నారు

పరుగుల గురించి ఆలోచించకుండా చాహల్, కుల్దీప్ కేవలం వికెట్ల కోసం వెళ్లడం ఫలితాన్ని ఇస్తోంది. బౌలింగ్‌కు వచ్చిన ప్రతీసారి వికెట్లు కావాలని వారికి చెబుతున్నాం. ఇద్దరూ.. బ్యాట్స్‌మెన్ సౌకర్యవంతంగా లేని ప్రదేశాల్లో బంతులు సంధిస్తూ వాళ్లు అవుటయ్యేలా లేదా డిఫెన్స్ ఆడేలా చేస్తున్నారు. లైన్ అండ్ లెంగ్త్‌ను పక్కాగా అమలు చేస్తున్నారు. అది నిజంగా గొప్ప విషయం. ప్రతీ ఓవర్‌లో రెండు వికెట్లు తీసేలా బౌలింగ్ చేయడం చూస్తున్నారంటే తమ సామర్థ్యాలపై వారికి ఎంత నమ్మకం ఉందో చెప్పొచ్చు. విదేశాల్లో జరిగే వచ్చే వరల్డ్‌కప్‌లో కుల్దీప్ యాదవ్, చాహల్ కీలకం కానున్నారు.



మంచు సంరంభానికి సిద్ధం

• నేటి నుంచి వింటర్ ఒలింపిక్స్
• భారత్ నుంచి ఇద్దరే

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): రెండు కొరియా దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు.. ఉత్తర కొరియా అణుపరీక్షలు.. అమెరికా హెచ్చరికలు.. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న భయాందోళనలు.. తుఫానులా వచ్చి తెప్పల్లే తేలి పోవడంతో మంచు కొండల్లో విశ్వక్రీడా సంరంభానికి తెరలేవనుంది. శుక్రవారం 23వ వింటర్ ఒలింపిక్స్ గ్రాండ్‌గా ఆరంభం కానున్నాయి. ఈనెల 25 వరకు దక్షిణ కొరియా సిటీ ప్యాంగ్‌చాంగ్ వేదికగా విశ్వ క్రీడలు జరగనున్నాయి. ఆరంభోత్సవం కోసం కొరియా భారీగానే ఏర్పాట్లు చేసింది. 92 దేశాలకు చెందిన 2952 మంది అథ్లెట్లు 15 క్రీడా విభాగాల్లో 102 ఈవెంట్లలో పోటీపడనున్నారు. ఈ విశ్వ క్రీడల కోసం కొరియా రూ. 83 వేల కోట్ల రూపాయలను ఖర్చుచేసినట్టు సమాచారం. మొత్తం 13 వేదికల్లో పోటీలు జరగనున్నాయి. పోటీలకు ముందు ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన నార్త్ కొరియా ఆ తర్వాత మెత్తబడడం మెగా ఈవెంట్‌కు సానుకూలాంశం. ఇరు కొరియా దేశాల మధ్య సంయుక్త మహిళా హాకీ జట్టును బరిలోకి దించాలనే చర్చలు కూడా జరిగాయి. అయితే టోర్నీ ఆరంభానికి ముందు ఉత్తర కొరియా విడుదల చేసిన సైనిక కవాతు వీడియో మరోసారి కలకలం రేపుతోంది.

మస్కట్: తెల్లపులి 'సూహోరంగ' 2018 వింటర్ ఒలింపిక్స్ మస్కట్. కొరియా పురాణాలు, సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ఈమస్కట్‌ను రూపొందించారు.



ఇద్దరికి ప్రాతినిధ్యం: ఒలింపిక్స్‌లో ఇద్దరు ఆటగాళ్లు భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లూగ్ విభాగంలో కేశవన్, 15 కిమీ. ఫ్రీస్టైల్ స్కీయింగ్‌లో జగదీష్ సింగ్ బరిలోకి దిగనున్నారు. కేశవన్‌కు ఇదే చివరి ఒలింపిక్స్. జగదీష్‌పై పతక ఆశలు ఉన్నాయి. ఈ నెల 10, 11 తేదీల్లో కేశవన్ పాల్గొనే పోటీలు జరుగుతాయి. 16న జరిగే ఫ్రీస్టైల్ స్కీయింగ్‌లో జగదీష్ బరిలోకి దిగనున్నాడు.

మువ్వన్నెల రెపరెప..: వింటర్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో భారత మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. చెఫ్ డి మిషన్ హర్జీందర్ సింగ్ నేతృత్వంలో భారత బృందం గురువారం కొరియా చేరుకుంది. క్రీడా గ్రామం మేయర్.. భారత బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఇక్కడి ఉష్ణోగ్రత మైనస్ 20 డిగ్రీలు ఉన్నా ఇబ్బందులేమీ లేవని హర్జీందర్ చెప్పాడు. క్రాస్ కంట్రీ స్కీయర్ జగదీష్ సింగ్ ఇంకా కొరియాకు చేరుకోలేదు. శుక్రవారం అతడు క్రీడాగ్రామానికి చేరే అవకాశాలున్నాయి.



అర్జున్‌ను నాతో పోల్చొద్దు!

• టెండూల్కర్ సూచన

ముంబై: అర్జున్ టెండూల్కర్‌ను ఓ సాధారణ క్రికెటర్‌లాగే చూడాలని అతడి తండ్రి సచిన్ టెండూల్కర్ సూచించాడు. అర్జున్‌ను తనతో పోల్చడం సరికాదని, అతడిని కేవలం అర్జున్‌గానే పరిగణించాలని కోరాడు. ఇంటిపేరు అతడికి సమస్య కాకూడదని, కెరీర్‌లో అర్జున్ స్వేచ్ఛగా ఎదగాలని అన్నాడు. భవిష్యత్‌లో అర్జున్ మరో సచిన్ అయ్యే అవకాశాలున్నాయా? అని అడిగిన ప్రశ్నకు సచిన్ స్పందిస్తూ... 'లేదు. అలా పోల్చి చూడడం ఎంతమాత్రం సరికాదు. అతడు అర్జున్ మాత్రమే. అలాగే ఉండనివ్వండి. నా తండ్రి నాకు ఎలాంటి స్వేచ్ఛను ఇచ్చాడో అదే తనూ కోరుకుంటున్నాడు. సచిన్ కుమారుడిగా అతడిపై ఒత్తిడి ఉంటుంది. కానీ తన దృష్టి మొత్తం క్రికెట్‌పైనే ఉండాలని తండ్రిగా నేను భావిస్తున్నాను. అలా అయితేనే భవిష్యత్‌లో వచ్చే ఎత్తుపల్లాలను దీటుగా ఎదుర్కోగలుగుతాడు' అని సచిన్ పేర్కొన్నాడు.

సెహ్వాగ్ మెరిసినా..

• డైమండ్స్ లెవెన్ ఓటమి • ఐస్ క్రికెట్



సెయింట్ మోర్టిజ్ (స్విట్జర్లాండ్): టెస్ట్ క్రికెట్, వన్డే క్రికెట్, టీ-20, టీ-10 క్రికెట్..ఈ క్రీడలో ప్రవేశించిన కొత్త ఆట ఐస్ క్రికెట్..స్విట్జర్లాండ్‌లోని సెయింట్ మోర్టిజ్‌లో చలికి గడ్డకట్టుకుపోయిన సరస్సు తెల్లటి మైదానంలా మారింది. దానిపై రెండు మ్యాచ్‌ల క్రికెట్ సిరీస్ గురువారం మొదలైంది. తొలి మ్యాచ్‌లో డ్యాషింగ్ బ్యాట్స్‌మన్ వీరేంద్ర సెహ్వాగ్ మెరుపులు మెరిపించినా అతడి సారథ్యంలోని ప్యాలెస్ డైమండ్స్ లెవెన్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో షాహిద్ అఫ్రీది లెవెన్ (రాయల్స్ లెవెన్) ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన డైమండ్స్ లెవెన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 164 పరుగులు చేసింది. మట్టి మైదానమైనా..ఐస్ గ్రౌండ్ అయినా సంబంధంలేదు..బాదుడే బాదుడు అన్న చందంగా 40 ఏళ్ల వయస్సులోనూ విజృంభించి సెహ్వాగ్ (31 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 62) జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్‌కు చెందిన ఆండ్రూ సైమండ్స్ 40 పరుగులు (30బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్) చేశాడు. పాక్ పేసర్ అబ్దుల్ రజాక్ (4/18), షోయబ్ అక్తర్ (2/32) సత్తా చాటారు. అనంతరం ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ ఒవైస్ షా (34 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 74 నాటౌట్) విరుచుకు పడడంతో రాయల్స్ లెవెన్ 165 పరుగుల లక్ష్యాన్ని 15.2 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కలిస్ (36) గ్రేమ్ స్మిత్ (23) రాణించారు. అఫ్రీది (0) విఫలమయ్యాడు. రమేష్ పవార్ రెండు, అగార్కర్, మలింగ ఒక్కో వికెట్ పడగొట్టారు. రెండో మ్యాచ్ శుక్రవారం జరగనుంది.



డివిల్లీర్స్ వచ్చేశాడు..

చివరి మూడు వన్డేలకు దక్షిణాఫ్రికా జట్టు

కేప్‌టౌన్: ఆరు వన్డేల సిరీస్‌లో వరుసగా మూడు పరాజయాలతో కుదేలైన దక్షిణాఫ్రికా జట్టుకు కాస్త ఊరట. స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిల్లీర్స్ తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా తొలి మూడు వన్డేలకు అతడు దూరమైన విషయం తెలిసిందే. మిగిలిన మూడు వన్డేల కోసం 15 మందితో జట్టును ప్రకటించారు. మార్‌క్రమ్ కెప్టెన్‌గా కొనసాగుతుండగా డివిల్లీర్స్, డుమిని, ఆమ్లా, మిల్లర్ బ్యాటింగ్ బాధ్యతలు తీసుకోనున్నారు.

జట్టు: ఆమ్లా, డుమిని, మార్‌క్రమ్, డివిల్లీర్స్, మిల్లర్, మోర్కెల్, మోరిస్, జోండో, రబాడ, తాహిర్, షంసీ, క్లాసెన్, ఎంగిడి, ఫెహ్లుక్వాయో, బెహర్డీన్.

ఓడినా...క్వార్టర్స్ ఖరారు

• ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు కూడా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. గ్రూప్-డబ్ల్యూలో గురువారం తమ ఆఖరి పోరులో మహిళల జట్టు 1-4తో జపాన్ చేతిలో పరాజయం పాలైంది. అయితే ఒక గెలుపు, మరో ఓటమితో రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరుకుంది. ఈ గ్రూప్‌లో జపాన్ అగ్రస్థానం దక్కించుకుంది. ఇక పురుషుల జట్టు గ్రూప్-డిలో ఫిలిప్పీన్స్, మాల్దీవులపై గెలుపుతో బుధవారమే క్వార్టర్స్ స్థానం ఖాయం చేసుకుంది. అయితే గురువారం ఇండోనేసియా చేతిలో 2-3 ఓడింది. కానీ రెండు విజయాలు ఒక ఓటమితో రెండో స్థానంలో నిలిచి తుది ఎనిమిది జట్లలో చోటు దక్కించుకుంది..

సింధు తప్ప అంతా...: పటిష్ఠ జపాన్‌తో పోరులో సింధు తప్ప భారత షట్లర్లంతా ఓటమి చవిచూశారు. తొలి మ్యాచ్‌లో ఒలింపిక్ రజత పతక విజేత సింధు 21-19, 21-15 స్కోరుతో ప్రపంచ నెంబర్ 2 అకానె యమగూచిని చిత్తుచేసింది. రెండో సింగిల్స్‌లో శ్రీకృష్ణప్రియ 12-21, 10-21 స్కోరుతో ప్రపంచ 13వ నెంబర్ క్రీడాకారిణి సయాక సాటొ చేతిలో ఓడిపోయింది. మూడో సింగిల్స్‌లో అశ్విని పొన్నప్ప, డబుల్స్‌లో సంయోగితా ఘోర్పడే-ప్రజక్త సావంత్, పొన్నప్ప-సిక్కిరెడ్డి కూడా పరాజయం చవిచూశారు.

శ్రీకాంత్ ఓటమి: ఇండోనేసియాతో ఆఖరి గ్రూప్ సమరంలో..జొనాథన్ క్రిస్టీతో తొలి సింగిల్స్‌లో 17-21, 17-21 స్కోరుతో కిడాంబి శ్రీకాంత్ వరుస గేముల్లో ఓటమి పాలవడంతో భారత్ 0-1తో వెనుకంజలో నిలిచింది. కానీ మొదటి డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి, రెండో సింగిల్స్‌లో ప్రణీత్ గెలవడంతో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే రెండో డబుల్స్‌లో నెగ్గి ఇండోనేసియా 2-2తో సమం చేసింది. ఇక నిర్ణాయక మూడో సింగిల్స్‌లో సుమిత్ రెడ్డి 21-21, 7-21 స్కోరుతో చేతులెత్తేయడంతో భారత్ 2-3తో ఓడిపోయింది..


సింధు

సరోగసి విధానంలోనూ.. 180 రోజుల మాతృత్వ సెలవులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: సరోగసి విధానం ద్వారా తల్లి అయ్యే కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కూడా మాతృత్వ సెలవులు ఇవ్వాలని సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మహిళా ఉద్యోగులు కన్నతల్లులు కాకున్నా.. అద్దెగర్భం ద్వారా సంతానాన్ని పొందితే.. వారికి సాధారణ గర్భవతులతో సమానంగా 180 రోజుల పాటు సెలవులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే.. వారు సెలవు దరఖాస్తుతోపాటే.. అన్ని వివరాలను తమ ఉన్నతాధికారులకు అందించాల్సి ఉంటుంది. అధికారులు వారి సెలవులను తిరస్కరిస్తే.. అందుకు కారణాలను స్పష్టం చేయాలి. 2015లో సరోగసి ద్వారా ఇద్దరు కవలలకు తల్లి అయిన ఓ కేంద్రీయ విద్యాలయ టీచర్ కేసులో.. ఢిల్లీ హైకోర్టు తీర్పును అనుసరించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ పేర్కొంది. సరోగసి విధానంలో గర్భాన్ని మోసే మహిళ, బిడ్డను పొందే తల్లి.. ఇద్దరూ కేంద్ర ప్రభుత్వోద్యోగులే అయితే.. సెలవులను సర్దుబాటు చేసే విచక్షణాధికారాన్ని సంబంధిత విభాగాధిపతులు తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.



దుక్కి దున్నేస్తా..

వ్యవసాయ పనుల్లో యజమానికి చేదోడువాదోడుగా ఉంటున్న ఈ శునకం పేరు రాంబో. ట్రాక్టర్‌ను అవలీలగా నడిపేయగలదు. లాన్‌ను కత్తిరించడం, పొలం దున్నడం, కంకులు కోయడం, పొదలను కత్తిరించడం వంటి పనులు చేస్తూ యజమాని ఆల్బర్ట్ రీడ్‌కు పనిభారం తగ్గిస్తోంది. ఉత్తర ఐర్లండ్‌లోని కౌంటీ డౌన్‌లో రాంబోను చూసేందుకు, సెల్ఫీ దిగేందుకు జనం క్యూ కడుతున్నారట!





ప్రజలను బానిసలుగా చూస్తున్న సీపీఎం

- అభివృద్ధిలో త్రిపుర వెనుకబాటు
- మాణిక్‌ను విసిరేసి.. 'హీరా' ధరించండి: మోదీ

సోనాముర, ఫిబ్రవరి 8: త్రిపురలోని వామపక్ష ప్రభుత్వం... ప్రజలను బానిసలుగా చూస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. అభివృద్ధిలోనూ రాష్ట్రం వెనుకబడి ఉందన్నారు. ఈ నెల 18న అసెంబ్లీ ఎన్నికలున్నందున గురువారం త్రిపురలో రెండు ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ఆయన పాల్గొన్నారు. మాణిక్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. "రాష్ట్రంలోని కమ్యూనిస్టులకు ప్రజలు భయపడుతున్నారు. రేషన్ కార్డు కావాలంటే ఆ పార్టీ ఆఫీసుకు వెళ్లాలి. ఏదైనా హత్య జరిగితే సీపీఎం అనుమతి తీసుకున్నాకే పోలీసులు కేసు పెడుతున్నారు. ఏ అవసరం వచ్చినా ప్రజలు తమ మీదే ఆధారపడేలా కమ్యూనిస్టులు చేస్తున్నారు. బానిసత్వానికి ఇది కొత్త రూపం" అని ప్రధాని విమర్శించారు. త్రిపుర సర్వతోముఖాభివృద్ధి కోసం బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. "తమ జీవితం బాగుండాలని కోరుకుంటూ ప్రజలు మాణిక్(రత్నం)ను ధరిస్తుంటారు. కానీ ఇక్కడి మాణిక్(ముఖ్యమంత్రి) మాత్రం ప్రజలకు శాంతిసంపదలతో కూడిన మెరుగైన జీవనాన్ని కల్పించడంలో విఫలమయ్యారు. అందుకే.. ఆ మాణిక్ వద్దు. దాన్ని విసిరేసి... 'హీరా'ను ధరించండి" అని పిలుపిచ్చారు. హీరా(హెచ్ఐఆర్ఏ) అంటే... హైవే, ఇంటర్‌నెట్, రోడ్‌వేస్, ఎయిర్‌వేస్... అని మోదీ అభివర్ణించారు. అభివృద్ధి విషయంలో రాష్ట్ర రూపురేఖలు మారాలంటే మెరుగైన రవాణా సదుపాయాలతోనే సాధ్యమన్నారు. తేయాకు తోటలకు పేరుగాంచిన త్రిపుర అభివృద్ధికి మరో మూడు 'టీ'లు అవసరమన్నారు. అవి... ట్రేడ్, టూరిజం, ట్రైనింగ్ (యువతకు ఉపాధి కోసం) అని మోదీ వివరించారు.

పాత మాట!



సభ సాక్షిగా మళ్లీ నీళ్లు చల్లిన జైట్లీ

ఏపీకి 'సాయం'పై లోక్‌సభలో ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అదే మాట! పదేపదే పాడిన పాత పాట! 'ఏదో చేస్తారు... ఇంకేదో చెబుతారు' అని ఆశించిన నవ్యాంధ్ర జనుల ఆశలపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బండెడు నీళ్లు చల్లారు. 'మై ఫ్రెండ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అని సంబోధిస్తూనే, 'ఏపీ పట్ల మాకు చాలా సానుభూతి ఉంది' అంటూనే... తాజాగా మరోసారి మొండిచేయి చూపించారు. జైట్లీ గురువారం లోక్‌సభలో బడ్జెట్‌పై ప్రసంగించారు. విపక్షాల నిరసనల మధ్యే ఆయన మాట్లాడారు. ఏపీకి ఇవ్వబోయేది ఏమీ లేదని ముందుగానే సంకేతాలు పంపించారు. 'ఏపీకి నిధులు ఇవ్వాలని అడుగుతున్నారు. కానీ... కేంద్రానికి ఆర్థికంగా భారంగా ఉంది. ఆర్థిక భారం తగ్గితే.. ఏపీలాంటి రాష్ట్రాలకు నిధులు ఇచ్చే అవకాశం ఉంది' అని అన్నారు. దీంతో... టీడీపీ, వైసీపీ ఎంపీలు ఒక్కసారిగా 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రసంగం చివర్లో... ఏపీపై జైట్లీ ప్రకటన చేశారు. "రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీని ఏర్పాటు చేసినప్పుడు మనలో కొందరం నవ్యాంధ్ర ప్రజల హక్కుల కోసం పోరాడాం. తెలంగాణ ఏర్పాటును సమర్థించినప్పటికీ, విభజన వల్ల సీమాంధ్రకు ఆర్థికంగా నష్టం జరుగుతుంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఒక నిర్దిష్టమైన ప్యాకేజీని చట్టంలోనే పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో చాలా అంశాలు ఉన్నాయి. వీటిలో చాలావరకు ఇప్పటికే అమలయ్యాయి. మరికొన్ని... అమలు జరుగుతూ ఉన్నాయి" అని జైట్లీ పేర్కొన్నారు. జైట్లీ మరోమారు పాతపాటే పాడుతున్నారని దీంతో అర్థమైపోయింది. టీడీపీ ఎంపీలు నినాదాలను మరింత ముమ్మరం చేశారు. 'పాత మాటలే చెబుతున్నారు' అని అరిచారు. దీనిని పట్టించుకోకుండా జైట్లీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. "కీలకమైన విద్యా సంస్థలు తెలంగాణలో ఉండటంతో... వాటిని నవ్యాంధ్రలోనూ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. విభజన చట్టంలో హామీ ఇచ్చినట్లుగా ఏపీలో పెద్దసంఖ్యలో నెలకొల్పిన సంస్థలకు నిధులు ఇచ్చాం. ఒక సంస్థ ఏర్పాటు చేసిన తర్వాత... వాటికి నిధులు వస్తూనే ఉంటాయి" అంటూ ఏమిచ్చాం, ఎంతిచ్చాం అనే వివరాలను చెప్పకుండా వదిలేశారు. కొత్త భూసేకరణ చట్టం మేరకు పెరిగిన పరిహారం సంగతేమిటని టీడీపీ ఎంపీలు గట్టిగా అరిచారు.

మిగిలింది రెండేనట...

'ఏపీకి అన్నీ ఇచ్చేశాం! మిగిలింది రెవెన్యూ లోటు భర్తీ, స్పెషల్ ప్యాకేజీ మాత్రమే' అనేలా మాట్లాడారు. వీటిని ఏపీ ప్రజల సంతృప్తి మేరకు, రెండు మూడు రోజుల్లో (కపుల్ ఆఫ్ డేస్) పరిష్కరిస్తామన్నారు. "స్పెషల్ ప్యాకేజీల్లో భాగమైన విదేశీ సహాయ ప్రాజెక్టు (ఈఏపీ)లపై గతనెల 3వ తేదీన సీఎం చంద్రబాబు లేఖ రాశారు. ఈఏపీ నిధులను నాబార్డు ద్వారా ఇప్పించాలని కోరారు. బుధవారం ఏపీ అధికారులు ఢిల్లీకి వచ్చి... కేంద్ర వ్యయ విభాగం అధికారులతో చర్చలు జరిపారు. దీనిపై కొంత అరేంజ్‌మెంట్ జరుగుతోంది. దీనిని త్వరలోనే పరిష్కరిస్తాం. ఇక... రెవెన్యూ లోటు భర్తీపైనా చర్చలు జరిగాయి. ఏపీ అధికారులు కొంత ఎక్కువ కోరుకుంటున్నారు. మాకూ, వాళ్లకూ మధ్య కొంత 'అంతరం' ఉంది. దానిని తగ్గిస్తాం" అని చెప్పారు. ఇక... రైల్వే జోన్, పెట్రోలియం వంటి ఇతర సంస్థల ఏర్పాటు వంటివీ ఉన్నాయన్నారు. "వీటిపై ఆయా శాఖలతో చర్చలు జరుపుతున్నాం. ఏపీ ప్రజల సంతృప్తి మేరకు.. ఉత్తమ మార్గాన్ని గుర్తించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం. ఆంధ్రప్రదేశ్ పట్ల చాలా సానుభూతితో ఉన్నాం" అని జైట్లీ ప్రకటించారు. నినాదాల మధ్యనే తన ప్రసంగాన్ని ముగించారు.


యూపీఏకి ఎన్డీఏకు ఎంతో తేడా

కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: "ఇబ్బందులుంటాయని తెలుసు.. సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందనీ తెలుసు.. అయినా అనేక సాహసిక నిర్ణయాలు తీసుకున్నాం. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ఇన్‌సాల్వెన్సీ కోడ్ లాంటి సాహస నిర్ణయాలు కాంగ్రెస్ తీసుకోగలదా? యూపీఏకు ఎన్డీఏకు అదీ తేడా! మాకు సంక్రమించిన ఆర్థిక పరిస్థితి వేరు.. మేం చేస్తున్నది పూర్తిగా తద్భిన్నం" అని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. బడ్జెట్‌పై జరుగుతున్న చర్చకు గురువారం రాజ్యసభలో ఆయన బదులిచ్చారు. ఈక్విటీలపై దీర్ఘకాల కేపిటల్ గెయిన్స్ టాక్స్ విధింపును సమర్థించుకున్నారు. ఎల్టీసీజీ టాక్స్ వల్లే స్టాక్ మార్కెట్ కుప్పకూలిందన్నది అవాస్తవం.. దానికి అంతర్జాతీయ కారణాలున్నాయని జైట్లీ వివరించారు. వేతనజీవులకు, పెన్షనర్లకు దాదాపు రూ.12వేల కోట్ల మేర లబ్ధి చేకూర్చే నిర్ణయాలు తీసుకున్నామన్నారు. యూపీ ఏ హయాంలో ఏనాడైనా అంతర్జాతీయ సంస్థలు భారత ఆర్థికరంగం భేష్ అని పొగిడాయా? అని జైట్లీ ప్రశ్నించారు. అంతకుముందు ప్రసంగించిన కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి పి చిదంబరం- ఆయుష్మాన్ భారత్, రైతులకు ఒకటిన్నర రెట్లు మద్దతుధర, ఉపాధి కల్పన.. మూడు జిమ్మిక్కులని అభివర్ణించారు. బడ్జెట్ పెద్ద ద్రోహమన్నారు.

అది శూర్పణఖ నవ్వే!

- కేంద్రమంత్రి రిజిజు ఫేస్‌బుక్ పోస్ట్
- విమర్శలు రావడంతో తొలగింపు
- మోదీ కామెంట్‌పై స్తంభించిన రాజ్యసభ



రిజిజు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన ఫొటో ఇదే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంలో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరిని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రకంపనలు రేగుతూనే ఉన్నాయి. ఈ వ్యవహారంపై గురువారం రాజ్యసభ స్తంభించింది. సభ సమావేశమైన వెంటనే కాంగ్రె స్ సభ్యులు లేచి.. సభాపతి ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించాలంటూ నినాదాలు చేశారు. చైర్మన్ వెంకయ్యనాయుడు సంయమనం పాటించండని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ సభ్యులు వినకపోవడంతో.. సభను గంటపాటు వాయిదావేశారు. ఆధార్ కార్డును దేశంలో ప్రవేశపెట్టిన ఘనత బీజేపీదేనని, 1998లోనే అద్వానీ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో దీని ప్రస్తావన ఉందని మోదీ బుధవారం అన్నపుడు.. రేణుక గట్టిగా నవ్వారు. సభాపతి వెంకయ్యనాయుడు వెంటనే ఆమెను మందలిస్తూ.. ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో అలా నవ్వడం సబబు కాదన్నారు. అపుడు మోదీ కలగజేసుకుని- "సభాపతిగారూ! ఆమెను నియంత్రించవద్దు... రామాయణ్ సీరియల్ తరువాత అలాంటి నవ్వు విని చూసే భాగ్యం నాకు దక్కింది" అని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో ఈ నవ్వు వ్యవహారంపై విపరీతంగా వ్యాఖ్యానాలు వచ్చాయి. రేణుకను రామాయణంలోని వివిధ పాత్రలతో పోలుస్తూ కామెంట్లు వెలువడ్డాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు ఈ వివాదాన్ని మరింత ముందుకు తీసికెళ్లారు. రామానంద్ సాగర్ తీసిన రామాయణ్ సీరియల్‌లో శూర్పణఖ-రామలక్ష్మణుల సంవాదానికి సంబంధించిన వీడియో క్లిప్‌ని తన ఫేస్‌బుక్ పేజ్‌లో పోస్ట్ చేశారు. దాంతోపాటు.. రాజ్యసభలో మోదీ రేణుకనుద్దేశించి చేసిన వ్యాఖ్యను, దానికి మిగిలిన సభ్యులు పగలబడి నవ్వడాన్ని రిజిజు జత చేశారు. విమర్శలు రావడంతో దాన్ని తొలగించారు. బీజేపీ ఐటి సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయ కూడా ప్రధాని ప్రసంగం క్లిప్‌ను పోస్ట్ చేసి 'మోదీ ఏ పాత్రతో పోల్చారో చెప్పుకోండి చూద్దాం' అని ప్రశ్నను సంధించారు. నెటిజన్ల నుంచి శూర్పణఖ, తాటకి.. అని వచ్చిన కామెంట్లనూ పెట్టారు. దీనికి స్పందనగా.. 'ప్రధాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సభ్యులందరికీ మర్యాద ఇవ్వాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరుతున్నాం' అని కాంగ్రెస్ గురువారం నాడు ట్వీట్ చేసింది.

ఇలా బయట మాట్లాడితే కేసే: రేణుక

"ఆధార్ కార్డు అవసరం లేదని గతంలో ఓ పెద్ద ప్రసంగమే చేశారు మోదీ. ఇపుడేమో ఆధార్‌ను పుట్టించినదే తామే అని చెబితే.. నవ్వొచ్చింది. ఆయన నన్ను కించపరుస్తూ మాట్లాడారు. ప్రధాని స్థాయి వ్యక్తి అలానా మాట్లాడేది? సభలో కాబట్టి సరిపోయింది, ఇదే కామెంట్‌ను ఆయన బయట చేసి ఉండుంటే చట్టప్రకారం ఓ కేసు నమోదై ఉండేది" అని రేణుక అన్నారు.

బూట్ల కోసం హంతకుడైన పెళ్లి కొడుకు!

బాదౌన్, ఫిబ్రవరి 8: పెళ్లి ఉత్సవాల్లో మునిగి తేలుతున్న వరుడు.. అనుకోని ఘటనతో హంతకుడిగా మారిన సంఘటన యూపీలోని బాదౌన్‌లో చోటు చేసుకుంది. సూరజ్‌పూర్ గ్రామంలో బుధవారం సురేంద్ర అనే వ్యక్తి పెళ్లి వేడుకల ముందు.. అతడి బూట్లు చోరీకి గురయ్యాయి. రాంశరణ్ (42) అనే వ్యక్తిపై అనుమానంతో.. వరుడితో పాటు అతని నలుగురు స్నేహితులు చితకబాదారు. తీవ్రంగా గాయపడ్డ బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరిపై హత్య కేసు నమోదైంది.

జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: చానళ్లలో ప్రసారమవుతున్న జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించాలన్న ప్రతిపాదన లేదని కేంద్రం తెలిపింది. అధిక కొవ్వు పదార్థాలున్న ఉత్పత్తుల ప్రకటనలను ప్రసారం చేయొద్దని 9 ఆహార పదార్థాల తయారీ సంస్థలు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నాయని కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ లోక్‌సభలో తెలిపారు. కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉన్న ఉత్పత్తుల ప్రకటనలపై నిషేధం విధించాలని నిపుణుల కమిటీ సూచించినట్లు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించొద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యంగా అధికారిక కార్యక్రమాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు, వ్యక్తులకు అప్పగించొద్దని సూచించింది. 'పార్లమెంట్ సభ్యులతో రాష్ట్ర అధికారుల ప్రవర్తన, ప్రొటోకాల్ ఉల్లంఘనలు' అనే అంశంపై పార్లమెంటరీ కమిటీ గత నెల 4వ తేదీన ఒక నివేదికను లోక్‌సభకు సమర్పించింది.

విరాళాల కేసులో ఖలీదా జియాకు ఐదేళ్ల శిక్ష



ఢాకా, ఫిబ్రవరి8: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు, బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) అధ్యక్షురాలు బేగం ఖలీదా జియా(72)కు చుక్కెదురైంది. విదేశీ విరాళాల దుర్వినియోగం కేసులో ఢాకా ప్రత్యేక కోర్టు ఆమెను దోషిగా నిర్ధారించింది. ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది.

నా కొడుకుపై అక్రమ కేసు

- ఆర్మీ మేజర్ తండ్రి సుప్రీంలో వ్యాజ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: షోపియాన్ కాల్పుల ఘటనకు సంబంధించి తన కుమారుడు ఆర్మీ మేజర్ ఆదిత్య కుమార్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాల్సిందిగా కోరుతూ ఆయన తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించారు. వెంటనే సీఎం ముఫ్తి ఆదేశం మేరకు మేజర్‌పై జమ్మూకశ్మీరు పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. 10 గఢ్వాల్ రైఫిల్స్‌లో మేజర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు ఆదిత్యపై తప్పుడు పద్ధతిలో నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేశారని ఆయన తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ కరమ్‌వీర్ సింగ్ వ్యాజ్యంలో పేర్కొన్నారు.

పత్రాలు ఆంగ్లంలో సమర్పించండి

- అయోధ్య కేసులో.. పార్టీలకు సుప్రీం

న్యూఢిల్లీ/బెంగళూరు, ఫిబ్రవరి 8: రాజకీయంగా సున్నితమైన బాబ్రీ మసీదు-రామజన్మభూమి కేసు పూర్తిగా ఓ 'భూ వివాదం' అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్.ఎ.నజీర్‌లతో కూడిన సుప్రీం ప్రత్యేక ధర్మాసనం గురువారం ఈ కేసు తుది విచారణను చేపట్టింది. అలహాబాద్ హైకోర్టు 2010లో వెలువరించిన తీర్పు నేపథ్యంలో దాఖలైన 14అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. అన్ని పక్షాలు తాము సమర్పించిన పత్రాలను రెండు వారాల్లోగా ఆంగ్లంలోకి అనువదించి అందజేయాలని ఆదేశించింది. ఈ కేసులో అప్పీళ్లను మార్చి 14న తాము విచారించనున్నట్టు వెల్లడించింది. ఈ కేసులో ఆధారమైన దేశీయ పుస్తకాల సారాంశాన్ని కూడా ఆంగ్లంలోకి అనువదించి రెండువారాల్లోగా దాఖలు చేయాలని ఆదేశించింది. మరోవైపు ఈ అంశంపై కోర్టు బయట పరిష్కారానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్(ఏవోఎల్) ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవి శంకర్ చర్యలు చేపట్టారు. గురువారం ఆయన ముస్లిం నేతలతో బెంగళూరులో సమావేశం నిర్వహించారు.



రాహుల్ నాక్కూడా బాసే: సోనియా

- భావసారూప్య పార్టీలతో కలిసి పోటీ
- ఎన్నికలు ముందుకు జరగొచ్చు...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: నరేంద్ర మోదీ పాలనతో దేశప్రజలు విసిగిపోయారని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో భావసారూప్యం ఉన్న పార్టీలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. "అత్యంత ప్రతికూల పరిస్థితుల మధ్య -గుజరాత్ ఎన్నికల్లో మనం రాణించాం. రాజస్థాన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయి. గెలుపు తేడాను గమనిస్తే ప్రజలు మార్పు కోరుతున్న విషయం అర్థమవుతోంది. కర్ణాటకలోనూ మనమే గెలుస్తాం.. 2014 ఎన్నికల్లో మనం కొద్దిగా గతి తప్పాం. ఇపుడు పార్టీ పునరుద్ధరణ రాహుల్‌తో మొదలవ్వాలి.. మీరు గత 19 ఏళ్ల పాటు నాకు ఎలా సహకరించారో రాహుల్‌కూ అలానే సహకరించాలి" అని పేర్కొన్నారు. "బీజేపీని ఓడించి తిరిగి లౌకిక, ప్రజాస్వామ్య, సహనశీల, సమ్మిళిత ప్రభుత్వాన్ని నెలకొల్పాలి. ఇందుకు మన సిద్ధాంతాలతో, ఎజెండాతో ఏకీభవించే పార్టీలతో కలిసి పోరాడాలి" అని పిలుపునిచ్చారు. 2004లో మాదిరిగా ఎన్నికలు ముందు జరిగినా జరగొచ్చని, సిద్ధంగా ఉండాలని సూచించారు. రాహుల్ ప్రస్తుతం తనకూ బాసేనని ఆమె వ్యాఖ్యానించారు. "ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టడమే కాదు, విస్తృతంగా ప్రచారం చేయాలి. అదే సమయంలో మన పార్టీ పట్ల ఓ సానుకూల వాతావరణం ఏర్పరచాలి" అని విజ్ఞప్తి చేశారు. దేశంలోని బీజేపీ-వ్యతిరేక శక్తులన్నీ కాంగ్రెస్ నేతృత్వంలో ఏకమవుతున్నాయని యువ నేత సచిన్ పైలట్ అన్నారు. సమయం వచ్చినపుడు అన్నీ బయటపడతాయన్నారు. 2019 ఎన్నికల్లో మోదీని ఎదుర్కొనే సత్తా రాహుల్‌కు మాత్రమే ఉందని, అన్ని నిర్ణయాలకూ కేంద్రాన్ని జవాబుదారీ చేస్తున్నారని, బీజేపీ సర్కార్‌ను ఆయన వేటాడుతున్న వైనం విపక్షాల్లో ధైర్యాన్ని, విశ్వాసాన్ని నింపిందని పేర్కొన్నారు.

నాకూ హెచ్ఐవీ ఉందేమో?

భయం గుప్పిట్లో బంగర్‌మవులోని 5 వేల మంది

వైద్య పరీక్షలకు భయపడుతున్న ప్రజలు

బంగర్‌మవు(యూపీ), ఫిబ్రవరి 8: ఉత్తరప్రదేశ్‌లో చిన్న పట్టణం బంగర్‌మవు. మొన్నటివరకు అక్కడున్న వారంతా హాయిగా ఎవరి పనులు వారు చేసుకుంటూ జీవించేవారు. ఇంతలో ఊహించని సంఘటన జరిగింది. గత ఏడాది నవంబరులో అధికారులు అక్కడ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల్లో 13 మందికి హెచ్ఐవీ ఉందని తేలింది. అనుమానం వచ్చిన అధికారులు జనవరిలో మరో సారి వైద్య శిబిరం ఏర్పాటు చేసి 270 మందిని పరీక్షించారు. ఈసారి మరో 25 మందికి హెచ్ఐవీ ఉన్నట్లు తేలింది. ఒకేసారి 38 మందికి హెచ్ఐవీ సోకడంతో బంగార్‌మౌ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో విస్తుగొలిపే విషయాలు భయటపడ్డాయి. స్థానికంగా ఉన్న రాజేంద్ర యాదవ్ అనే నకిలీ వైద్యుడు తక్కువ ధరకే వైద్యాన్ని అందిస్తూ, ఒకే సిరంజితో అనేక మందికి ఇంజక్షన్లు ఇచ్చినట్లు గుర్తించారు. దీని వల్లనే హెచ్ఐవీ వ్యాప్తి చెంది ఉంటుందని భావించిన అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం అందరికీ తెలియడంతో దాదాపు 5వేల మంది హెచ్ఐవీ భయంతో ఆందోళన చెందుతున్నారు. బంగర్‌మవుకు చెందిన దీప్ చాంద్ (పేరు మార్చాం).. స్థానికంగా మార్కెట్లో కూలీగా పనిచేసేవాడు. ఒక రోజు వెన్ను నొప్పిగా ఉండటంతో రాజేంద్ర యాదవ్ దగ్గర చికిత్స చేయించుకున్నాడు. 3 నెలల తర్వాత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోగా అతనితో పాటు, భార్య, కుమారుడికి కూడా హెచ్ఐవీ సోకినట్లు తేలింది. ప్రస్తుతం అతని నలుగురు కూతుళ్లకు కూడా హెచ్ఐవీ సోకిందేమోనని ఆందోళన చెందుతున్నాడు. వారికి హెచ్ఐవీ పరీక్ష చేయించాలంటేనే భయపడిపోతున్నాడు. ఇది ఒక దీప్ చాంద్ బాధనే కాదు. అక్కడున్న 5 వేల మందిలోనూ అదే భయం.. అదే బాధ. సమీప గ్రామంలోని ఆరేళ్ల బాలిక పరిస్థితి కూడా ఇంతే. రాజేంద్ర యాదవ్ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దాదాపు ప్రతిరోజు 150 మంది రోగులను పరిశీలించేవాడట. తక్కువ ధరకే చికిత్స లభిస్తుండటంతో అతని వద్దకు ప్రజలు ఎక్కువగా వచ్చేవారు. ఎవరికైనా ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత దాని నల్లా నీటితో కడిగి మళ్లీ ఉపయోగించేవాడని దీప్ చాంద్ చెప్పాడు. ఇప్పుడు హెచ్ఐవీ భయంతో పట్టణ ప్రజలు తీవ్ర మదన పడుతున్నారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలంటేనే జంకుతున్నారు.



నకిలీ వైద్యుడు రాజేంద్ర యాదవ్

హెచ్ఐవీ ఎలా వస్తుంది?

- హెచ్ఐవీ సోకిన వ్యక్తి రక్తాన్ని వేరొకరికి ఎక్కించడం ద్వారా..
- ఎయిడ్స్ రోగికి ఉపయోగించిన సిరంజిలను ఇతరులకు వాడటం.
- గర్భిణికి ఎయిడ్స్ ఉంటే పిండానికి జరాయువు ద్వారా సోకుతుంది.
- లైంగిక సంబంధాల వల్ల అధికంగా హెచ్ఐవీ సోకుతుంది.

ఈ వైరస్ కొన్ని సందర్భాల్లో మనిషి శరీరం నుంచి బయటకు వచ్చిన తర్వాత కొన్ని వారాల వరకు కూడా బతికే అవకాశముంది. బాడీ ఫ్లూయిడ్‌లో వైరస్ ఎంత మేరకు ఉంది? ఉష్ణోగ్రత, ఎసిడిటీ, సూర్యరశ్మి వంటి విషయాల ఆధారంగా వైరస్ బతికే అవకాశముంటుందని నిపుణులు చెబుతున్నారు.





చోల్ ఐలింగ్

మత్తిచ్చి.. సూట్‌కేస్‌లో కుక్కి

బ్రిటిష్ మోడల్ కిడ్నాప్ సెక్స్‌బానిసగా 2కోట్లకు బేరం

రోమ్, ఫిబ్రవరి 8: యువతి పట్ల ఆ కిడ్నాపర్లది ఎంత పైశాచికత్వమో! ఆమెకు మత్తుమందు ఇచ్చి.. కాళ్లుచేతులు కట్టేసి.. సూట్‌కేస్‌లో కుక్కి.. కారులో ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటికి మత్తునుంచి తేరుకొని భయంతో కేకలు వేసిన ఆమెను తీవ్రంగా కొట్టారు. తమ రహస్య స్థావరానికి తీసుకెళ్లి బంధించారు! ఇదంతా ఆమెను సెక్స్ బానిసగా ఇంటర్నెట్‌లో వేలం పెట్టేందుకు కిడ్నాపర్లు చేసిన దుర్మార్గం! ఓ 20 ఏళ్ల బ్రిటిష్ మోడల్‌కు ఇటలీలో ఎదురైన భయానక అనుభవమిది! బాధితురాలిని చోల్ ఐలింగ్‌గా గుర్తించారు. ఐలింగ్‌ను నెట్‌లో రూ.2 కోట్లకు అమ్మేందుకు కిడ్నాపర్లు బేరం పెట్టారు. అయితే, వారి ప్రయత్నం ఫలించలేదు. చివరికి ఆమెను బ్రిటిష్ రాయబార కార్యాలయం ఎదుట కారులోంచి తోసేసి పరారయ్యారు. లుకాజ్ పావెల్ హెర్బా, మిచెల్ హెర్బా సోదరులు ఈ ఘటనకు పాల్పడినట్టుగా గుర్తించిన పోలీసులు నిందితులిద్దరినీ అరెస్టు చేశారు. దారుణ ఘటనను గుర్తుచేస్తేనే ఐలింగ్ భయంతో వణికిపోతోంది. నిరుడు జూలైలో జరిగిన ఘటన వివరాలను విచారణ సందర్భంగా ఐలింగ్ వెల్లడించారు. నల్లని గ్లవ్స్ ధరించి ఓ వ్యక్తి తనపై అకస్మాత్తుగా దాడిచేసి, కదలకుండా పట్టుకున్నాడని.. ఇంతలో మరో వ్యక్తి వచ్చి తన కుడిచేతికి ఇంజక్షన్ ఇచ్చాడని తెలిపారు.



సౌదీ అరేబియా పర్యటనలో భాగంగా రాజు సల్మాన్ బిన్ అబ్దులజీజ్‌తో విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ భేటీ అయ్యారు. ఆ దేశ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఒంటెల పోటీల గురించి సుష్మ ఈ సందర్భంగా ఆయనను అడిగి తెలుసుకున్నారు.

- గల్ఫ్ ప్రతినిధి, ఆంధ్రజ్యోతి

వారికి 6% గ్రీన్‌కార్డులే!

2016లో ఉద్యోగ ఆధారిత వీసాలకు దక్కినవి ఇవే..

వాషింగ్టన్, ఫిబ్రవరి 8: అమెరికా ప్రభుత్వం 2016లో జారీ చేసిన గ్రీన్‌కార్డుల్లో 6 శాతమే ఉద్యోగ ఆధారిత విభాగాలకు చెందాయట! వీటి కోసం భారత్‌కు చెందిన నిపుణులైన ఉద్యోగులు పదేళ్ల కంటే ఎక్కువగా ఎదురు చూడాల్సి వస్తోందని అధికార రిపబ్లికన్ పార్టీ ఓ నివేదికలో తెలిపింది. నవంబరు 2017 నాటికి ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డుల కోసం 1.12 లక్షల మంది ఎదురుచూస్తున్నట్లు వివరించింది. 2016లో 12 లక్షల గ్రీన్‌కార్డులు జారీచేయగా.. అందులో 1.40 లక్షల ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డులు ఉన్నట్లు వివరించింది. ఇది మొత్తం కార్డుల్లో కేవలం 12 శాతమని తెలిపింది. వీటిలోనూ సగం కార్డులు ఉద్యోగుల భార్యాపిల్లలకే సరిపోయాయని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.